www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 216 | శనివారం 27-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

కనుల పండువగా...

- అతిథులుగా 10 ఆసియాన్ దేశాధినేతలు
- సత్తా చాటిన త్రివిధ దళాలు

న్యూఢిల్లీ : గణతంత్ర వేడుకల్లో 10 ఆశియా దేశాధినేతలు పాల్గొనడం ఇదే మొదటిసారి కావడంతో 69వ గణతంత్ర దినోత్సవం దేశచరిత్రలో 'చారిత్రకం'గా నిలవనుంది. మయన్మార్ ముఖ్యనేత అంగ్ శాన్ సూకీ, వియత్నాం ప్రధాని న్యుయెన్ జ్వన్ ఫుక్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రొడ్రిగో డుటర్టె, థాయి ప్రధాని జెన్ ప్రయుత్ ఛాన్-ఓ-ఛా, సింగపూర్ ప్రధాని లీ హెసీన్ లూంగ్, బ్రునే సుల్తాన్ హాజీ హస్సనుల్ బొల్కోయి, ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో, మలేషియా ప్రధాని నజీబ్ రజాక్, లావోస్ థాంగ్లూన్ ప్రధాని సిసౌలిత్, కంబోడియా ప్రధాని హున్ సేన్ గౌరవ అతిథులుగా విచ్చేశారు. 100 అడుగుల వేదికపై ప్రధాని మోడీ, రాష్ట్రపతి కోవింద్‌లతో పాటుగా ఆశీనులయ్యారు. కొందరు సతీసమేతంగా హాజరయ్యారు. గణతంత్ర వేడుకలను ఆసక్తిగా

- మిగతా 2 లో


గణతంత్ర వేడుకల్లో పెరేడ్‌ను తిలకిస్తున్న దక్షిణాసియా దేశాల అధినేతలు







వీసాల జారీలో లాటరీకి స్వస్తి...!

- ట్రంప్ ప్రతిపాదన
- భారతీయ ఉద్యోగులకు భారీగా లబ్ధి

వాషింగ్టన్ : వీసాల జారీలో ఇకపై లాటరీ పద్ధతిని ఉపసంహరించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించారు. తాజా ప్రతిపాదనతో దేశీయ ఐటీ ఉద్యోగులతోపాటు ముఖ్యంగా కొన్ని దశాబ్దాలుగా గ్రీన్ కార్డు కోసం వేచి చూస్తున్న భారతీయ ఐటీ నిపుణులకు భారీగా లబ్ధి చేకూరనుంది. ఈ ప్రతిపాదనతో నైపుణ్యం ప్రాతిపదికగా ఎంతో మందికి మేలు చేకూరనుంది. ఈ బిల్లును కాంగ్రెస్ ఆమోదిస్తే, అత్యధిక నైపుణ్యం కలిగిన భారత వలసదారులకు గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్

- మిగతా 2 లో

పారిశ్రామికవేత్తలుగా దళితులు

'దళిత తేజం' ప్రారంభ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర అమరావతి : దళితులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాలులో శుక్రవారం 'దళిత తేజం-తెలుగుదేశం చంద్రన్న ముందడుగు' అనే కార్యక్రమాన్ని, అందుకు సంబంధించిన బ్రోచర్‌ని ఆయన ప్రారంభించారు.

సీఎం మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి బడుగు బలహీన వర్గాల వారికి సమాన హక్కులు కల్పించారని చెప్పారు. అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. రాజధాని అమరావతిలో అంబేద్కర్ స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. దళిత తేజం కార్యక్రమం పేరిట దళితులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రణాళిక సిద్ధం చేశామని సీఎం తెలిపారు. ఇప్పటికే ఇన్నోవా కార్లు ఇచ్చి డ్రైవర్లని ఓనర్లుగా మార్చామని పేర్కొన్నారు. దళితుల పిల్లలకి ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇచ్చి వారిని వ్యాపారవేత్తలుగా తయారుచేస్తామని అన్నారు. చంద్రన్న ముందడుగు కార్యక్రమంతో అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

82 రోజుల కార్యక్రమం

దళిత తేజం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 82 రోజుల పాటు నిర్వహిస్తామని చంద్రబాబు తెలిపారు. దళితులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తెలియచేయటంతోపాటు వారి సమస్యలు వారు పరిష్కరించుకొనేలా సమర్థులైన నాయకులుగా తీర్చిదిద్దుతామన్నారు. దళిత తేజం ద్వారా నియోజకవర్గానికి 5 వేల మందితో, జిల్లాల్లో 10 వేల మందితో సభలను నిర్వహించాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితుల అభివృద్ధికి చేయూత ఇవ్వటంతో పాటు దళిత విద్యార్థుల విదేశీ విద్యకి అధిక ప్రాధాన్యత ఇచ్చామని వివరించారు. రిపబ్లిక్ డే రోజున దళితుల కోసం మంచి కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్, వైసీపీలు పూర్తిగా దళితులను విస్మరించారని ఆరోపించారు. ఎస్సీ

- మిగతా 2 లో

సమగ్రాభివృద్ధే లక్ష్యం..

సీఎం లేకుండానే...

- అబుదాబిలో నిలిచిపోయిన విమానం
- సాయంత్రానికి అమరావతికి చేరిన బాబు
- ఏపీలో ఆలస్యమైన జెండావందనం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లేకుండానే 69వ గణతంత్ర వేడుకలు జరిగాయి. పెట్టుబడులే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఇద్దరు మంత్రులు, పలువురు ఉన్నతాధికారులతో ఈనెల 23 నుంచి 25 వరకూ మూడ్రోజులపాటు దావోస్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఆయన ఈనెల 27 వరకూ దావోస్‌లో పర్యటించాల్సి ఉంది. అయితే

- మిగతా 2 లో

- కృష్ణా,గుంటూరు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చంద్రన్న విలేజ్‌మాల్స్
- అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి నిర్మాణం
- పటిష్టంగా సంక్షేమ పథకాల అమలు
- నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు..
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విభజన కష్టాల్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు.విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో 69వ గణతంత్ర దినోత్స వేడుకల్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలకు గవర్నర్ నరసింహన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి..జాతీయ జెండాను ఎగురవేశారు.అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు.గవర్నరు ప్రసంగిస్తూ మహనీయుల త్యాగాలు మరువరానివని కొనియాడారు.రాష్ట్ర విభజనతో నెలకొన్న సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుని నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్తున్నామని

- మిగతా 2 లో



నేటి నుంచి అనంతలో పవన్ యాత్ర



- వివరాలు 11 లో

ఇదీ లోకం!



హక్కుల రక్షణకు పోరు

- ప్రమాదంలో లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలు
- భారత్ హిందూత్వ దేశం కాకూడదు..
- మనది అత్యుత్తమ రాజ్యాంగం
- పేదలకు దక్కని గణతంత్ర ఫలాలు : సురవరం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రాజ్యాంగాన్ని కాలరాసేందుకు, మార్చివేసేందుకు జరుగుతున్న కుట్రలను ప్రతిఘటించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు, హక్కుల రక్షణ కోసం పోరు సాగించాలన్నారు. రాజ్యాంగ, పౌర హక్కులను హిందూత్వ ఫాసిస్టు శక్తులు అణచివేస్తున్నాయని, రాజ్యాంగం కల్పించిన ఏ హక్కు అమలుకు నోచుకోవడం లేదన్నారు. 69వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని సీపీఐ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం

- మిగతా 2 లో

ఐసిస్ ఆత్మాహుతి బాంబర్ అరెస్టు

కాశ్మీర్ రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో విధ్వంసానికి కుట్ర

- వివరాలు 9 లో



భగవత్ ధిక్కారం

కేరళ స్కూల్‌లో త్రివర్ణ పతాకావిష్కరణ

ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించిన వైనం

కేసు నమోదు చేయాలని సీపీఎం, కాంగ్రెస్ డిమాండు

9లో



ఏకమవుతున్న విపక్షాలు

- రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం పేరిట
- ముంబైలో భారీ ర్యాలీకి హాజరైన సీపీఐ, కాంగ్రెస్, ఎన్‌సీపీ, టీఎంసీ తదితర పార్టీలు

- వివరాలు 9 లో

మృత్యు టైరు....

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ | ఐదుగురి దుర్మరణం



- 14 మందికి తీవ్ర గాయాలు
- ప.గో జిల్లా అనంతపల్లి వద్ద ఘోర ప్రమాదం

విశాలాంధ్ర-ఏలూరు : పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామం వద్ద గల ఎర్ర కాల్వ వంతెనపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అయిదుగురు దుర్మరణం చెందారు. పద్నాలుగా మంది తీవ్ర గాయాలపాయ్యారు. రాజమండ్రి నుంచి ఏలూరు వస్తున్న ఆర్‌టీసీ బస్సును లారీ ఢీ కొన్న ఈ విషాద ఘటనలో మరణించిన

- మిగతా 2 లో

రాష్ట్రపతి కంటతడి ..



న్యూఢిల్లీ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అత్యున్నత సేవా పురస్కారమైన అశోకచక్ర అవార్డును అందజేశారు.

ఈ అవార్డును అందించే సమయంలో రాష్ట్రపతి ఒకింత ఉద్వేగానికి గురయ్యారు. కార్పొరల్ జ్యోతిప్రకాశ్ నిరాలా...శరీరంలో బుల్లెట్లు దిగినా తలొగ్గకుండా ధైర్యసాహసాలు ప్రదర్శించి వీరమరణం చెందారు. కీలకమైన ఎన్‌కౌంటర్‌లో భద్రతాదళాలకు విజయాన్ని అందించారు. వీరమరణం పొందిన ఆయనకు అశోకచక్రను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రాజ్‌పథ్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఆయన తల్లి మాలతీదేవి, భార్య సుష్మనంద్‌లు ఈ పతకాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించారు. ఆ సమయంలో రాష్ట్రపతి ఉద్వేగభరితులయ్యారు. కళ్లజోడు తీసి కన్నీటిని తుడుచుకున్న దృశ్యాలు కనిపించాయి.

దక్షిణ కొరియా ఆసుపత్రి పేలుడు :41కి చేరిన మృతులు




మిల్యాంగ్ : దక్షిణ కొరియాలోని మిల్యాంగ్ సిటీలోని సిజోంగ్ ఆసుపత్రి పేలుడు ఘటనలో మరణించిన వారి సంఖ్య 41కి చేరింది. సుమారు 70మందికిపైగా క్షతగాత్రులైనట్లు సమాచారం. వీరందరికీ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సనందిస్తున్నారు. క్షతగాత్రుల్లో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు యాన్‌హాప్ న్యూస్ ఏజన్సీ ఒక కథనాన్ని ప్రసారం చేసింది. ఆసుపత్రి మొదటి అంతస్థులోని అత్యవసర గదిలో తొలుత మంటలు రాజుకున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 38మంది రోగులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించినట్లు అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆసుపత్రిలో సుమారు 100 మంది రోగులు చికిత్స పొందుతున్నారని తెలుస్తోంది.

సిరియాలో దాడులు విస్తరిస్తామని టర్కీ బెదిరింపు



అంకారా : తాము ఉగ్రవాదులుగా పరిగణిస్తున్న సిరియా కుర్దిష్ ఉగ్రవాదుల ఏరివేత కోసం అవసరమైతే సిరియాలోని ఉత్తర నగరాలకూ దాడులు విస్తరిస్తామని టర్కీ బెదిరిస్తోంది. టర్కీ అధ్యక్షుడు రెసిప్ తాయిప్ ఎర్డోగన్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఇరాక్ వరకు విస్తరించిన తమ సరిహద్దు తీరంలో ఒక్క ఉగ్రవాది కూడా సమూల నిర్మూలన జరిగే వరకు దాడులు విస్తరిస్తూనే ఉంటామన్నారు. సిరియా తిరుగుబాటుదారులకు మద్దతుగా సైనిక, వాయుసేన, ఆర్టిలరీలతో వైపీజీకి వ్యతిరేకంగా టర్కీ ఈదాడులు చేపడుతోంది. నిషేధిత కుర్దిస్తాన్ వర్కర్స్‌పార్టీ (పీకేకే)కు అనుబంధంగా వైపీజీ పని చేస్తోందనేది అంకారా మనోగతంగా ఉంది. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా టర్కీ చేపట్టిన మిలటరీ చర్యను పరిమితం చేయాలంటూ అమెరికా మరో వంక కోరుతోంది. అయితే, ఈ పరిమితి అనేది అస్పష్టంగా ఉందని టర్కీ బదులిస్తోంది.





స్వాప్నికులకు 10-12 ఏళ్లలో

అమెరికా పౌరసత్వం

వాషింగ్టన్: చిన్నతనంలోనే తమ తల్లిదండ్రులతో అమెరికాకు విచ్చేసి పెరిగి పెద్దయిన తరువాత కూడా ఎలాంటి అధికారిక ధృవీకరణ పత్రాలను పొందలేకపోయిన స్వాప్నికుల (డ్రీమర్స్)కు పౌర సత్వం కల్పించే యోచన ఉన్నట్లు అమెరికా ప్రభుత్వం తెలిపింది. శ్వేత సౌధం జారీ చేసిన ఒక ప్రకటన ప్రకారం అమెరికాలో ప్రస్తుతం ఏడు లక్షల మంది స్వాప్నికులున్నారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామ హయాంలో వీరికి తాత్కాలిక నివాస హోదా కల్పించారు. కాగా, అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదిస్తున్న పథకం ప్రకారం రానున్న 10 లేదా 12 సంవత్సరాల్లో స్వాప్నికులకు అమెరికా పౌరసత్వం కల్పించే అవకాశాలున్నాయి. అమెరికా చట్టాలకు అనుగుణంగా మంచి పౌరులుగా అధికారులు గుర్తించిన వారికి ఈపథకం వర్తిస్తుందని సారాంశంగా ఉంది.

బ్రిటన్ ఫస్ట్‌కు క్షమాపణ యోచనలో ట్రంప్



వాషింగ్టన్ : బ్రిటన్ ఫస్ట్ గురించి తనకేమీ తెలియక రెచ్చగొట్టే ధోరణిలో ట్విటర్లో వరస ట్వీట్లు చేయడం జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వాస్తవాలను గుర్తించిన తరువాత క్షమాపణ తెలిపేందుకు సిద్ధపడుతున్నట్లు చెప్పారు. ఐటీవీ నిర్వహించే గుడ్‌మార్నింగ్ బ్రిటన్ వ్యాఖ్యాత మోర్గాన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈమేరకు తెలిపారు. కేవలం ఇస్లామిక్ ఉగ్రవాదం పట్ల తనకున్న వ్యతిరేకత కారణంగానే రెచ్చగొట్టే ట్వీట్లు చేసినట్లు ఆయన అంగీకరించారు. బ్రిటన్‌ఫస్ట్ గ్రూపు గురించి బ్రిటన్‌లో ఎక్కువ తెలిసి ఉండవచ్చన్నారు. అయితే అమెరికాలో దాని గురించి తెలిసింది చాల తక్కువన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) సదస్సులో పాల్గొన్న ట్రంప్‌ను మోర్గాన్ ఇంటర్వ్యూ చేశారు. ఆదివారం రాత్రి 10గంటలకు ఈఇంటర్వ్యూను ఐటీవీలో ప్రసారం చేయనున్నారు.

తాలిబన్, హక్కానీ ఉగ్రవాద నాయకులపై అమెరికా నిషేధాంక్షలు




వాషింగ్టన్ : తాలిబన్, హక్కానీ ఉగ్రవాద సంస్థలకు చెందిన ఆరుగురు నాయకులపై అమెరికా ప్రభుత్వం తాజాగా నిషేధాంక్షలు జారీ చేసింది. ఇందులో నలుగురు తాలిబన్, ఇద్దరు హక్కానీ ఉగ్రవాద తండాలకు చెందిన వారున్నారు. ఆరుగురు ఉగ్రవాదులను అంతర్జాతీయ ఉగ్రవాదులుగా అమెరికా ప్రకటించింది. సంకీర్ణ బలగాలపై దాడులు, స్మగ్లింగ్, వ్యక్తులను కిడ్నాప్ చేయడం వంటి దుర్మార్గాలకు పాల్పడినట్లు అభియోగాన్ని ప్రకటించింది. తమ భూభాగంలో ఉగ్రవాదులకు, ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయమివ్వబోమని హామీ ఇవ్వాల్సిందిగా పాకిస్తాన్‌ను అమెరికా కోరింది. ఆఫ్ఘనిస్తాన్‌లోని అనేక అమెరికా సంస్థలు లక్ష్యంగా తాలిబన్ ఉగ్రవాద దాడులకు పాల్పడుతోంది. అనేక కిడ్నాపులు చేసింది అదే తీరులో ఆఫ్ఘన్‌లోని భారత ప్రయోజనాలకూ విఘాతం కలిగించే ఉగ్రవాద దాడులు జరిపింది. ఉగ్రవాదుల విషయంలో పాకిస్తాన్‌వన్నీ వచ్చి అబద్ధాలు, మోసాలేనని 2018లో చేసిన తొలి ట్వీట్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఉగ్రవాదం, ఆర్థిక నిఘా సహాయ మంత్రి సిగల్ మండేల్కర్ మాట్లాడుతూ తమ పరిధిలోని ఉగ్రవాదులకు సంబంధించిన ఆస్థులను బ్లాక్ చేయడం జరుగుతుందన్నారు వీరితో అమెరికా పౌరులు ఎవరూ సంబంధాలను కొనసాగించరాదన్నారు

ఫిలిప్పీన్స్‌లో మూడు నెలలుగా

'అగ్నిపర్వత' కష్టాలు

81వేల మంది నిరాశ్రయులు

లెగాజిపీ సిటీ(ఫిలిప్పీన్స్) : ఫిలిప్పీన్స్‌ను మూడు నెలలుగా అగ్నిపర్వత విస్ఫోటన కష్టాలు వెన్నాడుతున్నాయి. సెంట్రల్ అల్బే ప్రావిన్స్‌లోని మయన్ అగ్నిపర్వతం నుంచి గత మూడు నెలలుగా లావా, అగ్నికీలలు ఎగస్తున్నాయి. దీని ఫలితంగ ఇప్పటి వరకు సుమారు 81వేల మంది నిరాశ్రయులయారని అధికారులు తెలిపారు తాత్కాలిక శిబిరాల్లో వీరికి ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. గత మూడు నెలలుగా అత్యయిక స్థితిని ఎదుర్కొంటున్నామని ఫిలిప్పీన్స్ విపత్తు నివారణ శాఖ అధికార ప్రతినిధి రొమినా మరసిగన్ మీడియాకు తెలిపారు. శిబిరాల్లో తలదాచుకున్న వారికి సరిపడా ఆహార నిల్వలున్నాయన్నారు. అయితే, నిరంతరం ఎగసి పడే దుమ్ము,ధూళికి శ్వాస కోశ సంబంధిత రుగ్మతలు ప్రబలే ప్రమాదాన్ని శంకిస్తున్నామన్నారు. అగ్నిపర్వత విస్ఫోటన కారణంగా రద్దు చేసిన విమానాల సంఖ్య



97కు చేరుకుంది. ఆరోగ్య కార్యకర్తలు ఉచిత వైద్య సేవలందిస్తున్నారు. వయోవృద్ధులకు అవసరమైన ఔషధాలను సరఫరా చేస్తున్నారు. పిల్లలకు అవసరమైన ఆహార, ఔషధాలనూ అందిస్తున్నామన్నారు.

నేపాల్‌కు భారత్ నజరానా



ఖాట్మండు : 69వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నేపాల్‌కు భారత్ పలు రూపాల్లో నజరానాలు అందజేసింది. శుక్రవారం ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం దగ్గర రాయబారి మంజీవ్ సింగ్ పూరి జాతీయ పతాకావిష్కరణ ఘనంగా జరిపారు. అనంతరం వివిధ ఆసుపత్రులకు 30 అంబులెన్సులు, సేవా సంస్థలకు ఆరు బస్సులను అందజేశారు. దేశ వ్యాప్తంగా విస్తరించిన 41 విద్యా సంస్థలకు పుస్తకాలను బహూకరించారు. నేపాల్ సైనిక బ్యాండు మేళం వీనుల విందైన రాగాలను వినిపించింది. వేలాది మంది విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఏటా నిర్వహించే విధంగానే ఈ ఏడూ అమర వీరుల భార్యలు ఏడుగురిని సత్కరించారు. దివంగతులైన నలుగురు సైనికుల కుటుంబాల్లో ఒకరి వంతున ఉద్యోగం కల్పించారు. అంగవైకల్యానికి గురయిన సైనికులకు నేపాల్ కరెన్సీలో 4.41 కోట్లను కేటాయించారు. అదనంగా బ్లాంకెట్లను పంపిణీ చేశారు.

కనుల పండువగా...

(మొదటిపేజీ తరువాయి)

తిలకించారు. కాషాయం, ఎరుపు, పచ్చ 'సఫా' (తలపాగా) ధరించి, తనదైన శైలి వస్త్రధారణలో వేడుకల్లో పాల్గొన్న మోడీ ముందుగా అమర్‌జవాన్ జ్యోతి వద్ద త్రివిధ దళాధిపతులు, రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్నారు. పరేడ్‌లో భాగంగా ఆసియా దేశాల పతాకలతో ప్రత్యేక మార్చ్ నిర్వహించారు. ది అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ నేషన్స్ (ఏషియన్)లో థాయిలాండ్, వియత్నాం, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, మయన్మార్ (బర్మా), కంబోడియా, లావోస్, బ్రున్ సభ్యదేశాలుగా ఉన్నాయి. ఆశియా దేశాలతో భారత్ సత్సంబంధాలను కలిగివుండడం తెలిసిందే. అయితే తమ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు భారత 69వ గణతంత్ర వేడుకలు వేదికగా నిలిచాయి. గురువారం 10 ఆసియాన్ దేశాధినేతల పేరిట పద్మా అవార్డులను ప్రకటించడం విదితమే. 17ఏళ్లుగా భారత్, ఆసియా దేశాల మధ్య పెట్టుబడులు దాదాపు 70 బిలియన్ డాలర్లకుపైగా ఉన్నాయి. ఈ క్రమంలో భారత్ మొత్తం ఎఫ్‌డిఐ 17శాతానికిపైగా ఉంది. అదే సమయంలో ఆసియా దేశాల్లో భారత్ పెట్టుబడులు 40 బిలియన్ డాలర్ల మేర ఉంది. వీరి సంయుక్త జీడీపీ 3.8 టిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది.

సమగ్రాభివృద్ధే లక్ష్యం..

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు.ప్రజల కాంక్షలకు అనుగుణంగా పలు సంక్షేమ పథకాల్ని నూతన పంథాలో అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.సంక్షేమ పథకాలపై 80శాతం మంది ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారని తెలిపారు.రాష్ట్రంలో ఆహార భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టామని చెప్పారు. ఏపీలో 1.42కోట్ల బీపీఎల్ కుటుంబాలకు చేయూత ఇచ్చేందుకుగాను బియ్యం, గోధుమ పిండి, కందిపప్పు, రాగిపిండి తదితర సబ్సిడీలను అందజేస్తున్నామన్నారు.రూపాయికే కిలో బియ్యం, చంద్రన్న సంక్రాంతి కానుక, చంద్రన్న రంజాన్ తోఫా, చంద్రన్న క్రిస్మస్ కానుక పేరుతో..ఆయా పండుగల ద్వారా ఆరు రకాల నిత్యవసర వస్తువుల్ని ఉచితంగా రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్నామని చెప్పారు.2017-18లో 12.46లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లను దీపం పథకం కింద ఇచ్చామని, దీంతో ఎల్పీజీ కుటుంబాల సంఖ్య రాష్ట్రంలో 54.39కు చేరిందని వివరించారు.కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు ప్రాజెక్టుగా చంద్రన్న విలేజ్‌మాల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు.వాటిలో తక్కువ ధరకే వినియోగ వస్తువులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు.మొదటి దశలో 6,500 చౌకధరల దుకాణాలలో అందజేస్తామన్నారు.

కాపుల రిజర్వేషన్ల కోసం కృషి..

బీసీలకు నష్టం తలెత్తకుండా కాపులకు 5శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానించిందన్నారు.బీసీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.10లక్షలు ఇస్తున్నామని, బీసీ సబ్‌ప్లాన్ నిధులు పెంచుతున్నామని చెప్పారు.వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చాలని కేంద్రాన్ని కోరతామని అన్నారు.ఎస్సీ,ఎస్టీల ఇళ్లకు 75 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని చెప్పారు.పట్టిసీమతో కృష్ణా-గోదావరి నదులను అనుసంధానించామని వివరించారు.మూడేళ్లలో రాష్ట్రంలో రూ.7,621కోట్ల అంచనాలతో 10,752 కిలోమీటర్ల పొడవైన రహదారులు, 167 బ్రిడ్జీలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు.విశాఖ-చెన్నయ్ పారిశ్రామిక కారిడార్‌ను రూ.3,806కోట్లతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.2019 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి గ్రావిటీ ద్వారా నీరందిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ మిషన్ ద్వారా 179 ప్రాజెక్టులను రూ.3.762కోట్లతో వివిధ నగరాల్లో చేపడుతున్నామని వివరించారు.

నాలుగు కారిడార్ల అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్

రాష్ట్రంలో నాలుగు కారిడార్ల అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌ను రూపొందించామని, దానికి డీఐపీపీ అనుమతి లభించిందని చెప్పారు.కృష్ణపట్నం పోర్టు ప్రాంతంలో కోస్టల్ ఎకనామిక్ జోన్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన రాజధాని నిర్మించేందుకుగాను ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నామని అన్నారు.రాష్ట్రాన్ని ఓ హైటెక్ హబ్‌గా మారుస్తున్నామని, యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

కదంతొక్కిన కంటిజెనట్లు- ఇండియన్ ఆర్మీకి ఉత్తమ బహుమతి

గణతంత్ర దినోత్సవ సందర్భంగా సైనిక దళాలు కవాతులతో కదం తొక్కాయి.ఒక్కసారిగా స్టేడియం మారుమ్రోగింది.కవాతు చేసిన వివిధ కంటిన్‌జెంట్లలో మొదటి బహుమతి ఇండియన్ ఆర్మీ సైనికులకు, రెండో బహుమతి 16వ బెటాలియన్‌కు దక్కాయి. నాన్ క్యాడర్‌లో మొదటి, రెండో బహుమతులను వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ, ఎన్‌సీసీ బెటాలియన్(బాలికలకు) దక్కాయి.ప్రదర్శించిన శకటాలలో విద్యాశాఖకు చెందిన సర్వశిక్ష అభియాన్‌కు ప్రథమ బహుమతి లభించింది.గృహనిర్మాణకు ద్వితీయ, అటవీశాఖలకు తృతీయ బహుమతులు లభించాయి.

దేవాన్ష్‌తో హాజరైన సీఎం సతీమణి

గణతంత్ర వేడుకలకు ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి, మనుమడు దేవాన్ష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా దేవాన్ష్‌తో పలువురు ప్రజాప్రతినిధులు ముద్దాడారు.వేడుకల్లో దేవాన్ష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు..

గణతంత్ర దినోత్స వేడుకలకు శాసన మండలి చైర్మన్ ఎఎన్‌ఎండి ఫరూక్, శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాదురావు, రాష్ట్ర హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప,మంత్రులు కామినేని శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, కిమిడి కళా వెంకట్రావ్, శిద్ధా రాఘవరావు,డీజీపీ పి.మాలకొండయ్య, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌చంద్ర,ఏపీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు, శాసన మండలి విప్ బుద్దా వెంకన్న,విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్, కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గద్దె అనురాధా, కృష్ణాజిల్లా కలెక్టరు బి.లక్ష్మీకాంతం, విజయవాడ నగర మేయర్ కోనేరు శ్రీధర్, విజయవాడ సీపీ గౌతమ్ సవాంగ్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు హాజరయ్యారు. గణతంత్ర వేడుకలు ముగిసిన అనంతరం గవర్నరు, ఆయన సతీమణి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు అధికారులు అల్పాహార విందులో పాల్గొన్నారు.

సీఎం లేకుండానే...

(మొదటిపేజీ తరువాయి)

విజయవాడలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే విధంగా ఆయన ప్రయాణంలో మార్పులు చేశారు. దీంతో దావోస్‌లో పర్యటనను ముగించుకుని గురవారం తిరుగు పయనమైన చంద్రబాబు బృందం ముందుగా నిర్దేశించిన విధంగా వేకువ జాముకు ఢిల్లీకి, అక్కడ నుంచి ఉదయం 7 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకోవాల్సి ఉంది. అయితే పొగమంచు కారణంగా ఆయన ప్రయాణిస్తున్న విమానం అబుదాబిలో నిలిచిపోయింది. దీంతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నారనే సమాచారం అధికారులకు అందింది. ఈ విషయమై అధికారులు ఏవిధమైన ప్రకటన చేయలేదు. ప్రతికూల వాతావరణం కారణంగా ఆయన ప్రయాణిస్తున్న విమానం ఆలస్యమైనట్లు అధికారపార్టీకి చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరితోపాటు మనుమడు దేవాన్ష్, పలువురు మంత్రులు హాజరయ్యారు. పొగమంచు తగ్గడంతో అబుదాబి నుంచి మధ్యాహ్నం ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రానికి గన్నవరం వచ్చారు. అక్కడ నుంచి నేరుగా ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకొని దళితతేజం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇదిలా ఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ముఖ్యమంత్రి గణతంత్ర వేడుకల్లో పాల్గొనకపోవడం ఇదే ప్రథమమని రాజకీయవర్గాలు స్పష్టం చేస్తున్నాయి.సాధారణంగా వేడుకలు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్యలో జరగాల్సి ఉంది. అనంతరం అల్పాహారవిందు కార్యక్రమం జరుగుతుంది. అయితే ఈ సారి 11.28 గంటలకు గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, మధ్యాహ్నం 12.35 గంటలకు రాష్ట్రీయ రెడ్ సెల్యూట్‌తో గవర్నర్‌కు వీడ్కోలు పలకడంతో కార్యక్రమం ముగిసింది. దీంతో మధ్యాహ్నం భోజనం చేయాల్సిన సమయంలో అల్పాహార విందు ఏర్పాటు చేసారేమిటీ? అని అధికారుల్లో కొందరు గుసగుసలాడినట్లు సమాచారం. ఉదయం జరగాల్సిన పతాకావిష్కరణ కార్యక్రమం మధ్యాహ్నానికి మారడంతో దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఆలస్యంగా ఏపీలో జెండా పండుగ జరిగిందనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

మృత్యు టైరు...

(మొదటిపేజీ తరువాయి)



అయిదుగురిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందినవారు. తూర్పుగోదావరి జిల్లా తుని పట్టణానికి చెందిన గెల్లా లక్ష్మి(50), కాపుశెట్టి జ్యోతి(37), కె.శివసాయిసంతోషి(14), కె.అఖిల సత్య (12), ఒరిస్సా రాష్ట్రానికి చెందిన పల్లా సావిత్రమ్మ(60) మరణించారు. తాడేపల్లిగూడెం సీఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. తూర్పు గోదావరిజిల్లా తుని పట్టణానికి చెందిన లక్ష్మి, జ్యోతి, శివసాయిసంతోషి, అఖిల సత్య పశ్చిమగోదావరి జిల్లాలోని నిడదావోలులో బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడ నుంచి శుక్రవారం వీరంతా ద్వారాకా తిరుమలకు బస్సులో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న బస్సు నల్లజర్ల మండలం అనంతపురం గ్రామం ఎర్ర కాల్వ వంతెన వద్దకు చేరుకుంది. సరిగ్గా అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ టైరు పేలిపోయింది. దీంతో ఒక్కసారిగా లారీ అదుపుతప్పి బస్సును ఢీ కొట్టింది. ప్రమాదంలో గెల్లా లక్ష్మి, కాపుశెట్టిజ్యోతి, కె.శివసాయిసంతోషి, కె.అఖిల సత్య, పల్లా సావిత్రమ్మ అక్కడికక్కడే మృతి చెందగా గాయపడిన 14 మంది తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

లాటరీకి స్వస్తి...!

(మొదటిపేజీ తరువాయి)

గణనీయంగా తగ్గనుంది. 'ది డైవర్సిటీ వీసా ప్రోగ్రామ్' కింద ఏడాదికి 50వేల మందికి గ్రీన్‌కార్డులను అందిస్తున్నారు. ఈ గ్రీన్‌కార్డు పొందిన వారికి అమెరికాలో శాశ్వత నివాస హోదా లభించనుంది. భౌగోళికపరంగా ఈ వీసాలను అందజేస్తారు. ప్రస్తుతం దేశీయ కోటా కింద వేలమంది భారతీయ ఐటీ నిపుణులు గ్రీన్‌కార్డుల కోసం కొన్ని దశాబ్దాలుగా వేచిచూస్తున్నారు. 'ది డైవర్సిటీ వీసా ప్రోగ్రామ్' ప్రోగ్రామ్‌ను ట్రంప్ వ్యతిరేకిస్తున్నారు. దీంతో అమెరికాకు ఉత్తమమైన, ప్రతిభావంతులైన వర్కర్లు రాలేకపోతున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

సెనేట్‌లో హెచ్1 బి వీసా పెంపు బిల్లు:

అమెరికాలో హెచ్1బీ వీసాల సంఖ్యను పెంచాలని సెనేట్‌లో బిల్లు ప్రవేశపెట్టారు. ప్రతిభకు పట్టంకడుతూ అమెరికాకు రప్పించాలని ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు ఒర్రిన్‌హాచ్, జెఫ్ ఫ్లేక్ ఇమ్మిగ్రేషన్ ఇన్నోవేషన్ యాక్ట్ 2018 పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు, పిల్లలకు వర్క్ పర్మిట్ కల్పించాలని కోరడమైంది. ఈ వీసాదారులు ఉద్యోగాలు మారేందుకు తగిన సమయం కల్పించాలని భావిస్తున్నారు. ఈ బిల్లుకు మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ సహా పలుప్రముఖ ఐటీ కంపెనీలు, అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఐటీ ఇండస్ట్రీ కౌన్సిల్ వంటి పలు వాణిజ్య సంఘాలు మద్దతిస్తున్నాయి. అమెరికాలో ఉద్యోగుల కొరత ఉన్నచోట ఈ హెచ్1బీ వీసాలు కంపెనీలకు ప్రతిభావంతులైన ఉద్యోగులను అందిస్తున్నాయనీ, మోసపూరిత ఉద్యోగులను నియంత్రిస్తున్నాయని సెనేటర్లు హాచ్,ఫ్లేక్ పేర్కొన్నారు. ఈ బిల్లులో హెచ్1బీ వీసాల సంఖ్యను 65వేల నుండి 85 వేలకు పెంచాలని ప్రతిపాదించారు.

హక్కుల రక్షణకు పోరు

(మొదటిపేజీ తరువాయి)

మఖ్దూంభవన్‌లో త్రివర్ణ పతాకాన్ని రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఎగురవేశారు. సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సి.రాఘవాచారి, కార్యదర్శివర్గ సభ్యులు మల్లెపల్లి ఆదిరెడ్డి, ఎన్.బాలమల్లేష్, కార్యవర్గసభ్యుడు కె.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. సురవరం మాట్లాడుతూ రాజ్యాంగమంటే డాక్యుమెంట్ అని, దేశ భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందని అన్నారు. రాజ్యాంగాన్ని అంబేద్కర్ జాతికి ఇచ్చిన కానుకగా ఆయన అభివర్ణించారు. భారత రాజ్యాంగమే ప్రపంచంలో అత్యుత్తమైనదన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రమాదం పొంచివుందని సురవరం హెచ్చరించారు. భారత్‌ను హిందూ దేశంగా మార్చేందుకు మతశక్తులు కుట్ర చేస్తున్నాయని, హిందూదేశం కాకుండా సెక్యులర్ దేశంగా భారత్ వెలుగొందాలని ఆకాంక్షించారు. మతవాదుల యత్నాలను వామపక్ష, ప్రగతిశీల, ప్రజాతంత్రశక్తులు అడ్డుకోవాలన్నారు. దళిత హక్కుల రక్షణ, ఆత్మగౌరవం కోసం అంబేద్కర్ పోరాడారని చెప్పారు. గోరక్షణ పేరిట దళితులు,, మైనారిటీలపై దాడులకు హిందూత్వ, సంఘ్‌పరివార్ శక్తులు తెగబడుతున్నాయన్నారు. ప్రధాని మోడీ సంపన్నులకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని, సంపద మొత్తం కార్పొరేట్ శక్తుల వద్ద ఉందని సురవరం అన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపర్చిన సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అమలు కోసం పోరాడాలన్నారు. గణతంత్ర ఫలాలు పేదలకు అందలేదని, సంపద కొద్దిమంది చేతుల్లో ఉందని, సహజ వనరులను దోపిడీ చేస్తున్నారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకరరావు, మహిళా సమాఖ్య అధ్యక్షులు పోటు కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.జ్యోతి, ప్రధాన కార్యదర్శి ఉస్తెల సృజన పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా దళితులు

(మొదటిపేజీ తరువాయి)

సబ్ ప్లానును పక్కదారి పట్టించారని మండిపడ్డారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని విమర్శించారు. దళిత తేజం కార్యక్రమంలో భాగంగా అమరావతిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి తన మనవడు దేవాన్ష్‌ను తన వెంట ఉంచుకొని కార్యక్రమం నిర్వహించటం ప్రత్యేక ఆకర్షణ.



సూత్రధారి ఎమ్మెల్యే వీరేశం

- శ్రీనివాస్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యే
- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపణ

విశాలాంధ్ర - నల్గొండ : తమ పార్టీ నేత బొడ్డుపల్లి శ్రీనివాస్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శ్రీనివాస్ హత్య సూత్రధారుడు ఎమ్మెల్యే వీరేశం అని పేర్కొన్నారు. నల్లగొండలో దారుణహత్యకు గురైన బొడ్డుపల్లి శ్రీనివాస్ కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ నేతలు పరామర్శించారు.

టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి, షబ్బీర్ అలీ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూడిద బిక్షమయ్యలు శ్రీనివాస్ భార్య, మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మిని ఓదార్చారు. ఉత్తమ్ మాట్లాడుతూ శ్రీనివాస్ హత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనన్నారు. హత్యకు సూత్రధారి నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం అని వ్యాఖ్యానించారు. ప్రాణభయం ఉందని శ్రీనివాస్ దంపతులు గతంలోనే సీఎం కేసీఆర్‌కు మొరపెట్టుకున్నారని గుర్తు చేశారు. హత్య జరిగి 48 గంటలు గడుస్తున్నా పోలీసులు నిందితులను ఎందుకు అరెస్టు చేయులేదని ప్రశ్నించారు. నేర చరిత్ర ఉన్న అధికార పార్టీ నేతలను కేసీఆర్ వెనకేసుకొస్తున్నారని విమర్శించారు.

సీఎంను పొగడ్తలతో ముంచెత్తడం అసమంజసం

గవర్నర్‌కు లేఖ రాసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : గవర్నర్ హోదాలో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రస్తావించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తడం సమంజసం కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు లేఖ రాశారు. గణతంత్ర దినోత్స వేడుకల సందర్భంగా ఇచ్చే విందుకు ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ప్రభుత్వం పట్ల వ్యవహరిస్తున్న వైఖరిని గమనంలో ఉంచుకొని ఆహ్వానాన్ని మన్నించలేకపోతున్నానని, విందుకు హాజరుకాలేకపోతున్నానని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా సీఎంను పొగడుతూ ఉపన్యాసాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే మంచి పనులను ఎవరైనా అంగీకరించాల్సిందేనని, అయితే చంద్రబాబును అదేపనిగా ఆకాశానికి ఎత్తేయడం సరికాదన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఏర్పాటైన చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అవినీతి తారాస్థాయికి చేరిందన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలలో కూడా అవినీతి పరాకాష్టకు చేరిందని, దీనిని నియంత్రించడానికి గవర్నర్‌గా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఏపీలో రాజకీయాలు మరింత దివాళా తీసాయని, రోజురోజుకీ దిగజారిపోతున్న విలువల పట్ల సమాజం సిగ్గుతో తలదించుకునే పరిస్థితి దాపురించిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను డబ్బుతో కొనుగోలు చేసే నీచ సంస్కృతికి తెర లేపారని తెలిపారు. ఫిరాయింపుదార్లయిన నలుగురు ప్రతిపక్ష ఎమ్మెల్యేలతో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించి, ప్రజాస్వామానికి తిలోదకాలిచ్చారన్నారు. గవర్నర్ స్థాయిలో ఉండి రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన అధికారాలను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరిగే అవినీతి రాజకీయాలకు, ఫిరాయింపు రాజకీయాలకు మీరే ఆమోదముద్ర వేశారని రామకృష్ణ లేఖలో విమర్శించారు.

సచివాలయంలో మువ్వెన్నెల జెండా రెపరెపలు



విశాలాంధ్ర-అమరావతి : నవ్యాంధ్రప్రదేశ్ సచివాలయంలో శుక్రవారం రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సచివాలయ సర్వీసెస్ విభాగం ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్మాగాంధీ చూపిన బాటలో అందరూ పయనించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. రాష్ట్ర విభజనతో నవ్యాంధ్రప్రదేశ్ పునాదుల స్థాయి నుంచి నిర్మించుకోవాల్సిన పరిస్థితుల ఏర్పడ్డాయన్నారు. ఉద్యోగులంతా కష్టించి పనిచేసి, రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. అంతకుముందు ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ముఖ్యాధికారి కె.కె.మూర్తి, పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు ఫోన్‌లో అభినందనలు తెలిపిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాంత్‌కు శుక్రవారం సాయంత్రం ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన శ్రీకాంత్ రాష్ట్రంలో క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న శ్రీకాంత్‌కు దేశంలో అత్యున్నత పురస్కారం దక్కడం రాష్ట్రానికే గర్వకారణమని చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు.

ఎదురు చూపులు

- ఆశల పల్లకిలో నేతలు
- ఖాయమని నమ్మిస్తున్న నాయకత్వం



విశాలాంధ్ర బ్యూరో కర్నూలు : ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో విభజన చట్టంలో పొందుపరచిన విధంగా 2 తెలుగురాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుపై ఉత్కంఠత నెలకొంది. ఏపీలో ప్రస్తుతం ఉన్న 175 సీట్లను 225కు, తెలంగాణాలు ప్రస్తుతం ఉన్న 119 సీట్లకు గాను 175 సీట్లు పెంచేందుకు కేంద్రప్రభుత్వం అంగీకరించిందని, ఆఫైల్‌పై ప్రధాని మోడీ సంతకం పెట్టినట్లు తెలుస్తోంది. పార్లమెంట్‌లో ఆమోదం తెలియచేసిన తర్వాత ఫైల్‌ను ఎన్నికల కమిషన్‌కు పంపుతారు. దీంతో నియోజక వర్గాల పెంపుపై ఎన్నికల కమిషన్ దృష్టిసారిస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్‌లు సీట్ల పెంపుపై కేంద్రప్రభుత్వంపై అనేక మార్లు ఒత్తిడి తీసుకువచ్చారు. సీట్లపెంపుపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ, ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షాలను అనేక మార్లు కోరినా సీట్లపెంపుపై దృష్టి సారించలేదు. దీంతో ఇరురాష్ట్రాలలోని ఆశావహులు ఆశలు వదులుకున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో స్వతంత్రంగా బలం పెంచుకోవాలనుకుంటున్న బీజేపీ, ఎన్‌డీఏలో మిత్రపక్షంగా ఉన్నా టీడీపీతో ఒకవైపు, మరో వైపు జగన్‌మోహన్‌రెడ్డితో సంబంధాలు కొనసాగించింది. నంద్యాల, కాకినాడ ఎన్నికల తరువాత రాష్ట్రంలో వచ్చిన ఫలితాలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ ఒక అడుగు వెనక్కి తగ్గింది. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన సర్వేలో 2019 ఎన్నికలలో దేశవ్యాప్తంగా బీజేపీకి 60 నుంచి 100 సీట్లు తగ్గుతాయని స్వతంత్రంగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుచేయడం కష్టమని తెలపడంతో బీజేపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకునే దిశగా ముందడుగులు వేస్తుండటంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతో పొత్తుకొనసాగించేందుకు సిద్ధమైంది. మరో వైపు ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీతో పొత్తుకు సిద్ధమని వైసీపీ అధినేత వైఎస్‌జగన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే తెరపైకి విభజన చట్టంలో పొందుపరచిన సీట్ల పెంపు విషయం తీసుకువచ్చింది. గత ఏడాది కాలంగా రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ఇటీవల సీఎం ఢిల్లీకి వెళ్లినపుడు పలు విషయాలు ప్రధాని దృష్టికి తీసుకువచ్చినట్లు, దావోస్‌లో ప్రధానితో సీఎం చంద్రబాబు కలసినపుడుకూడా రాష్ట్ర అభివృద్ధి నిధులపై మాట్లాడినట్లు ఆపార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయి. నియోజకవర్గాలు పెరిగితే అధికార టీడీపీకి బాగా కలసి వచ్చే అవకాశం ఉన్నట్లు ఆపార్టీ నాయకులు తెలియచేస్తున్నారు. ఇప్పటికే వైసీపీ నుంచి 24 మంది ఎమ్మెల్యేలు టీడీపీలో చేరడంతో ప్రస్తుతం ఉన్న ఇన్‌ఛార్జిలను కాదని సిట్టింగ్‌లకు సీటు ఇవ్వడం ఇబ్బందికరంగా మారింది. సీట్లు పెరిగితే అందరికి సీట్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని వారి నమ్మకం. ఈ విషయం వైసీపీ గుండెల్లో గుబురు లేపుతుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో 150 సీట్లలో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపడం ఆపార్టీకి కష్టసాధ్యంగా మారింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 175 శాసన సభ స్థానాలలో సీట్లు పెరిగితే 225 స్థానాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో కర్నూలు ,నంద్యాల పార్లమెంట్ స్థానాలలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.ఇదే జరిగితే ఒక్కో పార్లమెంట్ స్థానంలో రెండేసి అసెంబ్లీసీట్లు పెరిగే అవకాశాలు ఉన్నాయి. కర్నూలు పార్లమెంట్‌లో నూతనంగా కల్లూరు, ఆదోని రూరల్ కలిపి ఒక నియోజకవర్గంతోపాటు,నంద్యాల పార్లమెంట్‌లో పూర్వపు కోవెలకుంట్ల నియోజకవర్గంతోపాటు , నంద్యాల రూరల్ నియోజకవర్గం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. వైసీపీలోని శాసనసభ్యులు ఇటీవలన అధికార టీడీపీలో చేరిపోయారు.సీట్లు పెంపు జరిగితే 18 సీట్లుకు పెరిగే అవకాశం ఉండటంతో టీడీపీ ఆశావహులందరికి సీట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. 29న పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడితే మాత్రం 2019 ఎన్నికలకు సీట్ల పెంపు అమలులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.ఇది ఇరు రాష్ట్రాల అధికారపార్టీలకు కలసి వచ్చే అవకాశం.

ప్రమాదంలో రాజ్యాంగం

పి.జె. చంద్రశేఖర్, శ్రీనివాసరావు



విశాలాంధ్ర - తిరుపతి ఎస్వీయూ : భారతదేశాన్ని బీజేపీ ప్రభుత్వం మతపర దేశంగా మార్చే ప్రమాదం పొంచి ఉందని సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్సీ పి.జె. చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో "భారత రాజ్యాంగం - ఎదురౌతున్న సవాళ్లు" అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా పి.జె. చంద్రశేఖర్, సీపీఎం రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ దేశాల్లోని రాజ్యాంగాలను పరిశీలించి, భారత్‌లోని పరిస్థితులకు అనుగుణంగా అత్యుత్తమ ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని డా॥ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించారని , భారతీయులకు అది పెద్ద ఆస్తి రాజ్యాంగమేనన్నారు. రాజ్యాంగం అత్యంత ప్రమాదంలో పడిందని, రాజ్యాంగాన్ని సంరక్షించుకోవడంలో ప్రతి పౌరుడు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో ఆర్ఎస్ఎస్, భజరంగదళ్ ఆదేశాలకు అనుగుణంగా మతోన్మాదాన్ని వ్యాప్తి చేస్తున్నాయన్నారు. పద్మావత్ సినిమాపై సైతం బీజేపీ పాలిత ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నారని, సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘన చేస్తూ నిషేధాజ్ఞలు జారీ చేశారన్నారు. నాడు బ్రిటిష్ వారి పంచన చేరి వారికి సహకరించిన వారు ప్రస్తుతం పాలన సాగిస్తున్నారన్నారు. బీజేపీ అధికారాలను కేంద్రీకృతం చేస్తుందని, విద్యా వ్యవస్థను, పన్నుల వ్యవస్థను రాష్ట్రాల నుంచి దూరం చేసి తమ ఆధీనంలో ఉంచుకుందన్నారు. జీఎస్టీపై అన్ని పక్షాలు 18 శాతంకు మించకుండా పన్నులు విధించాలని సూచించినా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. న్యాయ వ్యవస్థ సైతం ప్రమాదంలో పడిందని, ఇందుకు సాక్ష్యం సాక్షాత్తు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు న్యాయ వ్యవస్థను పరిరక్షించాలని ప్రజల మధ్యకు వచ్చిన సంఘటలను గుర్తు చేశారు. రాజ్యాంగ పరిరక్షణలోని నాలుగో స్తంభంగా ఉన్న మీడియా పెట్టుబడిదారుల చేతుల్లో కీలుబొమ్మగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని బలహీన పరచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తూ జాతీయ జెండాలోని రంగులను సైతం మతాలకు అంటగడుతుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, కార్పోరేట్ స్వామ్యం నడుస్తుందని వారు దుయ్యబట్టారు. రిజర్వేషన్ల రద్దుకు యత్నిస్తున్న ప్రభుత్వం ముందుగా కులాలను రూపుమాపాలని డిమాండు చేశారు. ప్రభుత్వరంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పోరేట్ , కాంట్రాక్ట్ వ్యవస్థల బలోపేతానికి బీజేపీ కృషి చేస్తుందన్నారు. టీటీడీలో అన్యమతస్తులను తొలగించడం దారుణమని, ఈ అంశంపై రాజ్యాంగబద్ధంగా పోరాడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధి మారెళ్ల శ్రీనివాసరావు, విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప, సీపీఐ నగరకార్యదర్శి పెంచలయ్య, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య, కాంగ్రెస్ నేత శ్రీదేవి, షఫీవుల్లా ఖాదరి, రఫీ, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్పీ కమాండెంట్ కోటేశ్వరరావుకు రాష్ట్రపతి అవార్డు

విశాలాంధ్ర-కాకినాడ రూరల్ : దేశంలో పోలీస్‌శాఖలో అత్యున్నత సేవలందించిన వారికి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం రాష్ట్రపతితో అత్యున్నత పోలీస్ అవార్డులను అందజేస్తుంది. శుక్రవారం గణతంత్ర దినోత్సవంలో దేశంలో 14మంది ఈ పురస్కారానికి ఎంపిక కాగా అందులో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉండగా ఒకటి తూర్పుకు దక్కడం ఎంతో ఆనందదాయకమని పోలీసు ఉన్నత వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరిలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక స్పెషల్ మూడవ బెటాలియన్ కమాండెంట్ జంగారెడ్డి శ్రీనివాస కోటేశ్వరరావు అవార్డు అందుకోవడం పై పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీలో 14మంది పోలీసు అధికారులు పేర్లు ప్రకటించగా అందులో కమాండెంట్ పేరు పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన పరేడ్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ నుంచి ఈ అవార్డును కమాండెంట్ కోటేశ్వరరావు అందుకున్నారు. కోటేశ్వరరావు 1961 మే 3న జన్మించారు. 1982లో ఆర్ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 35 సంవత్సరాల నుండి పోలీస్‌శాఖలో అనేక పదోన్నతులలో విధులు నిర్వహించారు. సుమారు ఆరు క్యాష్ అవార్డులను కూడా ఆయన అందుకున్నారు. 1993లో ఉగాదిలో సేవా పథకం, 2004లో ఉత్తమ సేవా పథకం, 2013లో మొహోన్నా అవార్డును, పోలీస్ అంతరిక్ష సురక్షిత్ సేవాపథకాన్ని, సుమారు 9 సార్లు అభినందనలు అందుకున్న ఆయనకు రాష్ట్రపతి అవార్డుకు సిఫార్సు చేయడమైంది. దీంతో జిల్లా పోలీసు శాఖ, ప్రజలు సంతోషం వ్యక్తంచేశారు.

ఆప్కో కొనుగోళ్లు పెంచాలి

కడప చీరలపై విచారణ జరపండి

చేనేత సహకార సంఘాల డిమాండు



విశాలాంధ్ర-మచిలీపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘం లిమిటెడ్ (ఆప్కో), సహకార సంఘాలలో ఉత్పత్తులయిన చీరలు, ధోవతులు, ఫోర్డింగ్ క్లాత్‌లను ప్రభుత్వం కొనుగోలు చేయవలసి ఉన్నా ఆశించిన విధంగా కొనుగోలు చేయడంలేదు. ఒకవేళ కొనుగోలు చేసినా ఏడాదికి కూడా డబ్బులు జమ చేయదంలేదు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సహకార సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని చేనేత సంఘాలు కోరుతున్నాయి. చేనేత ఉత్పత్తులకు రాష్ట్రంలోనే కాకుండా దేశవిదేశాల్లో మంచి మార్కెట్ ఉంది. చేనేత సహకారసంఘాల్లో ఉత్పత్తులవుతున్న చీరలు, ధోవతులు, టవళ్లు ఎంతో నాణ్యతగా ఉంటాయి. అయినా ఆప్కో షోరూమ్‌లలో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండటం చేనేత కార్మికులను కలవరపెడుతోంది. తమిళనాడు రాష్ట్రంలో పవర్‌లూమ్‌పై తయారైన చీరలను మగ్గం చీరలుగా నమ్మించి ఆప్కోకు అంటగడుతూ కొందరు విపరీతమైన లాభాలు గడిస్తున్నారని కార్మికుల వాపోతున్నారు. పవర్‌లూం చీర ఖరీదు రూ.500ల లోపు ఉంటుంది. పలు నకిలీ సొసైటీలు తమిళనాడు నుంచి ఈచీరలనే దిగుమతి చేసుకుని ఒక్కో చీరకు రూ.700లకు పైగా ఆప్కోకు అమ్మినట్లు తెలుస్తోంది. ఈతరహా మోసం కడప జిల్లాలో జరిగిందని, దీనిపై సమగ్రంగా దర్యాప్తు జరపాలని చేనేత నాయకులు ముఖ్యమంత్రిని కోరుతున్నారు.

ఆప్కో అమ్మకాలు: ఈ ఆర్థిక ఏడాదిలో రాష్ట్రంలోని 115 ఆప్కో షోరూమ్‌లలో సుమారు రూ.300కోట్ల అమ్మకాలు జరపాలని పాలకవర్గం లక్ష్యంగా పెట్టుకున్నా ఇంతవరకూ రూ. 150 కోట్ల అమ్మకాలు కూడా జరగలేదు. ఆప్కో ఛైర్మన్, ఆప్కో ఎండీలు చేనేత సహకార సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా, ఫలితాలు మాత్రం ఉండటం లేదని చేనేత కార్మికులు వాపోతున్నారు.

అమ్మకాలు : జనవరి నెలలో ఆప్కో షోరూమ్‌లలో కొనుగోలు చేసిన ప్రతి ఐటమ్‌కు 30 శాతం రిబేటు ప్రకటించింది. ఈ రిబేటు ఫిబ్రవరి 15వ తేదీ వరకూ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే సంక్రాంతికి రాష్ట్రం మొత్తం మీద సుమారు రూ.7 కోట్ల వరకే అమ్మకాలు జరిగాయని, తిరుపతి, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాలో సంక్రాంతికి ఆప్కో అమ్మకాలు బాగా జరిగినట్లు , మిగతా జిల్లాల్లో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల త్యాగం మరువలేనిది

శాసనమండలి ఛైర్మన్ ఎన్.ఎం.డి.ఫరూక్



విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల త్యాగం మరువలేనిదని శాసనమండలి ఛైర్మన్ ఎన్.ఎం.డి.ఫరూక్ కొనియాడారు. రిపబ్లిక్ డే సందర్భంగా శాసనసభ, మండలి ఉద్యోగులతో అసెంబ్లీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావుతో కలిసి మాట్లాడారు. కుటుంబాలు హైదరాబాద్‌లో ఉన్నా, సీఎం చంద్రబాబునాయుడు ఆశయ సాధనకు ఉద్యోగులు కష్టించి పనిచేస్తున్నారన్నారు. 1950లో మద్రాసులో, 1953లో కర్నూలులో, 1956లో హైదరాబాద్‌లో, ప్రస్తుతం అమరావతిలో గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రస్తుతం చట్టసభల నిర్వహణ కష్టంగా మారిందని, అయినప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి చేశారని, అంతకంటే ఎక్కువగా అమరావతిని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు.

రాష్ట్రాభివృద్ధికి పునరంకితమవుదాం : స్పీకర్ కోడెల

ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి పునరంకితమవుదామని స్పీకర్ కోడెల శివప్రసాదరావు పిలుపునిచ్చారు. చట్టసభలు సజావుగా పనిచేస్తేనే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుందని స్పీకర్ అన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేవి చట్ట సభలన్నారు. పాలన సవ్యంగా సాగాలంటే ఉద్యోగుల సహకారం ఎంతో అవసరమన్నారు. రాష్ట్ర విభజన అసంపూర్తిగా జరిగిందన్నారు. చట్టసభలు ఎంత ముఖ్యమో దాంట్లో పనిచేసే ఉద్యోగుల సంక్షేమం కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమన్నారు. త్వరలో అసెంబ్లీ, శాసనమండలి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని స్పీకర్ తెలిపారు. విధుల నిర్వహణలో ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీలో ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యమిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉద్యోగులకు హెల్త్ కార్డులను ఫరూక్, కోడెల శివప్రసాదరావు అందజేశారు. సంక్రాంతి, రిపబ్లిక్ డే ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఉద్యోగులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న ఏసీబీ

రాష్ట్రంలో పెరుగుతున్న కేసులు

ఈ ఏడాది అక్రమాస్తుల కేసులే ఎక్కువ

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలోని ప్రభుత్వశాఖల్లో అవినీతి పెరిగిపోయింది. ఈ విషయాన్ని స్వయంగా అధికారవర్గాలే వెల్లడిస్తున్నాయి. అయితే అవినీతి అరికట్టాలన్న ధ్యేయంతో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. అవినీతి అధికారుల చిట్టా సేకరించి వారిపై దాడులు జరిపి వేలకోట్ల రూపాయల ఆస్తులను జప్తు చేశారు. ఈ దాడుల్లో అవినీతి తిమింగలాలుగా పేరుపడ్డ ఉద్యోగులు పట్టుబడ్డారు. గత రెండేళ్ళ నుంచి ఏసీబీ అవినీతి అధికారుల భరతం పట్టింది. ఏసీబీ పేరు వింటేనే అవినీతి అధికారులు హడలెత్తిపోతున్నారు. ఈ శాఖలో 2015లో 265 కేసులు, 2016లో 262 కేసులు మాత్రమే నమోదు కాగా 2017లో నవంబరు 18 నాటికే 272 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది భారీ అక్రమ ఆస్తుల కేసులను గుర్తించి, నిందితులపై కేసులు నమోదు చేశారు. ఆదాయపు పన్ను శాఖ, ఈడీలతో సమన్వయంతో అ.ని శా .ముందుకు వెళుతోంది. అవినీతికి కారణమవుతున్న సామాజిక లోపాలను సరిచేయటంపై పరిశోధన చేసి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని ఏసీబీ భావిస్తోంది. కేసులు నమోదే కాకుండా, నిందితులను సస్పెండ్ చేయడం, అక్రమ ఆస్తుల స్వాధీనంపై కూడా దృష్టి పెట్టారు. అవినీతి కేసుల్లో పట్టుబడిన నగదును వేగంగా వెనక్కి ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ యేడాది 17 మందిని సర్వీసు నుంచి తొలగించగా, 9 మంది రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్లను నిలిపివేశారు. అవినీతికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడం ఎలా అనే విషయమై విద్యార్థులకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. 6 మార్గాల ద్వారా ఫిర్యాదు చేసే సౌలభ్యాన్ని అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లోనూ ఏసీబీ కార్యాలయాలు సిద్ధమవుతున్నాయని, ప్రభుత్వం ఇందుకు రూ. 15.94 కోట్లను కేటాయించిందని ఏసీబీ డీజీ ఆర్‌పీ.ఠాకూర్ వెల్లడించారు. విశాఖ కార్యాలయాన్ని డిసెంబర్‌లో ప్రారంభిస్తామని, తిరుపతి, ఏలూరులలో కార్యాలయాలు సిద్ధమవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో అవినీతి జీరో శాతానికి వెళ్లాలని సీఎం ఆదేశాలిచ్చారని పేర్కొన్నారు. 2016 నవంబరు 19 నుంచి 2017 నవంబరు 18 వరకు మొత్తం 303 కేసులు నమోదు చేశారు. వాటిలో 146 ట్రాప్ కేసులు, 46 ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, 8 క్రిమినల్ మిస్ కాండక్ట్ కేసులు ఉన్నాయి. 43 ఆకస్మిక తనిఖీలు, 59 సాధారణ విచారణ కేసులు ఉన్నాయని తెలిపారు. 2016లో 38 కేసులలోను, 2017లో ఇప్పటివరకు 38 కేసులలోను దోషులను నిర్ధారించారు. 2016లో పట్టుకున్న వారిలో 64శాతం మందిని దోషులుగా నిర్ధారించగా, ఈసారి అది మరో 5 శాతానికి పెరిగింది. ఎవరైనా, ఎక్కడైనా అవినీతిని గుర్తిస్తే ఆ విషయాన్ని నేరుగా ఏసీబీకి ఫిర్యాదు చేయొచ్చు. అందుకు వాట్సాప్ నెంబరు 8333995858, ఫేస్‌బుక్ ఖాతా డీజీ ఏసీబీఏపీ, ట్విట్టర్ ద్వారా అయితే డీజీఏసీబీఏపీ, టోల్‌ఫ్రీ నెంబరు 1064కు ఫిర్యాదు చేయొచ్చు.

మార్చి మొదటి వారం నుంచి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు : కోడెల

విశాలాంధ్ర-అమరావతి : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి మొదటి వారం నుంచి నిర్వహించనున్నట్లు రాష్ట్ర శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశానికి స్వాతంత్ర్యమొచ్చి 71 ఏళ్లు అవుతుందని, ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఇండియాకు గుర్తింపు లభించిందన్నారు. దేశంలోని 137 కోట్ల మంది కుల, మతాలకు అతీతంగా కృషి చేస్తే, రాబోయే కొద్ది సంవత్సరాల్లో భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా గుర్తింపు పొందడం ఖాయమన్నారు. నవ్యాంధ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రజలంతా ఐక్యంగా కృషి చేయాలన్నారు. ప్రధానమంతి మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నేతృత్వంలో దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతున్నాయన్నారు. మార్చి నెలాఖరు వరకు ఈ సమావేశాలు కొనసాగుతాయన్నారు. అంతకుముందు ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమాచార కేంద్రంలో గణతంత్ర వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న రాష్ట్ర సమాచార కేంద్రంలో శుక్రవారం ఉదయం 69వ గణతంత్ర దినోత్సవాలు ఘనంగా జరిగాయి. సమాచార కేంద్రం సహాయ సంచాలకులు ఇరుగంటి సూర్యచంద్రరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ దేశ సమగ్రత, సౌభ్రాతృత్వాన్ని చాటే విధంగా ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రదేశాభివృద్ధికి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమలో అధికారులు ఎస్వీ మోహనరావు, టీ నాగేశ్వరరావు, ఎమ్ లక్ష్మణాచార్యులు, జి రాంబాబు, వీవీ ప్రసాద్, సిబ్బంది జె వెంకటలక్ష్మి, యశోద, ఉషా కిరణ్మయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల్లో మతోన్మాద అంశాలా? ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఇంజనీరింగ్ పాఠ్యాంశాల్లో మతోన్మాదాన్ని పెంచే వేదాలు, పురాణాలు, యోగశాస్త్రాలను ప్రవేశపెట్టడాన్ని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తీవ్రంగా ఖండిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రంగన్న తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజనీరింగ్ పరిజ్ఞానం బలహీనపడిందని, దీనిని అభ్యసిస్తే ఉద్యోగావకాశాలు రావడంలేదని కేంద్రమానవ వనరులశాఖమంత్రి ప్రకాశ్ జవదేకర్‌చెప్పడం చాలా సిగ్గు చేటన్నారు. మతోన్మాద పాఠ్యాంశాలను సాంకేతిక విద్యలో చేర్చాలని ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)కు ప్రణాళికను విడుదల చేయాలని మంత్రి చెప్పడం దారుణమన్నారు. సాంకేతిక విద్యా ప్రమాణాలపై దృష్టి పెట్టకుండా, కాషాయీకరణ చొప్పించే యత్నాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. అధికారంలోకి వస్తే ఏటా కోటి ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిన మోడీ ఈ నాలుగేళ్ల కాలంలో ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో స్పష్టం చేయాలని రంగన్న డిమాండు చేశారు.

సోషల్ మీడియా శిక్షణా తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ అనుబంధిత సోషల్ మీడియా, ఐటీ విభాగం శిక్షణా తరగతులను పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ప్రారంభించారు. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్‌ను ద్వారా కాంగ్రెస్ కార్యక్రమాల్ని విస్తృతం చేస్తామని ఆయన చెప్పారు. ఏపీ సోషల్ మీడియా సెల్ ఛైర్మన్ బి.సతీష్ ఆధ్వర్యాన కాంగ్రెస్ నాయకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు నాదెండ్ల మనోహర్, కో-ఆర్డినేటర్ ఆసిపాబేగమ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

-ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. విజయవాడ ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం 69వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆయన ఎగురవేసి సందేశాన్నిచ్చారు. మహనీయుల త్యాగాల స్ఫూర్తితో ముందుకెళ్లాల్సిన అవసరముందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సిహెచ్.జోసెఫ్ సుధీర్‌బాబు, శిరంశెట్టి శ్రీనివాసరావు, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియదాసు, కార్యదర్శి శిరంశెట్టి శ్రీనివాసరావు, రమణారెడ్డి, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

గవర్నర్ వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలు : కొలనుకొండ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు అధికంగా సంతృప్తికరంగా వున్నారని గవర్నర్ నరసింహన్ పేర్కొనడం పచ్చి అబద్ధమని పీసీసీ అధికార ప్రతినిధి కొలనుకొండ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. చంద్రబాబు ప్రభుత్వం సిద్ధం చేసిన అబద్ధాల కాపీని గవర్నర్ చదివి విన్పించారని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి దివాళా తీయించిందని తెలిపారు.

సంపాదకీయం

మనిషి కాదు, మార్కెట్టే లక్ష్యం!

భారత్ అంటే వైవిధ్యం, బహుళత్వం, లౌకికత్వం, ప్రజాస్వామ్యం, విశిష్ట సంస్కృతి, చరిత్ర.. ఇలా ఏదో ఒక నిర్వచనం చెప్పడం మనకు తెలుసు. అందుకు పూర్తి భిన్నమైన నినాదం, నిర్వచనం ఇచ్చారు ప్రధాని మోడీ.. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక మీదనుంచి ప్రసంగిస్తూ 'భారత్ అంటేనే వాణిజ్యం' అన్నారు. తాను అధికారం చేపట్టిన మూడున్నరేళ్ల కాలంలో దేశాన్ని హిందూత్వ దిశగా ఈడ్చుకుపోవడానికీ, కార్పొరేట్‌శక్తుల పరం చేయడానికీ అన్ని రకాలుగా దిగజారిన మోడీ ఇటువంటి నిర్వచనం కాకుండా మరోటి ఇస్తారనుకోవడం మన భ్రమే. రాజ్యాంగ స్ఫూర్తికీ, ప్రజాస్వామ్య విలువలకూ పూర్తి భిన్నమైన పంథాలో పాలన సాగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను సంపన్నుల ఖజానాగా మార్చేందుకు నానా తిప్పలు పడుతున్న నాయకుడు, పాలకుడికి ఇంత కన్నా గమ్యం, గమనం ఏముంటుంది. 'పెట్టుబడులకు గమ్యస్థానం భారతదేశం, ఆరోగ్యంతో కూడిన సంపద, సౌభాగ్యంతో కూడిన శాంతి కోరుకునేవారు భారతదేశం రావాలి.' అంటూ మోడీ అంతర్జాతీయ పెట్టుబడిదారులకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సును మోడీ ప్రారంభించడం దేశానికి దక్కిన అరుదైన గౌరవమని కొందరు బీజేపీ నేతలు గొప్పలు పోతున్నారు. వాస్తవానికి ప్రపంచీకరణ భవిష్యత్తుపై నీలినీడలు అలముకున్నాయి. ఈ నేపథ్యంలో బడా పారిశ్రామికవేత్తల కన్ను భారతీయ మార్కెట్ పై పడడం సహజం. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ మనదే. ఇంత పెద్ద జనాభా ఉన్న దేశాన్ని ఏ వాణిజ్యవేత్త వద్దనుకోగలడు. అందుకే అంతర్జాతీయ వాణిజ్యంలో మన దేశాన్ని లక్ష్యంగా చేసుకోవడం, దావోస్‌లో మోడీని గౌరవించడం వంటి తంతు కొనసాగింది. ప్రపంచ ఆర్థిక సదస్సు ప్రారంభోత్సవ గౌరవం దక్కడం మనకు ఇది తొలిసారి కాదు. రెండు దశాబ్దాల కిందటనే అప్పటి ప్రధాని దేవెగౌడకు మొదటగా ఈ గౌరవం దక్కింది. అంతర్జాతీయ వాణిజ్యవేత్తలకు కావల్సింది ప్రధాని ఎవరన్నది కాదు.. కేవలం మార్కెట్ మాత్రమే. ఈ వేదిక మీదనుంచి ప్రధాని మోడీ భావోద్వేగ ప్రసంగం చేశారే తప్ప వాస్తవాల దృశ్యాన్ని ఆవిష్కరించలేకపోయారు. 'లైసెన్స్, పర్మిట్ రాజ్‌ను పూర్తిగా తొలగించాలని మేం నిర్ణయించాం. ఇప్పుడు రెడ్‌టేప్ (బ్యూరోక్రటిక్ అవరోధాలు) స్థానంలో రెడ్ కార్పెట్ పరుస్తున్నాం.' అంటూ విదేశీ పెట్టుబడులకు ద్వారాలు బార్లా తెరచిన వైనాన్ని ప్రధాని వివరించారు. అయితే భావోద్వేగ ప్రసంగాలతో పెట్టుబడులు రావన్న వాస్తవం ఆయనకు తెలియందేమీ కాదు. వాస్తవానికి ప్రపంచీకరణతో లబ్ధిపొందిన దేశాల కంటే నష్టపోయిన దేశాలే ఎక్కువ. కొన్ని దశాబ్దాల పాటు ప్రపంచీకరణను ముందుండి నడిపించిన అమెరికానే దీనివల్ల ఎక్కువ లబ్ధి పొందింది. కేవలం ఫైనాన్షియల్ క్యాపిటల్ కుప్పతెప్పలుగా వచ్చిపడుతున్న కారణంగా భారత్ వంటి వర్ధమాన దేశాలు ప్రపంచీకరణను స్వాగతించాయి. ఫలితంగా మేలు కంటే కీడే ఎక్కువ జరిగింది. రక్షణ అవసరమైన దేశీయ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. మార్కెట్లను బార్లా తెరవడం ద్వారా పర్యవసానాలేమిటో భారత్‌కు అనుభవపూర్వకంగానే తెలిసివచ్చింది. లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఊడిపోయాయి. ఆర్థిక అంతరాలు అసాధారణంగా పెరిగిపోయాయి. ఆదాయంలో వ్యత్యాసాలు తీవ్రంగా ఉన్నాయి. దేశ సంపద 80శాతం కేవలం ఒక శాతం జనాభా చేతుల్లోనే కేంద్రీకృతమైంది. అంతర్జాతీయ పెట్టుబడులు, దేశీయంగా బ్యాంకులు సమకూర్చుతున్న పెట్టుబడులూ దేశంలోని ఒక అతిచిన్న వర్గాన్ని అంతర్జాతీయ కుబేరుల జాబితాలోకి ఎక్కించడానికి మాత్రమే దోహద పడుతున్నాయి.. ఒక్క ఏడాదిలో వీరి ఆదాయం రూ.20.9 లక్షల కోట్లు పెరిగింది. ఇది దేశ బడ్జెట్‌తో సమానం.67కోట్ల ప్రజల ఆదాయం కేవలం ఒక్కశాతం పెరిగిందన్న విషయం ఆక్స్‌ఫామ్ అధ్యయనంలో తేలింది. విద్య, వైద్యరంగాలు ప్రైవేటు శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయి భిన్న సామాజిక వర్గాల మధ్య అసమానతలను మరింతగా పెంచుతున్నాయి. ప్రజాస్వామ్యం అనే పదానికి అర్థాన్నే మార్చేస్తూ మోడీ పాలన సాగుతున్నది. ప్రజలు రక్షిత విధానాలను అనుసరిస్తున్న దశలో బీజేపీ సర్కారు మాత్రం ప్రపంచీకరణ కోసం వెంపర్లాడుతున్నది. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్న ప్పుడు ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెరుగుతాయి. ఈ ఆర్థిక అసమానతలే నేటి ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభానికి కారణం.

మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడులను ఆకర్షించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైన మాట వాస్తవం. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, కార్మిక సంస్కరణలు... ఇలా ఏ చర్యలు చేపట్టినా మోడీ సర్కారు పెట్టుబడులను ఆకర్షించలేకపోయింది. ఉపాధి అవకాశాలు పెరగలేదు. అంతేకాదు, స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా మోడీ పాలనలో 2016-17లో, ఉన్న ఉపాధి అవకాశాలు కూడా ఊడిపోయాయి. 'అనేకమంది అవసరం మేరకు వినిమయం నుంచి పేరాశతో కూడిన వినిమయంలోకి వెళుతున్నారు. అనేక వాణిజ్య ఒప్పందాలు నిలిచిపోయాయి. స్వదేశం వెలుపల పెట్టుబడులు అనేకరంగాల్లో తగ్గుతున్నాయి. ఇది నిజంగా అభివృద్ధా లేక సమాజ పతనం ఆరంభమా' అని మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మాటలే ప్రపంచీకరణలోని డొల్లతనాన్ని బట్టబయలు చేస్తున్నది. అయినా దాన్ని పట్టుకొనే వెంపర్లాట ఎందుకు అనే ప్రశ్న సామాన్యులకు కలుగుతున్నది. తాము సమ్మిళిత అభివృద్ధి పంథా అనుసరిస్తున్నామని మోడీ ఈ వేదిక మీదగా చెప్పడం పచ్చి అబద్ధాన్ని వల్లించడమే తప్ప వేరేమీ కాదు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం ఆయన ప్రసంగానికి ముందురోజు విడుదలైన ఆక్స్‌ఫామ్ నివేదికే. దేశంలోని బాలలు, మహిళలకూ పౌష్టికాహారం లోపించిందని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక గణాంక శాఖ తాజాగా ప్రకటించిన గణాంకాలు తేల్చి చెప్పాయి. ప్రధాని మరోమాట కూడా అన్నారు.. ఆధునిక సమాజంలో షేరింగ్ తప్ప కేరింగ్ లేదని. నిజమే.. ఆయనకు హిందూత్వ భావజాలాన్నీ బీజేపీకి అధికారాన్ని షేరింగ్ చేయడం తప్ప ప్రజలు ముఖ్యంగా పేదల గురించిన కేరింగ్ లేదన్నది ఈ మూడున్నరేళ్ల పాలన స్పష్టంచేస్తున్నది. వాస్తవానికి మోడీకీ, దావోస్ సదస్సులో పాల్గొంటున్న పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారీ దేశాలకు కావాల్సింది భారతదేశంలోని సామాన్య మనిషి కాదు, మధ్యతరగతి వర్గాల మార్కెట్లే! అందుకే ప్రపంచ ఆర్థిక వేదికలో, మోడీ చేసిన ప్రసంగంలో ఎక్కడా సగటు మనిషికి స్థానం లేకుండా పోయింది. ఆయన ఈ సదస్సులో ఎన్ని అంశాలు లేవనెత్తినా, ఎంత ఉద్వేగంతో ప్రసంగించినా.. పెట్టుబడిదారుల గురించే తప్ప, పెరుగుతున్న అంతరాలను తగ్గించడానికీ, ఆదాయంలో అసమానతలు తొలగించడానికి మాత్రం ఉపయోగపడదన్నది నిర్వివాదాంశం.

చురక

రక్తమోడుతున్నది
రాజ్యాంగపు స్ఫూర్తి
గాట్లు పడుతున్నది
గణతంత్రపు కీర్తి

శ్రేయోరాజ్య లౌకికత్వ
సమతాశయ బాసలు
మతరాజ్యపు గాలి సోకి
మృత్యువాత శ్వాసలు

\- వేల్పుల నారాయణ

సందర్భం

గిట్టుబాటు ధరలేక మినుము రైతు దిగాలు

దాసరి ఆళ్వార స్వామి

ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు వ్యాపారుల గూడుపుఠాణి, ఇంకోవైపు ప్రభుత్వ విధానాలు మినుము సాగుదారుల్ని నష్టాలకు గురిచేస్తున్నాయి. ఈ అస్తవ్యస్థ పరిస్థితుల్లో ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి ముందు గొయ్యి, వెనుక నుయ్యిలా తయారైంది. కౌలు భూములను వదిలేసి కూలి మీద ఆధారపడి జీవించాల్సిన దుస్థితి ఎదురవుతుందని ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో చాలా భాగంలో, రబీలో డెల్టా ప్రాంతంలో మినుమును ఎక్కువగా సాగు చేస్తారు. ప్రధాన పంట ఏదైనా అది కౌలుకు సరిపోతుంది. పెట్టుబడి, లాభం కోసం రెండవ పంటపైనే కౌలుదారు ఆధారపడాలి. మాగాణి భూములకు, నీటి వసతి వున్న మెట్ట భూముల్లోనూ రెండవ పంటగా మినుము సాగు చేసి కౌలుదారు ఖర్చులను రాబట్టుకుంటాడు. కౌలు రైతుకు ఆశాజనకమైన మినుముల ధర పతనావస్థకు చేరటంతో కౌలు రైతాంగం తల్లడిల్లిపోతోంది. మంచి ధర కోసం ఎదురు చూస్తున్న రైతులకు నిరాశే ఎదురవుతున్నది. మినుముల ధర రోజురోజుకు క్షీణిస్తూ రైతాంగాన్ని ఆందోళనకు గురిచేసున్నది. ప్రభుత్వం నిర్ణయిస్తున్న మద్దతు ధరలు గిట్టుబాటుగా వుండటం లేదన్నది జగమెరిగిన సత్యం. రైతుల కంటనీరు తుడవడం కోసం ప్రకటించిన మద్దతు ధర కూడా నేడు మినుము సాగుదారులకు లభించటం లేదు. లక్షల క్వింటాళ్ల మినుములు రైతుల వద్ద నిల్వ వున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మినుము మద్దతు ధర క్వింటాలు రూ. 5,400. ప్రస్తుతం మార్కెట్ ధర క్వింటాలు రూ. 4,000కు పడిపోవడంతో రైతులకు దిక్కుతోచటం లేదు. మద్దతు ధరకు కొనుగోళ్లు ఆపివేయటం వ్యాపారులు కుమ్మక్కై ధరను మరింత తగ్గించడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

2016లో క్వింటా మినుములు రూ. 14,000 పలికింది. అది నిజంగా రైతుకు ఆశ్చర్యం కలిగించే విషయమే. క్వింటా మినుము ధర రూ. 14,000 చరిత్రలో లేదు. అంచలంచెలుగా పెరిగిన ధర తగ్గటంతో రైతులు దిగాలు పడ్డారు. మళ్లీ పెరుగుతుందనే ఆశతో తమ వద్ద వున్న సరుకును నిల్వ వుంచేసుకుంటున్నారు. ఆనాటి ధర మినుము సాగుదారులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. అంతేకాదు కౌలు కూడా గణనీయంగా పెరగటానికి కారణమైంది. ఆసామి చెప్పిన పెచ్చు కౌలు చెల్లించేందుకు కౌలు రైతు కూడా వెనకాడలేదనే చెప్పాలి. 2016-17 సీజనులో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 5,000 మాత్రమే. దాదాపు రెండు రెట్లు పెరిగి కౌలు రైతుల్లో ఆశలు రేపి, క్రమక్రమంగా తగ్గుతూ నిరాశపరచింది. 2010-11లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2,900. 2011-12 లో ధర రూ. 3,300. 2012-13లో రూ. 4,300. అలా కొంచెం కొంచెంగా పెరుగుతూ 2017-18కి రూ. 5,400కు చేరింది. ఆ మొత్తానికి ప్రకటన వెలువడింది కానీ, ఆ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు లేరు. గతేడాది పండిన మినుములను క్వింటాలుకు రూ. 3,600లకే వ్యాపారులు కొనుగోలు చేయటానికి సిద్ధమయ్యారు. రైతు అవసరాల దృష్ట్యా వ్యాపారి అడిగిన ధరకు అమ్ముకోక తప్పని పరిస్థితి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మినుములు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తెరచిన కొనుగోలు కేంద్రాలు వారంలోనే మూతపడ్డాయి. రెండేళ్లుగా రైతుల వద్ద నిల్వ వుంటున్న మినుములు కేవలం వారం రోజుల్లో అమ్మకోవటం, కొనుగోలు చేయటానికి కేంద్రాలకు సాధ్యం కాదు. పూర్తి సరుకును కొనే ఉద్దేశం నాఫెడ్‌కి కూడా లేకపోవటం గమనార్హం. 13,000 క్వింటాళ్లు కొనటానికే అవకాశం వుందని, ఆ మేరకే నిధులు మంజూరయ్యాయని, అందువల్ల వారానికే కొనుగోళ్లు నిలిపివేశామనే వాదన వినపడుతోంది. లక్షలాది ఎకరాల్లో పండించిన పంటలో 13,000 క్వింటాళ్ల కొనుగోళ్ల తర్వాత కేంద్రాలు మూసివేస్తే, ఇంకా రైతుల వద్ద వున్న లక్షల క్వింటాళ్ల మినుములు కొనుగోలు చేసేదెవరు?

2016లో క్వింటాలు రూ. 14,000 కు చేరినప్పుడు కూడా అమ్ముకోలేని రైతులు చాలా మంది వున్నారు. ఆ తర్వాత 2017 ఖరీఫ్, రబీల్లో వచ్చిన దిగుబడులు రైతుల వద్దనే వున్నాయి. 2018 రబీ అపరాలు కూడా కొద్దిరోజుల్లో రైతుల చేతికందుతుంది. ఇలా లక్షల టన్నులు రైతుల వద్ద పేరుకుపోతుంటే, రైతు ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతుంటే ఆ రైతును ఆదుకొనే నాథులెవరు? పంటసాగు కోసం చేసిన అప్పులు తీర్చేదారేది? "వ్యవసాయం దండగ కాదు, పండుగ" అన్న నినాదంలో అంతరార్థమేమిటి? 'సాగును బాగుగా' మారుస్తాం అన్న హామీలు ఎలా నెరవేరతాయి. అటు సాగుదారులకు గిట్టుబాటుధర రావటం లేదు. ఇటు వినియోగదారునికి సాధారణ ధరకు మినపప్పు లభించటం లేదు. ఏ రోజునైనా, ఏ మార్కెట్‌కైనా వెళ్లండి. కిలో మినపప్పు ధర 80 నుండి 90 రూపాయలు పలుకుతోంది. అటు రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వక, ఇటు వినియోగదారునికి సరసమైన ధరకు అమ్మక మధ్య దళారులు అందినకాడికి దోచుకుంటుంటే అధికారం యంత్రాంగం చోద్యం చూడటం రైతుల్ని నట్టేట ముంచడమే! వ్యవసాయానికి నష్టం కలిగించటమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈవైపుగా దృష్టి సారించి సాగుదలను ముఖ్యంగా కౌలు రైతులకు మేలు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.



గతేడాది మినుము పైరుకు ఆశించిన "తలతిప్ప తెగులు" మహమ్మారి ఇప్పుడు రైతుల్ని భయపెడుతోంది. 2016లో ఎకరాకు 9, 10 క్వింటాళ్ల దిగుబడినిచ్చిన పొలాలు 2017లో తలతిప్ప తెగులు సోకటం వల్ల 2,3 క్వింటాళ్ల దిగుబడి మించని దురదృష్టకర సందర్భాన్ని రైతులింకా మర్చిపోలేదు. మినుము పైరును పీకకుండా పశువులకు మేతగా వదిలేసిన లక్షల ఎకరాలున్నాయి. ఏ విధంగా చూసినా సాగు విస్తీర్ణం పెరగటం లేదు. సరాసరి దిగుబడులు అసలు పెరగటం లేదు. వినియోగం తగ్గటం లేదు. అటు ఉత్పత్తి పెరగని దశలో, ఇటు వినియోగం తగ్గని స్థితిలో కూడా ధర తగ్గటంలోని అంతర్యం ఏమిటి? 'అప్పుల్లో వున్న రైతులు, అవస్థల్లో వున్న రైతులు తక్కువ ధరకే అమ్ముకుంటాడు' అనే ధీమాతో వ్యాపారులుండటమే ధర పెరగకపోవటానికి కారణమని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. పండిన పంటంతా ప్రభుత్వ యంత్రాగమే కొనుగోలు చేయలేకపోవచ్చు. వ్యాపారులచేతనైనా కొనిపించాలి. ఆ దిశగా ఆలోచన చేయకుండా, సాగు తగ్గి, ఉత్పత్తి పడిపోయి, కొరత ఏర్పడినప్పుడు విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే దుస్థితి మళ్లీ ఎదురుకాక ముందే సంబంధిత శాఖలన్నీ మినుముకు గిట్టుబాటు ధర ఇప్పించే ప్రయత్నం చేయాలి.


సెల్ : 9393818199

మనిషి ప్రాణం కన్నా గోవు ఎక్కువా?

విశ్వనాథ్.వై

ఆయన హిందువు. హిందూత్వ పిపాసి. కరడు కట్టిన హిందూత్వవాదిగా తనను గురించి ఎవరన్నా ప్రస్తావించారని తెలిస్తే గర్వంతో పొంగిపోతారు. గోవు మా తల్లి అంటూ ఆరాధించడం ఆయన దైనందిన కార్యక్రమంలో ఓ భాగం. ఇంకా తట్టలేదా? అయన పేరు యోగి ఆదిత్యనాథ్. అత్యధిక జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి. అంతకు ముందు వరకు గోరఖ్‌పూర్ ఎంపీగా కొనసాగారు. ఎంపీగా కొనసాగిన సమయంలో చాలా తక్కువ పరిధిలోనైనా అత్యధిక మోతాదులో హిందుత్వ అజండాను అమలు చేసిన ఘనుడు. ఎన్ని రకాల కేసులు నమోదైనా వెరవలేదు. ఎంపీగా ఉండగా తన హిందూత్వ అజండాను ఆశించిన మేర విస్తరించలేక పోయానని ఆవేదన చెందేవారు. సాధువు ఆహార్యం. సామ,దాన, భేద, దండోపాయాలతోనైనా హిందూత్వను విస్తరించాలనే జీవితాశయాన్ని సాధించేందుకు కరుడుకట్టిన రాక్షసావతారమెత్తిన సాధువు. తను చేస్తోంది గోవుమాతల్లి రక్షణ కోసమేనని బాహాటంగా చెప్పుకోగలిగిన నిర్భయుడు.

రాజ్యాంగంలో ప్రవచించిన లౌకిక, ప్రజాస్వామ్య విలువలంటే ఆయనకు వళ్లు మంట. హిందూత్వ విస్తరణకు ఇవి అడ్డుపడుతున్నాయనేదే ఆయన బాధ. సహకరించే విధంగా ఉంటే గోవు మా తల్లిలానే రాజ్యాంగాన్నీ పూజించగల విశాలహృద యుడు. అధికారంలోకి వచ్చిందే తడవుగా ఎంతటి హింసకు పాల్పడైనా సరే గోరక్షణ నినాదాన్ని అమలు చేయండంటూ తన అనుచర గణాల్లో ఉత్తేజాన్ని నింపిన సాహసి. రక్షణ కవచంగా వాడుకునేందుకు గోవధ నిషేధ చట్టాన్ని తెచ్చిన ఉదారవాది. ఈ చట్టాన్ని పాటించడం లేదనే అభియోగంపై దళితులు, ముస్లిం, గిరిజన,ఆదివాసీ పేదలపై జరిగే క్రూర దాడులను 'చట్ట పాలన' కోసమన్న రాజనీతిని ప్రదర్శించిన సమర్థుడు. చివరకు గోరక్షణ సేవల కోసం ప్రత్యేకంగా అంబులెన్సు సదుపాయాన్ని కల్పించడం ద్వారా తనకూ మానవత్వం ఉందని చాటుకున్నారు. మరి గోరక్షణ ముసుగులో జరిగిన దాడుల గురించి ఎవరన్నా ప్రశ్నిస్తే తనేమీ దాపరికంగా వ్యవహరించడం లేదని, ఎంతో పారదర్శకంగా చెప్పిందే చేస్తున్నానని చెప్పుకోగల వ్యక్తిత్వం ఆయన సొంతం.



ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్పూర్‌లో ఇటీవల ఓ ప్రమాద ఘటన సంభవించింది. రహదారి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని మోటారు సైకిలు ఢీకొంది. వాహనం నడిపే, వెనుక కూచున్న బాలురు ఇద్దరికీ ప్రాణాంతక గాయాలయాయి. తీవ్ర రక్త స్రావంతో రహదారి మీద ఆ ఇద్దరూ కొట్టుమిట్టాడు తున్నారు. ప్రమాదం జరిగిన చోటుకు అతి సమీపంలో శాంతి భద్రతల పరిరక్షణ విధులు నిర్వర్తించే పోలీసులు ఉన్నారు. వారి పక్కనే ఎంతో అందంగా రంగులు వేసిన పోలీసు వాహనమూ నిలిచి ఉంది. జరిగిన ప్రమాదాన్ని పోలీసులు చూశారు. చేతుల్లోని స్మార్ట్ ఫోన్లనూ చూసుకున్నారు. ఆప్రదేశంలో సంచరించే జనమూ చూస్తున్నారు. 'అయ్యా మమ్మల్ని ఆసుపత్రికి తీసుకు వెళ్లండంటూ' క్షతగాత్రులు వేడుకుంటున్నారు. అలాంటపుడు పోలీసులు ఏం చేయాలి? తమ వాహనంలోనో లేదా అంబులెన్సును రప్పించో క్షతగాత్రులు అడగకుండానే ఆసుపత్రికి తరలించాల్సిన బాధ్యత పోలీసులది. ఈ పోలీసులు అలా చేయలేదు. పోలీసు వాహనానికి, దాంట్లోని సీటుకు క్షతగాత్రుల రక్తం అంటి అందం చెడుతుందని భయపడ్డారు. రక్తమంటినా దాన్ని తరువాత కడిగించేయవచ్చన్న ఆలోచన తట్టనంతటి స్థాయిలో భయపడిపోయారు. తమ బిడ్డల్లాంటి వారే ఎదురుగా రక్తపు మడుగులో ప్రాణాలు కాపాడమం టున్నారన్న ఇంగితమూ లోపించిన వారయారు. క్షతగాత్రులను కాపాడమంటూ .జనం పెట్టే కేకలూ వారి చెవుల్లోకి దూరబడ లేదు. సీటుకు రక్తం అంటితే ఇబ్బంది కదా? ఏం చేద్దాం? వంటి గుసగుసల్లో పోలీసులు లీనమైపోయారు. ఎవరి కోసమూ ఆగని కాలం చక చకా సాగింది. క్షణాలు...నిమిషాలు గడిచాయో లేదో అధిక రక్త స్రావంతో నీరసించి పోయిన క్షతగాత్రులిద్దరూ ఊపిరి వదిలారు. ఈ దారుణం గురించి, పోలీసుల తీరును ఇతరులకూ తెలియజేయాలనే ఆవేదన కలిగిన ఓ పౌరుడు ప్రమాద ఘటనలను వీడియోలో బంధించాడు. సామాజిక మాధ్యమాల ద్వారా చక్కర్లు కొట్టిన వీడియో సమాచారం తెలుసుకున్న పోలీసు పెద్దలు సహజంగానే ఉలిక్కి పడ్డారు. ముఖ్యమంత్రికి అప్రదిష్ట రాకూడదని ప్రమాద స్థలంలో 'వీక్షక' విధులు నిర్వర్తించే పోలీసులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఉద్యాసన పలికితే పోలీసు కుటుం బాలు బజారున పడతాయని భయపడి ఉండవచ్చు. అంతే తప్ప క్షతగాత్రుల కుటుంబాలకు వాటిల్లిన నష్టాన్ని ఎలానూ భర్తీ చేయలేమన్న శ్మశాన వైరాగ్యానికి పరిమితమైనారు. తెలిస్తే బాధపడతారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు లేదు. ప్రజలను అన్ని వేళలా కాపాడాల్సిన ప్రధాన బాధ్యత పోలీసులది. ఈ ఘటనలోని హృదయం లేని పోలీసులు ఈబాధ్యతను విస్మరించారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాలన దౌర్బల్యానికి ఈ విషాద ఘటన అద్దం పడుతోంది. తమతో నడిచే, తమలో ఒకరుగా బతుకులీడ్చే పోలీసులు తమ రక్షణ విధి నిర్వహణలో విఫలమై నందుకు మూల్యం చెల్లిస్తోంది మాత్రం ప్రజలే. ఈ ప్రజల్లోనే అనూహ్య ప్రమాదంలో సకాలంలో వైద్య చికిత్సలందక ప్రాణాలు కోల్పోయిన ఆ బాలురూ ఉన్నారు. సకాలంలో వైద్య సేవలందితే వారి ప్రాణ రక్షణ జరిగేది. ఈ ఘటన.. ప్రజల ప్రాణాల కంటే గోవు ప్రాణాలు ఎక్కువన్న సందేశాన్ని లోకానికి చాటినట్లయింది. అందుకే కాబోలు అమెరికాలోని హక్కుల సంస్థ ఆక్స్‌ఫామ్ ఇటీవల విడుదల చేసిన నివేదికలోనూ-భారత్‌లో హిందుత్వ జాతీయో న్మాదం పెచ్చు మీరుతున్నా యని తీవ్ర పదజాలంతో విమర్శ చేసిన సంగతి ప్రస్తావనార్హం.

విశ్లేషణ

బీజేపీ వ్యతిరేకుల వైపే తమిళుల మొగ్గు

బండారు రాధాకృష్ణ

దక్షిణాది రాష్ట్రాలలో తమిళనాడుకు ద్రవిడ సంస్కృతిపై మక్కువ ఈ నాటికీ తగ్గలేదని ప్రస్తుతం ఆ రాష్ట్ర రాజకీయాలు నిరూపిస్తున్నాయి. అందుకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో దినకరన్ విజయం ఉదాహరణగా పేర్కొనవచ్చు. మతపరంగా బీజేపీ వారిని వ్యతిరేకిస్తూ అక్రమ సంపద విషయంలో కేసుల్లో ఇరుక్కొన్న దినకరన్‌ను గెలిపించడం ద్వారా బీజేపీ ఉచ్చులో పడవద్దని ఓటు ద్వారా తమిళ ప్రజలు నిరూపించారని భావించవచ్చు. ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షులు అమిత్‌షా దక్షిణాది రాష్ట్రాలను చేజిక్కించుకోవడానికి వేసిన ఎత్తులను తమిళ ప్రజలు చిత్తుచేశారు. జయలలిత మరణాన్ని ఆసరా చేసుకొని వెంకయ్య నాయుడును, గవర్నరు విద్యాసాగరరావులను పంపడంలో తమిళనాడులో తెలుగు ప్రజల సంఖ్య అధికంగా వుండటం కూడా వారి ఉద్దేశాలలో ఒకటి కావచ్చు. అంతకుమించి నాయకురాలిని కోల్పోయి పార్టీ నేతగా చిన్నమ్మను ఎన్నుకున్న స్థితిలో శశికళను కేసుల ఆధారంగా జైలుకు పంపారు. అధికారమే పరమావధిగా అతినీచంగా ఆలోచించి మోడీ, షా ద్వయం వేసిన పాచికలు తమిళనాట పారలేదు. ద్రావిడులు అనార్యులనీ, సంస్కృతి తెలియనివారనీ, నల్లవారనీ అనేకరకాలుగా ఛీత్కారాలకు గురైన సంగతి ఇతర దక్షిణాది రాష్ట్రాలు మరచినా తమిళులు మరువలేదని అనేక సందర్భాలలో రుజువైంది. వారికి రాష్ట్రప్రజలు, వారి ప్రయోజనాలే ముఖ్యం. రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం కేంద్రంలో ఏ పార్టీ పాలనలోఉన్నా వారితో సఖ్యతగాఉండి పరిష్కరించాలనుకుంటారే తప్ప తమ రాష్ట్రాన్ని జాతీయపార్టీల చేతుల్లోకి పోకుండా కాపాడుకుంటారని 1977 నుండి మనకు తెలుస్తూనేఉంది.

అసలు ఆర్యులు, ద్రావిడులనే రెండు తెగలు లేవనీ, ఉంటే మనువుకు ముందు ద్రావిడుల పరిస్థితి ఎక్కడా పేర్కొనలేదని మను సంస్కృతి పట్ల వైరుధ్యమే ద్రవిడులుగా పిలిచినట్లు కౌటిల్యుడు పేర్కొన్నట్లు అంబేద్కర్ ఒక గ్రంథంలో రాశారని కొందరు చెబుతారు. మనువును నెత్తినపెట్టుకొని వర్ణాలుగా విభజించి ద్రావిడులుగా దాస్యులని దాస్యం చేయించుకునే బ్రాహ్మణిజంపై దండయాత్ర ప్రకటించిన రామస్వామి నాయకర్ బోధనలు తమిళులు ఇంకా మరువలేదు. ద్రావిడులు కూడా యితరులను సంబోధిస్తూ ఆర్యా అనే పదంతోనే మొన్నటివరకు ఉత్తరాలు, విజ్ఞాపనలు వ్రాసిన సంగతిని ప్రస్తావిస్తూ అందరూ ఆర్యులేననే సంగతి ఒక వ్యాసకర్త గుర్తుచేస్తున్నారు. మను సంస్కృతిని నెత్తినపెట్టుకుని తాము ఆర్యులమని చెప్పి శూద్రులుగా వర్ణించి దాస్యం చేయించుకోవడానికి ప్రయత్నించిన బ్రాహ్మణిజంపై ఆనాడు తమిళనాట రామస్వామినాయకర్, తెలుగునాట త్రిపురనేని రామస్వామిలాంటి సంస్కరణవాదులు అందించిన పోరాటఫలితం తమిళులు మరవలేదు. ఆంధ్రులకన్నా తమిళనాట ఆధ్యాత్మిక భావుకత ఎక్కువైనా ఆర్యులు పూజించే దేవుళ్లను వారు భక్తితో కొలవరు. అందుకే అక్కడ రామాలయాలు చాలా అరుదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అక్కడ అనాథలుగా మిగిలిన అన్నాడీఎంకేకు ఒక రథసారథి అవసరమనే విషయం వారికి తెలిసినా, ప్రస్తుతం పాలించే సెల్వం, పళని ద్వయం కేంద్రానికి తలొగ్గరనే భావనలోనే దినకరన్‌ను వారు గెలిపించుకున్నారు.

ఆనాడు రామస్వామి అనుంగు శిష్యుడు అన్నాదురైకు కుడిఎడమలగా మసలి ద్రవిడకజగం (డీకే) సంస్థ ప్రజలకు చేరువకావడానికి కరుణానిధి, ఎంజీఆర్ చేసిన కృషి ఎనలేనిది. కరుణానిధి నాటకం రాయడం, ఎంజీఆర్ నటించడం ద్వారా డీకే అత్యున్నత ప్రజాదరణ సంస్థగా రూపొందింది. ప్రజల ఆదరణ గుర్తించి అధికారం కూడా అవసరమని డీకేను ద్రవిడ మున్నేట్రకజటం (డీఎంకే)గా మార్చి రాజకీయరంగం ప్రవేశంచేసి ఆనాటి కాంగ్రెస్‌ను మట్టి కరిపించారు. ఆనాటి నుండి ఈనాటికీ జాతీయపార్టీకి అవకాశం యివ్వలేదు. ఎంజీఆర్ విడిపోయి అన్నాదురై పేరుతో అన్నాడీఎంకేని స్థాపించి ఆ రెండు పార్టీల పరిధిలోనే తమిళప్రజలు కొనసాగారు. ఎంజీఆర్ వారసురాలిగా ప్రజలు అమ్మగా పిలుచుకున్న జయలలిత మరణం తరువాత ప్రస్తుతం కొత్త పార్టీలు జెండా ఎగురవేస్తున్నాయి.

ఇటీవల పార్టీలు స్థాపించిన కమల్‌హసన్, రజనీకాంత్‌లిద్దరి మనస్తత్వాలు విరుద్ధమైనవి. రజనీకాంత్ పూర్తి ఆధ్యాత్మికవాదికాగా, కమల్‌హాసన్ నాస్తికుడు. హేతువాదిగా ఆలోచించే మనిషికనుకనే ఆయన నటించిన కొన్ని సినిమాలలో మూఢనమ్మకాలకు వ్యతిరేక ధోరణలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అవినీతి రూపుమాపేదిశలో ఆయన భారతీయుడు సినిమా తీశారు. ఆయన తమిళకవి సుబ్రమణ్యభారతితోపాటు శ్రీశ్రీ లాంటి కవులు రచనలు కూడా అధ్యయనం చేసినట్లు ఆయన సినిమాల ద్వారా తెలుస్తున్నది. అధికారం ద్వారా ప్రజలను మూఢనమ్మకాలనుండి బయటపడేయాలనే తాపత్రయం ఉన్న మనిషి. అసలు ఆ కుటుంబం మార్క్సును అధ్యయనం చేసినట్లు చెబుతుంటారు. ఆయన అన్న చారుహసన్, కుమార్తె ప్రముఖనటి సుహాసిని కుమారుడు 12ఏళ్ల వయసులోనే మార్క్సును గురించి మాట్లాడిన సంగతి గతంలోనే వార్తా పత్రికలో చదివాం. రజనీకాంత్ మాస్ హీరోగా, కమల్‌హసన్ క్లాస్ హీరోగా ఇద్దరూ ప్రజల మన్ననలు పొందినవారే, ఇద్దరూ అభిమానుల ఫాలోయింగ్ ఉన్న నటులే. అయితే తమిళప్రజలకు ఏ మాత్రం గిట్టని బీజేపీతో రజనీకాంత్ చేతులు కలపవచ్చుననే సందేహం ప్రజల్లో ఉంది. అందుకు మొట్టమొదటిగా యాంటిసెంటిమెంటుతో సినిమా తీసిన ప్రముఖ దర్శకుడు భారతీరాజా రజనీకి వ్యతిరేకంగా ప్రకటన యివ్వడమే కాక ఆయన తమిళు డుకాదని తమిళనాడును పాలించడానికి ఆయనకు హక్కులేదని పత్రికలకు ఎక్కారు. ఈ ప్రభావం తమిళ ప్రజలపై పడకమానదు. ఈ విషయాన్ని డీఎంకే అదనుగా ఉపయోగించుకోవడానికి వెనుకాడకపోవచ్చు. ఇటీవల కరుణానిధి కుమార్తె, ఎంపీ కనిమొళి తిరుమల వచ్చి ప్రజలందరికీ కాక కేవలం ఉన్నవారికి ఉపయోగపడే వెంకటేశ్వరస్వామి ఉన్నా లేకపోయినా ఒకటేనని అన్నారు. వెంటనే ఆధ్యాత్మికవాదులు ఆమెపై విరుచుకుపడ్డారు. రాజకీయంగా ఉపయోగించుకొనే స్టేట్‌మెంటుగా కొందరు వ్యాఖ్యానించారు.

ద్రవిడ సంస్కృతి జీర్ణించుకున్న తమిళులు ఆర్య సంస్కృతి పేరుతో హిందూరాజ్యంగా భారతదేశాన్ని మార్చాలనే విషయంలో అన్ని తమిళపార్టీలు విభేదించడంతో ముందుంటారని గ్రహించాలి. శశికళను జైలుకు పంపిన తరువాత అధికారంకోసం పోటీపడిన పన్నీరుసెల్వం, పళనిస్వామి ఒకటై అధికారం నిలుపుకోవడానికి మోడీ, షాలు తలవంచి దగ్గరయ్యారని తలచబట్టే ఆర్‌కె నగర్ ఉప ఎన్నికల్లో దినకరన్‌ను గెలిపించారనే సంగతి విస్మరించరానిది. అదే కోవలో రజనీకాంత్‌ను కూడా అర్థంచేసుకుంటే ఆయన్ని దూరంపెట్టడానికి తమిళ ప్రజలు వెనుకాడబోరు. ఎన్నికలు సమీపించిన తరువాత డీఎంకే ఒంటరిగా పోటీ చేయక పొత్తులుపెట్టుకుంటే రజనీని దగ్గరకు తీసుకోకపోవచ్చు. ఎవరికి ఓటేసినా బీజేపీ వ్యతిరేకులవైపే మొగ్గు చూపించడానికి అవకాశం ఎక్కువగా ఉండవచ్చు.

సీనియర్ జర్నలిస్టు

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
27 జనవరి 2018

ఎవరేమన్నా సరే.. కొన్ని ప్రాంతాల్లో, గ్రామాల్లో చైతన్య వీచికలు చాలా ముందుగానే వీస్తాయి. అందుకు అనేక కారణాలు.. సమాజ గమనాన్ని అర్థంచేసుకొన్న మార్గదర్శకులు, వారి మాటకు విలువనిచ్చి ముందుకు సాగే అనుచరులు, ఆలోచనపరులు, అక్కడి వాతావరణం. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలంలోని వక్కలగడ్డ గ్రామం పేరు చెబితే అరుణ పతాక రెపరెపలు, కమ్యూనిస్టు భావ వీచికలు మన కళ్ల ముందు కదలాడతాయి. దానితోపాటు సహకార బ్యాంకు, కమలా నెహ్రూ మహిళా మండలి కూడా ఇప్పటికీ మనకు దర్శనమిస్తాయి. స్వాతంత్ర్యం సాధించిన తొలినాళ్లలోనే మహిళా సాధికారత ఆవశ్యకతను ఆ గ్రామ పెద్దలు, కమ్యూనిస్టు నేతలు గుర్తించారు. వారి ఆశీస్సులు, ఆలోచనలతో ఆ గ్రామ మహిళలు కూడా ముందడుగు వేశారు. గ్రామీణ ప్రాంత మహిళలకు కావల్సిన చైతన్యాన్ని, చేతి వృత్తులను అందించడంతో పాటు వారు సమష్టిగా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఆ మహిళా మండలి విశేష కృషిచేసింది... చేస్తున్నది. మహిళా చైతన్య దీప్తిగా వెలుగొందుతోంది. తన ప్రస్థానాన్ని విభిన్నంగా, విశిష్టంగా కొనసాగిస్తూ ఆదర్శ మహిళా మండలిగా పదుగురి ప్రశంసలు పొందింది. ఉత్తమ మహిళా మండలి అవార్డునూ అందుకుంది. మరీ ముఖ్యంగా సుదీర్ఘకాలంగా మహిళల ప్రగతి, వికాసం కోసం పాటు పడుతోంది. స్వశక్తి, స్వావలంబనలో వనితలకు అండగా నిలబడుతోంది. మహిళా సాధికారత కోసం తనదైన శైలిలో పాటుపడుతోంది.


ప్రస్తుత పాలకవర్గం

కమలా నెహ్రూ మహిళా మండలి...

మహిళా చైతన్య దీప్తి!

ఎటు చూసినా పచ్చని ప్రకృతి. చల్లగా వీచే పైరగాలి. గ్రామంలోకి అడుగుపెట్టగానే సాదరంగా ఆహ్వానించే ఎర్రజెండా రెపరెపలు, దారి పొడవునా ఆహ్లాదకరమైన వాతావరణం. ఇదీ వక్కలగడ్డ గ్రామం. ఇలాంటి వాతావరణంలో జీవించేవారిలో సాధారణంగానే సానుకూల దృక్పథం ఉంటుంది. అదే మహిళలైతే ఇక చెప్పేదేముంది. అందుకేనేమో అక్కడ ఉన్న కొంతమంది మహిళలు ఒక్కటయ్యారు. ఒక మహిళా మండలిగా ఏర్పడ్డారు. వారి జీవితాలను చక్కదిద్దుకోవడమే కాదు తమ చుట్టూ ఉన్న మహిళలకూ చేయూతనిస్తున్నారు. ఇందుకోసం ఎన్నో చేస్తున్నారు. ఈ గ్రామంలో మహిళలెవరూ ఖాళీగా ఉండరు. దాదాపుగా అందరూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు అంటే నమ్మగలరా! ఇదంతా కమలా నెహ్రూ మహిళా మండలి కృషే. మహిళా మండలి అంటే సాధారణంగా కిట్టీ పార్టీలు, వేడుకలు, సంబరాలు ఇవే అనుకుంటారు. కానీ కమలా నెహ్రూ మహిళా మండలి చేసే కార్యక్రమాలు వీటికే పరిమితం కాలేదు. మహిళల ఆరోగ్యానికి పనికొచ్చే యోగా నుంచి వారి అభివృద్ధికి కావాల్సిన ఎన్నో రకాల పనులు చేస్తోంది.

ఏర్పడింది ఇలా...!

కమలా నెహ్రూ మహిళా మండలి ఏర్పడి చాలాకాలమే అయ్యింది. ఈ విషయం ఈ మండలి పేరు వింటేనే అర్థమవుతోందనుకుంటా! స్వాతంత్ర్యోద్యమ భావాలు బాగా వేళ్లూన్నుకున్న కాలంలోనే ఇది ఏర్పడింది. ఆ స్ఫూర్తితోనే ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ భార్య కమలా నెహ్రూ పేరుని ఈ మండలికి పెట్టారు. కొద్దికాలం ఏ కార్యక్రమాలకు నోచుకోలేకపోయింది. చివరకు 1965లో ఈ మండలిని రిజిస్ట్రర్ చేయించారు. రెండేళ్ళ క్రితమే ఇది స్వర్ణోత్సవాలూ జరుపుకుంది. మహిళల అభివృద్ధి కోసం పాటు పడే ఒక మహిళా మండలి ఇంత సుదీర్ఘకాలం పనిచేయడం, ఇంకా ఈ మార్గంలోనే ముందుకు సాగుతుండడం విశేషమే.

కారకులు వీరే...!

ఈ మహిళా మండలి ఏర్పాటు వెనక గ్రామ పెద్దల హస్తమూ ఉంది. రమణవరపు వెంకటేశ్వరరావు, మల్లిపెద్ది రామసుబ్బయ్య, హనుమాన్ల వెంకటేశ్వరరావు....ఈ మండలి ఏర్పాటుకు కారకులు వీరే. ఈ మండలికి ఓ భవనం ఏర్పాటు కోసం ఊరి పెద్దలంతా కలిసి అప్పట్లోనే స్థలం కేటాయించారు. గ్రామస్తుల సహకారంతో అనేక కార్యక్రమాలనూ ప్రారంభించారు.


యం. రత్నకుమారి గారి శిక్షణలో...

ఎన్నో కార్యక్రమాలు

ఉదయం పూట యోగాతో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. కనీసం ఏబైమిది మంది ఈ యోగాలో తప్పనిసరిగా పాల్గొంటారు. ఈ మహిళా మండలి మొత్తం సభ్యుల సంఖ్య 60. మిషన్ సెంటర్, మగ్గం నేత, బ్యూటీషియన్ కోర్సు, పెయింటింగ్, జర్దోసీ, మిషన్ ఎంబ్రాయిడరీ, పేపర్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, శారీ పెయింటింగ్, మెహందీ, అగరుబత్తిల తయారీ తదితర ఎన్నో పనులు ఇక్కడ నేర్పిస్తారు. డబ్బులు పొదుపు, రికరింగ్ డిపాజిట్ చేయడం లాంటివి అలవాటు చేశారు. జనసంస్థాన్, జనశిక్షణా సంస్థాన్, రామనంద తీర్థ ఇనిస్టిట్యూట్, పట్టాభి మెమోరియల్ తదితర ఎన్నో సంస్థల సహకారంతో ఈ మండలి ఈ కార్యక్రమాలను నిర్వహించింది, నిర్వహిస్తోంది. 40 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పాడి గేదెల కొనుగోలుకు లోన్‌లు ఇప్పించారు, వివాహ పథకాలూ వర్తింపచేశారు.

చుట్టుపక్కల గ్రామాల నుంచి

ఒక్క వక్కలగడ్డ గ్రామంలో మహిళలే కాదు చుట్టుపక్కల గ్రామాలు అవనిగడ్డ, కొడాలితో పాటు మచిలీపట్నం నుంచి కూడా మహిళలు ఈ కోర్సులన్నీ నేర్చుకునేందుకు ఇక్కడకు వచ్చేవారు. ఇక్కడ పని నేర్చుకున్న మహిళలు తమలాంటి మరికొంతమందికి ముఖ్యంగా పేద మహిళలకు నేర్పించేందుకు కృషి చేస్తున్నారు.

భవనాలు....నిధులు ఇలా...

మహిళా మండలి చేస్తున్న కార్యక్రమాలు చూసి దీనికి భవనాలు సమకూర్చేందుకు ఎంపీలు ముందుకొచ్చారు. సీపీఐ ప్రముఖ నాయకులు దాసరి నాగభూషణం గారు రూ. 2లక్షలు, మరో ఎంపీ బాలశౌరి గారు తమ ఎంపీ నిధుల నుంచి రూ. 2 లక్షలు ఇచ్చారు. ఈ రకంగా భవనాలు అయితే సమకూరాయి గానీ మండలి కార్యక్రమాల నిర్వహణ కష్టసాధ్యమైంది. దీంతో నిధుల కోసం మహిళా మండలి సభ్యులు ఎన్నో రకాల ప్రయత్నాలు, ఆలోచనలు చేశారు. ఇందులో నుంచి వచ్చిందే హోం ఫుడ్స్ ఆలోచన. ఈ హోం ఫుడ్స్ ఇప్పుడు మూడు రకాల బ్రాంచీలతో ఉజ్వలంగా నడుస్తోంది. మంచి పేరు గడించడమే కాదు మహిళా మండలికి అవసరమైన నిధులనూ ఇది సమకూరుస్తోంది. దీనికి ముందు మండలికి డబ్బుల కోసం సర్ఫ్, విమ్ కలిపి అమ్మడం లాంటి ఎన్నో రకాల పనులూ చేశారు ఈ మండలి సభ్యులు.

ఎన్నో మంచి పనులు

పదో తరగతిలో ఫస్ట్ వచ్చినవారికి ప్రోత్సాహకంగా రూ. 2వేలు ఇవ్వడం, అగ్నిప్రమాద బాధితులు, తుఫాన్ బాధితులకు విరాళాలు పోగు చేసి ఇవ్వడం, మెడికల్ క్యాంప్ నిర్వహణ, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, నీటి కుళాయిలకు సున్నం వేయడం లాంటి ఎన్నో మంచి పనులు ఈ మహిళా మండలి తరపున చేస్తున్నారు. ఏటా తప్పనిసరిగా ఒక్కసారైనా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తారు. నాగార్జునా, మణిపాల్ ఆస్పత్రుల నుంచి హార్ట్ స్పెషలిస్టులు, గైనకాలజిస్టులు వస్తారు. కార్తీకమాసంలో విహారయాత్ర లాంటి ఆహ్లాదకర కార్యక్రమాలూ నిర్వహిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గులు, పాటలు, వ్యాసరచన పోటీలు, కుర్చీలాట లాంటివి చేస్తారు. ఇవే కాదు తల్లిపాల వారోత్సవాలు, మొక్కలు నాటడం, వన మహోత్సవం నిర్వహణ లాంటివీ ఈ మండలి కార్యక్రమాల జాబితాలో ఉన్నాయి. అటు ఆనందం, ఆహ్లాదం, ఇటు ప్రగతి, వికాసం, అభివృద్ధి అన్ని రకాల పనులకు ప్రాధాన్యతనిస్తున్నారు కనుకనే ఉత్తమ మహిళా మండలి అవార్డునూ పొందింది కమలా నెహ్రూ మహిళా మండలి. 1997-98లో స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా నెహ్రూ యువకేంద్రం వారు ఈ మండలికి ఉత్త మహిళా మండలి అవార్డును ఇచ్చారు.

సమష్టి కృషి

పట్టుదల, సమష్టి కృషి ఉంటే ప్రగతి బాటలు వేసుకోవడానికి ఎంతో కాలం పట్టదని నిరూపించారు ఈ కమలా నెహ్రూ మహిళా మండలి సభ్యులు. స్వయం ఉపాధి, స్వావలంబనతో ఎంతోమంది మహిళల జీవితాల్లో చైతన్య కాంతులు పూయించారు. ఈ మండలి చేసే ప్రతి కార్యక్రమం వెనక సభ్యులందరి సమష్టి కృషి ఉంది. మహిళా దినోత్సవం మొదలు నూతన సంవత్సరం, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే కార్యక్రమాలూ అందరూ కలిసికట్టుగా జరుపుకుంటారు

కంప్యూటర్ ఆవశ్యకత

ప్రస్తుతం ఈ మహిళా మండలికి కంప్యూటర్ అవసరం ఉందని, ప్రభుత్వం తరపున అధికారులు ఎవరైనా దీనిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కంప్యూటర్ ఏర్పాటు చేస్తే కంప్యూటర్ కోర్సుల నిర్వహణతో పాటు సాంకేతికంగా ఇతరత్రా ఎన్నో పనుల నిర్వహణ సులువవుతుందని చెబుతున్నారు.

ఎందరో మహిళామణులు

ఈ కమలా నెహ్రూ మహిళా మండలి నిర్వహణ వెనక ఎందరో మహిళామణుల నిరంతర కృషి ఉంది. ఈ మహిళా మండలికి తొలి అధ్యక్షురాలిగా పనిచేసిన దాసరి ధనలక్ష్మి నుంచి ప్రస్తుత అధ్యక్షురాలు దాసరి సుభద్రా దేవి వరకూ ఎందరో మహిళలు వారి సేవలు అందించారు, అందిస్తున్నారు. ధనలక్ష్మి గారు అప్పట్లో బాల సంఘాలనూ ఏర్పాటు చేశారు. ఈ మండలి స్వర్ణోత్సవాల సమయంలో అధ్యక్షురాలిగా ఉన్న మల్లుపెద్ది రత్నకుమారి పాత్ర ఎంతో కీలకమైనది. ఇప్పటికీ ఈ మండలి నిర్వహణ వెనక ప్రధాన భూమిక పోషిస్తున్నది ఆమే.

వక్కలగడ్డ గ్రామంలో ప్రతి ఇంట్లో మహిళలు ఇంటి పని కాకుండా అదనంగా ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు అంటే అతిశయోక్తి కాదు. దుస్తుల డిజైనింగ్, బట్టలషాపులు, వంటలు, మగ్గం, మిషన్ ఇలా ఏదో ఒకటి చూస్తూనే ఉంటారు. ఇదంతా కమలా నెహ్రూ మహిళా మండలి చలవే. ఈ గ్రామమే కాదు ఎన్నో గ్రామాల మహిళలకూ ఈ మండలి ఆసరాగా నిలిచింది, నిలుస్తోంది. అందుకే ఈ ప్రాంత ప్రజల గుండెల్లో ఆదర్శ మహిళా మండలిగా మంచి స్థానాన్ని, గుర్తింపును దక్కించు కుంది. అన్ని మహిళా మండలులు ఈ బాటలోనే పయనిస్తే మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధించడం ఏమంత కష్టం కాదు కదా! ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించడమే మా ధ్యేయం అంటారు ఈ మహిళా మండలి సభ్యులు. వారి ఆశ, ఆశయం నెరవేరాలని మనమూ ఆశిద్దాం.!

ప్రముఖుల సందర్శన

వక్కలగడ్డ ప్రాంతానికి వచ్చే ప్రముఖులు ఎవరైనా ఈ మహిళా మండలికి రావాల్సిందే. ఇలా ఎందరో ఐఏఎస్ అధికారులు ఈ మండలిని సందర్శించారు. వీరిలో కలెక్టర్ మీనా, చిత్రా రామచంద్రన్, పార్థసారథి భాస్కర్ తదితరులు ఉన్నారు.

- ఎస్.వి.జ్యోతి



అక్షర కృష్ణ కార్యక్రమం మాలపల్లి ఎ.ఎ.స్కూలులో...


రాజ్యసభ సభ్యులు శ్రీ దాసరి నాగభూషణరావు గారిచే భవన ప్రారంభోత్సవంలో దాసరి, రామసుబ్బయ్య, వెంకటేశ్వరరావు, రత్నకుమారి, రాజకుమారి, లక్ష్మి తదితరులు


మహిళా మండలి ఫొటోలను తిలకిస్తున్న కలెక్టర మీనా...


బతుకు చిత్రం

పసుపు...ఔషధం



- పసుపు పొడిలో కొద్దిగా నెయ్యి కలిపి తింటే దగ్గు తగ్గుతుంది.
- పసుపు పొడితో ఆవిరి పడితే జలుబు, తలనొప్పి, ముక్కు దిబ్బడ తగ్గుతాయి
- పసుపులో ఉల్లిపాయ కలిపి బాగా నూరి వాపులు ఉన్నచోట రాస్తే వాపు తగ్గిపోతుంది
- పసుపులో తాటిబెల్లం, యాలకుల పొడి కలిపి తాగితే చలిజ్వరం, గుండెదడ, ఆయాసం తగ్గుతాయి
- పసుపులో ఉప్పు, నిమ్మరసం కలిపి పూస్తే కురుపులు, బెణుకులు, కీళ్ళనొప్పులు పోతాయి
- పసుపు కొమ్ములతో కషాయం కాచి ఆ నీటిని ప్రసవించిన బాలింతలకు ఇస్తే పొట్టలో ఉమ్మనీరు బయటకు వచ్చేస్తుంది.



జరిగిన కథ

నేను తుళ్ళిపడి "ఇదేమిటి? ఈ పదేళ్ళాయి లేని తద్దినం ఇప్పుడు పెట్టడం ఏమిటి?" అన్నా. "పదేళ్ళాయి పెట్టకపోయినా కాలదోషం అంటూ లేదులే! ఇప్పుడు పెట్టకూడదని 'ఎస్టాప్పెల్లూ' లేదూ!" అన్నాడు. అని - "నువ్వు ఏం ఇబ్బంది పడనక్కరలేదు. నీ వంతు "ప్రోక్సీ" నాకుందిగా, ఏర్పాట్లన్నీ నేను చేసేశానులే. భోక్తలు నలుగురూ, మంత్రం చెప్పే పొరోహితుడూ సాయంత్రం ఆరు గంటలకే మన ఇంటికి వచ్చి హాజరై రాత్రి ఇక్కడ పడుకునేటట్టు ఏర్పాటు. లేకపోతే వాళ్ళు రాత్రి సుష్టు కృత్తుగా భోంచేసి-పొద్దున్న ఇడ్డెనులు, కాఫీ సేవించి ఏ పది గంటలకో వస్తారు. మన ఇంటి దగ్గరే పడుకునేటట్టు చేస్తేనే పవిత్రంగా వుంటారు" అన్నాడు.

(నిన్నటి సంచిక తరువాయి)

వంటిపూట అయిందేమో బ్రాహ్మలకి - పాపం - సూర్యోదయం అవగానే మొదలు పెట్టేశారు. సరిగ్గా తొమ్మిది కొట్టగానే బెంగుళూరు హోటేలు వాళ్ళ కారు - ఇద్దరు బ్రాహ్మణ కుర్రాళ్ళు - ఒక నాయరు, నాలుగు అరటిలు, నాలుగు పచ్చళ్ళు, నాటుచారు - భక్ష్యం - గారెలు - పరమాణ్ణం - చద్ది - వబ్బట్టు - పెరుగు - ఉప్పు - పంచదార - నెయ్యి నూనె - పచ్చిమిరపకాయలు - వట్టిగుడ్డ చుట్టిన ఏడు పెద్ద టిఫిన్ కారియర్లతోపాటు - ఏడు అరటాకులు నలుగురు భోక్తలు - మంత్రం చెప్పే అతను - శాస్త్రి - దేవుడికి విస్తరి - చిన్న కారియర్‌లో పాకానికి "ఎక్స్‌ట్రా"... పదకొండూ కొట్టేసరికి - అంతా పూర్తి అయిపోయింది. బైసికిళ్ళమీద బ్రాహ్మలూ - మోటారు వేనులో హోటేలువాళ్ళు - ప్యాకార్డుమీద శాస్త్రీ - అందరూ ఎవరిమానాన్న వాళ్ళు వెళ్ళిపోయారు.

నాకేం పాలుపోకుండా వుంది. ఈ తద్దినం పెట్టడమేమిటి - నమ్మకం వున్నట్టా - లేనట్టా? అసలు ప్రశ్న - మతం - సంస్కారం - ఇంత సుళువుగానూ లాంఛన ప్రాయంగానూ చేసేస్తే - అసలు ఆర్య సంస్కృతే పోతుందేమో? ఛాందసం - నిష్ఠ - నియమం - ఇవి అర్థం చేసుకోగలను. కానీ గిరీశం "ఆల్జీబ్రా మేడ్ డిఫికల్టు" లాగు - ఈ "రివిజన్ మేడ్ ఈజీ" పరమ దగాకోరుతనం కింద తయారవుతుందేమో? - అని ఇలాగు తర్కించుకుంటున్నాను - ఇంతట్లో శాస్త్రి క్లబ్బు నుంచి ఇంటి కొచ్చేశాడు - టెన్నీసు కమీజు, వులెను స్వెట్టరు, బ్లేజరు, తెల్ల ఫ్లానెల్సు, కాన్వాసు జోడు, టెన్నీసు రాకెట్టుతో "శాంతం" అంటూనే మేడమీదికి వెళ్ళిపోయాడు. మరో పది నిమిషాల్లో కల్లా స్నానం చేసి క్రింది కొచ్చేశాడు. చూడును కదా పిఠాపురం కోరా ఖద్దరుసూటు - తిరుపూరు ఖద్దరు కమీజు! నేను నిశ్చేష్టురాలై చూస్తున్నాను. నన్ను ముద్దుపెట్టుకొని -

"సర్ ఛునీలాల్ మాధో, సర్ రిచర్డు బ్లాకుస్టోనున్నూ నన్ను మద్రాస్ క్లబ్బులో భోజనానికి పిలిచారు. చాలా ముఖ్యమైన విషయం. నన్నాశీర్వదించి సాగనంపుమీ!" అంటూ నవ్వుతూ కారెక్కి వెళ్ళిపోయాడు.

ఇంతట్లో గుమ్మంలోకి ఎవరో వచ్చినట్లయింది, "ఓహో రామస్వామి గారా! దయచేయండి!" అని లోపలికి తీసుకువచ్చాను. సత్యాగ్రహం రోజులై పోయాక రామస్వామిని రెండుమూడుమార్లు కలుసుకున్నా. సంవత్సరం అయి చూడలేదు. కుశలప్రశ్నలయిం తరువాత అతనన్నాడు - "నేను సంవత్సరం అయి రైతుసభలను యేర్పాటు చేస్తున్నాను. కార్మికవర్గాన్ని జాతీయోద్యమంలోకి లాక్కువచ్చినట్టు కర్షకవర్గాన్ని కూడా మనం తయారు చెయ్యాలి. జమీందార్లకి భయపడి ఎవ్వరూ దీన్ని గురించి అంత పూనుకోవడంలేదు. నేనూ, మరికొందరు సత్యాగ్రహులం తంటాలు పడుతున్నాం అనుకోండి. మీరుకూడా



ఇందులోకి వచ్చి పనిచేస్తే బాగుంటుంది" అన్నాడు.

"నేను జబ్బు మనిషిని అయిపోయానండీ రామస్వామిగారూ! అంచేత ఉదతాభక్తిగా చాటునుండీ సాయం చెయ్యడం తప్ప ముందుకు వచ్చి పని చేయలేనండీ, క్షమించండీ!" అన్నా.

"సరే దానికేంగాని - అసలు మరో సంగతి మీతో మాట్లాడ్డానికని వచ్చాను. ఎన్నికలు మరినాలుగు నెలల్లో జరగబోతున్నాయి. వచ్చే నెలలో కాంగ్రెసువారు అభ్యర్థులను ఏర్పరుస్తారు. అప్పుడు మన శిబిరంలో వున్న



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

సత్యాగ్రహులందరం మొన్న కలుసుకొని స్త్రీల స్థానానికి ఒకదానికి మీరు నిలబడితే బాగుంటుంది అని అనుకున్నాం. నాయకులతో చెప్పేం. మీరు నిలబడతాం అంటే తప్పకుండా మీ పేరే సూచిస్తాం అని వాగ్దానం చేశారు. అందుకు మీ ఖరారు తీసుకుందాం అని వచ్చాను" అన్నాడు.

"నా పేరు సూచించినందుకు మీకూ, మన స్నేహితులందరికీ నా వందనాలు చెప్పండి. నాలుగైదు రోజుల్లో ఆలోచించి మీకు కబురు చేస్తా" అన్నా. ఆయన వెళ్ళిపోయాడు.

నాకేం తోచడం లేదు. రాజకీయాలకి దూరంగా వుందాం అంటే మీదకొచ్చి పడుతూంటే! శాస్త్రి భవితవ్యానికి ఏమైనా అడ్డువస్తుందేమో? సంసారం చేస్తూ - రాజకీయంలోకి దిగగలనా? ఎసెంబ్లీలో కూర్చోవడంతో సరిపోదు - కార్మికవర్గాన్ని జాతీయోద్యమంలోకి వచ్చిందా? రాలేదేమో అనిపిస్తుంది నాకు. కార్మికోద్యమానికీ, కాంగ్రెసు ఉద్యమానికీ కలుస్తుందా? లేక రెండూ వేరుగానే వుండిపోతాయా? వేరుగా వుండిపోతే ఎలాగ? రెండూ కలపొద్దా? రైతు ఉద్యమం మాటో? కాంగ్రెసూ, కార్మికవర్గమూ, రైతు వర్గమూ - మూడూ కలుస్తాయా? నాకేమీ తోచడం లేదు... కలుస్తేనే మంచిది - అందుకు సందేహం లేదు. గాంధీగారి నాయకత్వం కిందనా అన్నదే సందేహంగా వుంది నాకు. రేపు పొద్దున్న మళ్ళీ స్వతంత్ర్య యుద్ధం ఏ విధంగా పరిణమిస్తుందో? అప్పుడు వెనక్కి తగ్గకూడదు. నా లక్ష్యం ఎప్పుడూ "సహవీర్యం కరవావహై!" నామటుకు నే నాలోచించుకుని, తరువాత శాస్త్రితో చెపుతాను.

72 అతడు

నా రొట్టె నేతిలో పడ్డట్టే! నేను మద్రాసు క్లబ్బులోకి వెళ్ళేసరికి సర్ మాధోజిన్నీ, సర్ రిచ్చర్డున్నూ నా కెదురుగుండా వచ్చారు. హిందూస్థాను నేషనల్ స్టీల్ కంపెనీకి వీళ్ళిద్దరు పెద్దలు. వీరి కంపెనీకి లండనులో వున్న మిడ్‌లెండు స్టీలు కంపెనీకి లావాదేవీల్లో తగాదాలు వచ్చాయట. వీళ్ళ పుస్తకాల ప్రకారం ఇరవైలక్షలు రావలసి వుందని వీళ్ళంటూన్నారట. మాకే రావాలి - పదిలక్షల చిల్లర వరకూ అని వాళ్ళంటూన్నారట. చివరికి వీళ్ళే దావా వెయ్యడానికి నిశ్చయించారట.

"మొన్న స్వదేశీ ఐరన్స్ కేసులో అవతలవేపు గ్రాండున్నూ, నరసింహయ్యంగారూ వున్నా, అతి చాకచక్యంగా వాదించి వాళ్ళపక్షం గెల్పించారు. మేం అందరం మహా మెచ్చుకున్నాం. మా వక్తాలీకూడా మీరే పుచ్చుకోవాలి సుమండీ! బొంబాయినుంచి బారిష్టరుని మేం పెట్టినా మీకు జూనియర్‌గానేలెండి. మీ ఖర్చులు పోను ఇరవైవేలు ఇస్తాం. మా సొలిసిటర్లు మీ పేర రేపు ఉత్తరం రాస్తారు. మనం ముఖస్థంగా మాట్లాడుకుందాం.!" అన్నారు.

శాంతం వీరి ప్రసంగం వింటే ఎంతో సంతోషిస్తుంది. రేపు అంతా పూసగుచ్చినట్టు చెప్పాలి. ఎడ్వకేట్ జనరలుగిరీ పోతే అట్టే పోయే - ఇల్లాంటి కేసు నా కొచ్చిందంటే ఇక కావలసిందేంవుంది? గెల్చినా - ఓడిపోయినా యీ కేసు తప్పకుండా ప్రీవీకౌన్సిలులో వాదించేటప్పుడు వేసుకోడానికి నల్లవి ఖద్దరుసూట్లు కుట్టించుకోవాలి - శాంతాన్ని సంతోషపెట్టడానికి. జమీందార్ కేసులు, మగనాలికేసులు అంటే శాంతానికి గిట్టపు కాని ఇలాంటి కేసులంటే ఆమెకు సరదావేను....

వీళ్ళిద్దరూ తగినవుజ్జీలు! మార్వాడీకి తగినవాడు స్కాటిషువాడు. ఏదేనా - దొరలతో కలిస్తేనే కాని మనం దేశంలో పరిశ్రమల్ని స్థాపించలేం. అమెరికా వాడితోకంటె బ్రిటిషు వాడితోనే మనకి బాగా కలుస్తుంది. నాకు ఇంగ్లీషువాడన్నా, ఇంగ్లండన్నా అభిమానం - చెప్పొద్దూ! హిందూదేశంలో వున్నంతసేపూ - ఇంగ్లండు ఎప్పుడు వెళదామా అని వుంటుంది. హృదయంలో అంతా ఆంధ్రబ్రాహ్మణ రక్తం - మేధస్సులో అంతా పాశ్చాత్యరక్తమేమో! అంచేత బారిష్టరీచేస్తూ - కాక్ టైల్సు పుచ్చుకున్నా, జంధ్యం వేసుకుని తద్దినాలు పెట్టినా నాకు ఏం వ్యతిరేకం కనిపించడంలేదు. రెండు బాగా సమన్వయం చేశాను.

ఈ సమన్వయం దేశానికే గాదు, వ్యక్తి జీవితంలో కూడా ఒక పెద్ద సమస్యే! భాష - వేషం - ఆశయాలు - ఆలోచనలు - చివరికి భోజనంకూడా మారిపోతుంది. జాతీయత అంటూ ఒకటి రాజకీయంగా రావడంచేత - ఇంగ్లీషువాడికి పోటీగా మనవాళ్ళు హిందూధర్మం, హిందూ సాంప్రదాయం అంటూ వీట్లని ముందుకు నెట్టుకు వస్తున్నారు కాని, మనకి ఎప్పుడు స్వతంత్ర్యం వచ్చి ఇంగ్లీషు వాడిని మనం పంపించేసినవాడు దైనందిన జీవితంలోనేం - వేష భాషల్లోనేం - చివరికి నైతిక జీవనంలో కూడా పూర్తిగా పాశ్చాత్య నాగరికత అవలంబించేస్తాం.

ఉత్త రాజకీయంగా జాతీయత వుంటుంది కాని - సాంఘికంగా - ఇంగ్లీషు అమెరికా దొరల్లాగైపోతాం. ఇంగ్లీషు వాళ్ళంటే నాకంత అభిమానం. - ఇంకా వుంది.

అభ్యసనానికి దోహదం చేసేది ఏది?

1.సామాజిక వికాసం ఏ ప్రక్రియ ద్వారా ప్రారంభమవుతుంది?

- సాంఘికీకరణలు.

2. 'వ్యక్తి తనలో తాను సర్దుబాటు చేసుకుంటూ ఇతరులతో సఖ్యతగా వుండగలిగే సామర్థ్యమే సాంఘిక వికాసం' అని నిర్వచించిన వారెవరు?

- సోరన్‌సన్

3.తొలి సాంఘిక ప్రవర్తనను తెలియజేసిన వారెవరు?

- జెర్ సిల్డ్

4.సాంఘిక ప్రవర్తన పునాదులు పడుతున్న దశ ఏది?

- శైశవదశ

5.వ్యక్తి సాంఘిక వికాసానికి తోడ్పడు మొదటి ప్రాథమిక సంస్థ ఏది?

- గృహము

6.The Psychology of learning and instructions గ్రంథ రచయితలు?

- డిసెకొ, క్రాఫర్డ్

7.డిసెకొ, క్రాఫర్డ్‌ల నిర్వచనం ప్రకారం అభ్యసనం అనేది?

- పునర్బలనం చెందిన ఆచరణ వల్ల ప్రవర్తనారీతిలో ఏర్పడే దాదాపు శాశ్వతమైన మార్పు.

8.అనుభవం, శిక్షణ ద్వారా ప్రవర్తనలో వచ్చే మార్పును అభ్యసనం అని చెప్పినదెవరు?

- గేట్స్

9.'పరిసరాల అవసరాలను తీర్చు కొనుటలో వ్యక్తిలో ఏర్పడే ప్రవర్తనా మార్పులను అభ్యసనం అనవచ్చు' అని నిర్వచించినదెవరు?

- గార్డన్ మర్ఫీ

10.'ప్రగతిపథం వైపునకు ప్రవర్తనా మార్పు ప్రక్రియనే అభ్యసనం అనవచ్చు' అని నిర్వచించినదెవరు?

- స్పిన్నర్

11.'వ్యక్తిలో అభివృద్ధిని చేకూర్చి, ప్రవర్తనలో మార్పు తెచ్చే ప్రక్రియనే అభ్యసనం అనవచ్చు'నని నిర్వచిం చినదెవరు?

- వుడ్‌వర్త్

12.అభ్యసనానికి మూలం ఏమిటి?

- పునర్బలనం చెందిన ఆచరణ

13.అభ్యసనమును ప్రతిబింబించే చర్య?

- నిష్పాదనము

14.నిష్పాదనము ద్వారా గుర్తించడానికి వీలయ్యేది?

- అభ్యసనము

15.సర్దుబాటుకు సంబంధించిన ప్రక్రియ ఏది?

- అభ్యసనము

16.వైఖరులను, అలవాట్లను, కౌశలాలను పెంపొందించేది?

- అభ్యసనము

17.అభ్యసన ప్రక్రియకు అవసరమగు ముఖ్యమైన కారకాలు?

- పరిపక్వత, శిక్షణ, ప్రేరణ

18.అభ్యసనానికి దోహదం చేసేది?

- పరిపక్వత

19.మాటలను ఉచ్ఛరించడం, వాక్యాల రూప కల్పన కొన్ని వాక్యాలు వ్రాయడం వంటి నేర్పును ఏమంటారు?

- శాబ్దిక అభ్యసనము

20.వ్యక్తుల మధ్య, వస్తువుల మధ్య భేదాలను గుర్తించడం ఏ రకపు అభ్యసనం?

- విచక్షణా అభ్యసనము

21.వైఖరిలో వచ్చే మార్పులను బట్టి నేర్చు కొనుట?

- వైఖరి అభ్యసనము

22.సామాన్యగుణాలున్న విషయాలు, సమూహాల మధ్య మనసులో ఏర్పరచుకొను సాధారణ భావాలు ఏ రకపు అభ్యసనం?

- భావనాత్మక అభ్యసనం

23.అక్షరాలను టైపు చేయడంలో ఇమిడివున్న అభ్యసన రకము?

- చలన అభ్యసనం, శాబ్దిక అభ్యసనం

24.సమస్య పరిష్కారంలో వ్యక్తి అల వరచుకొను ఆలోచన, వివేచన, పరిశీలన, ముగింపు తదితర సామర్థ్యాలను ఏ అభ్యసన అంటారు?

- సమస్య పరిష్కార అభ్యసనం

25.నడవటం, ఈదటం, వ్రాయడం ఏ రకాల అభ్యసనం?

- చలన అభ్యసనం.

సోషల్ స్టడీస్: కంటెంట్

1.ఐరోపా ఏఏ అక్షాంశాల మధ్య వుంది?

- 350-720 ఉత్తర అక్షాంశాలకు 100 పశ్చిమ రేఖాంశం నుండి 600 తూర్పు రేఖాంశం మధ్య వుంది.


2.యూరప్‌కు తూర్పున వున్న పర్వతా లేవి?

- యూరల్ పర్వతాలు

3.ఐరోపా నుండి ఆసియాను వేరు చేస్తున్న పర్వతాలు ఏవి? **- కాకసస్ పర్వతాలు**

4.ఐరోపాఖండం ఏ శీతోష్ణమండలంలో వుంది?

- సమశీతోష్ణమండలం



5.ఐరోపాలో అత్యధికంగా లభించే ఖనిజం ఏది?

- ఇనుపధాతువు

6. రుమేనియా, రష్యాలోని కాకసస్ ప్రాంతాలు దీనికి ప్రసిద్ధి చెందాయి?

- పెట్రోలియం

7.18వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవాన్ని చవిచూసిన మొట్టమొదటి దేశం ఏది?

- యునైటెడ్ కింగ్‌డమ్

8.ఐరోపాలోనే అతి పెద్ద ఇనుము-ఉక్కు కేంద్రం ఏది?

- పశ్చిమజర్మనీలోని రూరల్‌లోయ బొగ్గు క్షేత్రం

9.ఫ్రాన్స్‌లోని బర్గండీ, షాంపేన్ ప్రాంతాలు దేనికి ప్రసిద్ధి?

- ద్రాక్షా సారాయి

10.ఐరోపాలో అత్యధికంగా రవాణా జరుగుతున్న జలమార్గం ఏది?

- రైనునదీ మార్గం

11.జర్మనీలోని బాల్టన్ దీవులను, ఉత్తర సముద్ర దీవులతో కలపడానికి డెన్మార్క్ మీదుగా తవ్విన కాలువ ఏది?

-కీల్ కాలువ

12.అత్యధిక జనసాంద్రత గల ఖండం ఏది? **- ఐరోపా**

13.ఐరోపాలో అతి పెద్ద నగరం ఏది?

- లండన్

14. ఏ తిరుగుబాటు ఫలితంగా రష్యాలో జార్ చక్రవర్తి ఆధిపత్యం తొలగిపోయి సోషలిస్టు దేశంగా అవతరించింది?

- బోల్షెవిక్ తిరుగుబాటు

15.రష్యా, చైనాల మధ్య సరిహద్దు రేఖగా వున్న నది ఏది?

- అమూర్ నది

16.ప్రపంచంలో అతి లోతైన సరస్సు ఏది?

- బైకాల్ సరస్సు

17.స్లెడ్జ్ బండ్లను లాగుటకు, మాంసం కొరకు ధృవపు జింకలను పెంచే జాతులు?

- లాపులు, సమోయోడీలు

18.ఆర్కిటిక్ సముద్రతీరం వెంబడి ఏ రకం శీతోష్ణస్థితి వుంది?

- టండ్రా రకపు శీతోష్ణస్థితి

19.భూమి యొక్క శీతల ధృవము (Cold pole of the earth) గా పిలిచే ప్రాంతం?

- ఈశాన్య సైబీరియాలోని వెర్‌కోయాన్స్క్

20.లెనిన్‌గ్రాడ్ ప్రస్తుత పేరేమిటి?

- సెయింట్ పీటర్స్ బర్గ్

21.యుక్రేన్ రాజధాని నగరం?

- కైర్

22.ప్రపంచంలో అత్యంత పొడవైన ట్రాన్స్-సైబీరియా రైలుమార్గం ఎక్కడ వుంది?

- లెనిన్‌గ్రాడ్ నుండి దక్షిణ సైబీరియా మీదుగా వ్లాడివోస్టాక్ వరకు

23.ప్రపంచంలో మూడవ పెద్ద ఖండం ఏది?

- ఉత్తర అమెరికా

24. ఉత్తర అమెరికా, ఆసియా ఖండాలను వేరు చేయు జలసంధి?

- బేరింగ్ జలసంధి

25.అమెరికా అనే పేరు ఎలా వచ్చింది?

- ఇటలీ దేశపు అన్వేషకుడు అమెరిగోవెస్ పుక్కి పేరిట

26.ఉత్తర అమెరికా ఖండానికి దక్షిణంగా పోవు రేఖ ఏది?

- కర్కటరేఖ

27.ఉత్తర అమెరికా నదులకు జన్మస్థానం ఏది?

- పశ్చిమ కార్డిలిరాస్

28.ఉత్తర అమెరికాలో ఎత్తైన శిఖరం ఏది?

- అలాస్కాలోని మెకిన్‌లీ శిఖరం

29.ప్రపంచంలోనే అతి పెద్ద మంచినీటి సరస్సు ఏది?

- సుపీరియర్ సరస్సు

30.ఇరీ, ఒన్‌టారియో సరస్సుల మధ్యగల ప్రపంచ ప్రసిద్ధ జలపాతం ఏది? **- నయాగరా జలపాతం**

31.అగాధదరి అంటే ....

- లోతైన గోడల వలె నిటారుగా నున్న పార్శ్వములుగల ఇరుకైన నదీలోయ

32.ఉత్తర అమెరికాలోని అగాధదరి ఎక్కడ వుంది?



- కొలరాడోలో వుంది

33.ఉత్తర అమెరికాలోని విశాలమైన పచ్చిక భూములు?

- ప్రెయిరీలు

34.మధ్య అమెరికా, మెక్సికోల్లోని ఉష్ణమండలారణ్యాలలో వుండే సర్వసాధారణ చెట్లు ఏవి?

- మహోగని, తాడిజాతిచెట్లు

35.ప్రపంచంలోని జొన్న ఉత్పత్తిలో సగానికి పైగా ఏ ఖండంలో పండు తుంది?

- ఉత్తర అమెరికా.

36.జొన్న పంటకు ప్రసిద్ధి చెందిన దేశం?

- మెక్సికో

37.ప్రధాన పొగాకు ఉత్పత్తి కేంద్రం ఏది?

- అమెరికా

38. గోధుమ పంటకు ప్రసిద్ధి చెందినవి?

అమెరికా, కెనడా

39.మాంసం ఉత్పత్తిలో అగ్రస్థానంలో వున్న ఖండం ఏది? **- ఉత్తర అమెరికా**

40.మిసిసిపి హరివాణంలో ప్రధాన పంట?

- ప్రత్తి

తెలుగు

1.గాథాసప్తశతిని రచించినదెవరు?

- హాలుడు

2.కవికోకిల బిరుదాంకితుడు ఎవరు?

- దువ్వూరి రామిరెడ్డి

3.చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా గీత రచయిత?

- వేములపల్లి శ్రీకృష్ణ

4.'నాదు కవిత్వంబు కర్ణాటభాష' అన్నదెవరు?

- శ్రీనాథుడు

5.కేతన రచించిన ఛందోగ్రంథం ఏది?

- కవిజనాశ్రయం

6.కిన్నెరసాని పాటల రచయిత ఎవరు?

- విశ్వనాథ సత్యనారాయణ

7.తెలుగుసాహిత్య విమర్శలో ఆధునిక ధోరణులు ప్రవేశపెట్టినది?

- కట్టమంచి రామలింగారెడ్డి

8.సుగ్రీవ విజయం ఏ సాహిత్య ప్రక్రియకు చెందినది?

- యక్షగానం

9.మునలమ్మ మరణం రచయిత ఎవరు?

- కట్టమంచి రామలింగారెడ్డి

10.ప్రహసనమందలి రసం ఏది?

- హాస్యం

11.తొలి తెలుగు పదం ఏది?

- నాగబు

12.కావ్యాలంకార చూడామణి కర్త ఎవరు?

- విన్నకోట పెద్దన

13.పదకవితాపితామహుడు ఎవరు?

- తాళ్ళపాక అన్నమాచార్యులు

14.రాజతరంగిణి రచించిన సంస్కృత కవి?

- కల్హణుడు

15.కథాసరిత్సాగరం రచించి నదెవరు?

- సోమదేవసూరి

16.కుమార సంభవం, రఘువంశం కావ్యాలు రచించినదెవరు?

- కాళిదాసు

17.కిరాతార్జునీయము కావ్యకర్త?

- భారవి

18.దేశపరంగా ఆంధ్రుల ప్రస్తావన వున్న మొదటి గ్రంథం ఏది?

- ఋగ్వేదంలోని ఐతరేయ బ్రాహ్మణం

19. మొట్టమొదటిగా ఆంధ్రుల ప్రసక్తిగల శిలాశాసనం ఏది?

-అశోకుని 13వ శిలాశాసనం

20.ఆంధ్ర, తెలుగుశబ్దాలలో ఏది ప్రాచీనం?

- ఆంధ్ర శబ్దం

21.మొట్టమొదటి తెలుగు పద్య శాసనం ఏది?

- పండరరంగని అద్దంకి శాసనం క్రీ.శ. 848

22.శాతవాహనుల అధికారభాష ఏది?

- ప్రాకృతం

23.భాషాపరంగా 'తెనుగు' శబ్దాన్ని మొదటగా వాడినదెవరు?

- నన్నయ-మహాభారతం

24.ఆంధ్రభాషను పేర్కొన్న తొలి గ్రంథం ఏది?

- భరతుని నాట్యశాస్త్రం

25.'నాగబు' పదాన్ని కనుగొన్నదెవరు?

-వేటూరి ప్రభాకరశాస్త్రి

26.నన్నయ బిరుదులు ఏవి?

-వాగమశాసనుడు, ఆదికవి

27.నన్నయకు భారత రచనలో సహాయపడిన పండితుడెవరు?

- నారాయణభట్టు

28.'అక్షర రమ్యత' అను కవితాగుణం ఎవరి రచనలలో వుంది?

- నన్నయ

29.ఆంధ్రశబ్ద చింతామణి గ్రంథకర్త?

- నన్నయ

30.నన్నయ ఎవరి ఆస్థానకవి?

- రాజరాజనరేంద్రుని

కెనరా బ్యాంక్‌లో450 పీవో పోస్టులు

కెనరా బ్యాంక్ 450 ప్రొబేషనరీ ఆఫీసర్(పీవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్-బెంగళూరు లేదా ఎన్ఐటీటీఈ ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్-మంగుళూరుల్లో ఏదో ఒకచోట ఏడాదిపాటు పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు చదవాల్సి ఉంటుంది. అనంతరం పీవో లేదా అసిస్టెంట్ మేనేజర్ హోదాతో కెనరా బ్యాంక్‌లో ఉద్యోగం కల్పిస్తారు.

మొత్తం ఖాళీలు : 450 (అన్ రిజర్వ్‌డ్-227, ఓబీసీ-121, ఎస్సీ-67, ఎస్టీ-35)

అర్హత: 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 55శాతం)

వయోపరిమితి : జనవరి1, 2018 నాటికి కనిష్టంగా 20, గరిష్టంగా 30 ఏళ్ళు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : ఆన్‌లైన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా

ఆన్‌లైన్ పరీక్ష విధానం : రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నల చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ఐబీపీఎస్ నిర్వహించే ఈ పరీక్షల్లో సెక్షనల్‌వారీ కటాఫ్‌లు, నెగిటివ్ మార్కులు(ప్రతి తప్పుకు 1/4 నెగిటివ్ మార్కులు) ఉంటాయి. పరీక్ష వ్యవధి 2 గంటలు.ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జీడీ, పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఉన్న ఖాళీలకు మూడు రెట్లు అధికంగా అభ్యర్థులను జీడీ, ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. జీడీ (50), ఇంటర్వ్యూ(50)లు రెండూ 100 మార్కులకు ఉంటాయి. ఆన్‌లైన్ పరీక్ష, జీడీ, ఇంటర్వ్యూల వెయిటేజీ 50:20:30 గా ఉంటుంది.

ప్రిపరేషన్ విధానం..

రీజనింగ్ : నాన్-మ్యాథ్స్ అభ్యర్థులు సైతం సులభంగా చేయొచ్చు. కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సిలాజిజమ్, పజిల్ టెస్ట్, ఇన్‌పుట్-అవుట్‌పుట్, డేటా సఫిషియన్సీ, స్టేట్‌మెంట్-అజమ్షన్స్, ఆర్గుమెంట్స్, కోర్సెస్ ఆఫ్ యాక్షన్, ఇన్‌ఫరెన్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్ : ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ టెస్ట్‌లు రెండింటిలోనూ ఈ విభాగం ఉంది. రీడింగ్ కాంప్రహెన్షన్, ఫైండింగ్ ఎర్రర్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, సెంటెన్స్ కంప్లీషన్స్, రీ అరేంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్, క్లోజ్‌టెస్ట్, సినానిమ్స్, యాంట నిమ్స్ నుంచి ఆబ్జెక్టివ్ ప్రశ్నలుంటాయి. ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్‌పై డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. డిస్క్రిప్టివ్ టెస్ట్ గట్టెక్కాలంటే.. రైటింగ్ స్కిల్స్‌పై పట్టుండాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ : ఈ విభాగంలో సింప్లిఫికేషన్స్, నంబర్ సిరీస్, డేటా సఫిషియన్సీ, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, అర్థమెటిక్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి ప్రశ్నలుంటాయి. అర్థమెటిక్‌లో రేషియో, పర్సంటేజీ, టైమ్-వర్క్, పర్ముటేషన్స్, ప్రాబబిలిటీ తదితర అంశాలు ముఖ్యమైనవి. డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 20-25 ప్రశ్నలుంటాయి. కాలిక్యులేషన్స్ వేగంగా చేయగలిగితే సులభంగా విజయం సాధించవచ్చు.

జనరల్ అవేర్‌నెస్ : బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ, ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వ పథ కాలు, స్టాక్‌మార్కెట్, వ్యక్తులు, పుస్తకాలు, రచయితలు, అవార్డులు, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లోని వర్తమాన అంశాలకు చెందిన ప్రశ్న లుంటాయి.

పీజీడీబీఎఫ్ కోర్సు : ఆన్‌లైన్ పరీక్ష, జీడీ, ఇంటర్వ్యూల్లో అర్హత సాధించిన అభ్యర్థులు మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్-బెంగళూరు లేదా ఎన్ఐటీటీఈ ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్-మంగుళూరుల్లో ఏదో ఒకచోట ఏడాది పాటు పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు చదవాల్సి ఉంటుంది. మణిపాల్‌ను ఎంచుకున్న అభ్యర్థులు వసతి, భోజనం, కోర్సు, ఇతర అన్నీ రకాల ఫీజులు కలుపుకుని రూ. 413 లక్షలు, ఎన్ఐటీటీఈను ఎంచుకున్న వారు రూ.3.54 లక్షలు చెల్లించాలి. ఈ మొత్తాన్ని తక్కువ వడ్డీతో లోన్ సదుపాయం కల్పిస్తారు. ఉద్యోగంలో చేరిన తర్వాత సులభ పద్ధతిలో వాయిదాల ద్వారా చెల్లించవచ్చు. ఈ ఏడాది శిక్షణలో 9 నెలలు క్లాస్‌రూం టీచింగ్, చివరి మూడు నెలలు ఏదైనా కెనరా బ్యాంక్ శాఖలో ఇంటర్న్‌షిప్ చేయాలి. విజయవంతంగా కోర్సు పూర్తిచేసిన తర్వాత ఐదేళ్లపాటు ఉద్యోగంలో కొనసాగుతామని ఒప్పంద పత్రం సమర్పించాలి. మధ్యలో వైదొలిగితే లోన్ తీసుకున్న ఫీజుతో పాటు అదనంగా రూ.లక్ష చెల్లించాలి. విధుల్లో చేరిన తర్వాత రూ.23,700 బేసిక్ శాలరీతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర అలవెన్సులు కూడా లభిస్తాయి. రెండేళ్ల ప్రొబేషన్ పూర్తయిన తర్వాత శాశ్వత ఉద్యోగులుగా పరిగణిస్తారు. ఐదేళ్ల సర్వీసును పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఏడాదికి కొంత మొత్తం చొప్పున పదేళ్ల సర్వీసు పూర్తయ్యే లోపు కోర్సు ప్రారంభంలో చెల్లించిన ఫీజును తిరిగి ఇచ్చేస్తారు.

దరఖాస్తుకు ప్రారంభ తేదీ : జనవరి 9, 2018

దరఖాస్తుల చివరి తేదీ : జనవరి 31, 2018

దరఖాస్తు ఫీజు : ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.118, మిగిలిన అందరికీ రూ.708 (జీఎస్టీతో కలిపి)

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో, **పరీక్ష తేదీ :** మార్చి 4, 2018

కాల్ లెటర్లు : ఫిబ్రవరి 20 తర్వాత డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

పరీక్ష కేంద్రాలు : ఏపీ-చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.

వెబ్‌సైట్: www.canarabank.com

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-111.20 ▼	-16.35 ▼	390 ▲	29,260	1,200 ▲	42,200	63.54
36,050.44	11,069.00	29,260	ప్రొద్దుటూరు 28,900	42,200	ప్రొద్దుటూరు 41,000	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఐసీఐసీఐ బ్యాంక్	362.70	1.60
కోల్ ఇండియా	302.70	1.56
కొటాక్ మహీంద్ర	1,097.00	0.99
ఏక్సిస్ బ్యాంక్	617.00	0.96
లార్సెన్	1,425.00	0.90

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్‌బీఐ	334.80	-4.96
అదానీ పోర్ట్స్	450.00	-2.37
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్	2,594.95	-2.26
హీరో మోటోకార్ప్	3,656.20	-1.95
టీసీఎస్	3,181.00	-1.79

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.84	63.54
యూరో	78.04	79.08
పౌండ్	88.50	90.54
ఆస్ట్రేలియా డాలర్	51.01	51.36
సింగపూర్ డాలర్	48.34	48.62

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,220	31,251
చెన్నై	29,220	31,251
బెంగళూరు	28,750	30,749
ముంబై	29,950	32,032
విజయవాడ	29,260	31,920
విశాఖపట్నం	29,260	31,920
ప్రొద్దుటూరు	28,900	31,200
ముడి చమురు		70.42

జైట్లీజీ... పన్నుల భారాన్ని తగ్గించండి

- చమురు, గ్యాస్ పరిశ్రమ విజ్ఞప్తి
- దేశీయ ఉత్పత్తికి ఊతమివ్వాలని సూచన
- మౌలిక రంగ హోదా కల్పించాలని డిమాండ్



న్యూఢిల్లీ: రాబోయే బడ్జెట్‌లో పన్నులను తగ్గించాలని చమురు, గ్యాస్ పరిశ్రమ కోరుతోంది. దిగుమతులపై ఆధారపడకుండా దేశీయ ఉత్పత్తికి ఊతమిచ్చేలా ప్రోత్సాహకాలుండాల్సిన అవసరం ఎంతో ఉందంటున్నది. ప్రస్తుతం దేశ ఇంధన అవసరాల్లో 80 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో దేశీ యంగా ఉత్పత్తి అవుతున్న చమురుపై పన్నులను తగ్గిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు రికార్డు స్థాయికి చేరిన నేపథ్యంలో ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించాలని ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీని చమురు శాఖ కోరిన సంగతి తెలిసిందే. కాగా, 20 శాతంగా ఉన్న సెస్సును 8 శాతానికి తగ్గించాలని, దేశీయంగా ఇంధన భద్రత పెంపు నకు వీలుగా స్థానిక ఉత్పత్తిపై 2 శాతం కేంద్ర అమ్మకాల పన్నును తగ్గించాలన్న డిమాండ్లూ వస్తున్నాయి. ముఖ్యంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లోకి సహజ వాయువును తీసుకు రావాలంటున్న పరిశ్రమ.. దీనివల్ల ధరలు తగ్గుతాయంటు న్నది. దేశవ్యాప్తంగా గతేడాది జూలై 1 నుంచి అమల్లోకి వచ్చి న జీఎస్టీలో ముడి చమురు, సహజ వాయువు, పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనాన్ని చేర్చని విషయం తెలిసిందే. కాగా, రాయల్టీ, కాస్ట్ రికవరీ, క్యాష్ కాల్, ప్రాఫిట్ పెట్రోలియంలలో జీఎస్టీపై స్పష్టత ఇవ్వాలంటున్నాయి. ఇక చమురు, గ్యాస్ రంగానికి మౌలిక పరిశ్రమ హోదా ఇవ్వాలనీ డిమాండ్ చేస్తున్న పరిశ్రమ.. ఇది సాకారమైతే దేశీయంగా చమురు, గ్యాస్ ఉత్పత్తి పెరుగుతుందని, దిగుమతులు తగ్గిపోతాయని చెబుతున్నది. 2022 నాటికి దేశంలోకి విదేశీ చమురు దిగుమ తులను 10 శాతానికి తగ్గించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యాన్ని పరిశ్రమ వర్గాలు జైట్లీకి గుర్తుచేస్తున్నాయి. ఈ లక్ష్యం లో భాగంగానే విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగాన్ని కేంద్రం ప్రోత్సహిస్తున్నది తెలిసిందే.

కార్పొరేట్ పన్నుపై కోత వేయాల్సిందే : వచ్చే బడ్జెట్‌లో కార్పొ రేట్ పన్నును తగ్గించాలని, వివిధ రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)పై ఉన్న ఆంక్షలను తొలిగించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీని బ్రిటన్, ఇండియా వ్యాపార మండలి (యూకేఐబీసీ), బ్రిటీష్ పరిశ్రమల సమాఖ్య (సీబీఐ) కోరాయి. భారత్‌లో బ్రిటన్ పెట్టుబడులను ప్రోత్సహించేలా సరళతరమైన, ఆమోదయోగ్యమైన పన్ను విధానాలు రావాలన్నాయి. అలాగే కార్మిక సంస్కరణలను ప్రవేశపెట్టాలని కూడా సూచించాయి. దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని యూకేఐబీసీ సీవోవో కెవిన్ మెక్‌కోలే పీటీఐతో అన్నారు.

> అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 70 డాలర్లను దాటింది. భారత్ ఇంధన అవ సరాలు 80 శాతం దిగుమతులపైనే ఆధారపడ్డ నేపథ్యంలో ద్రవ్యలోటు లక్ష్యం రాబోయే బడ్జెట్‌లో ఓ సవాలే. 2018కిగాను చమురు దిగుమతుల బిల్లు రూ.5 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. ధరలు పెరిగితే ఇది మరింత పెరుగడం ఖాయం
> - సుధీర్ మాథూర్, వేదాంత కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ సీఈవో

> దేశంలో చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి కార్యకలాపాలకు ఊతమిచ్చేలా ఎక్స్‌ప్లోరేషన్ అండ్ ప్రొడ క్షన్ (ఈఅండ్‌పీ) రంగానికి మౌలిక హోదాను కల్పించా లన్న డిమాండ్ ఇప్పటిది కాదు. ఎప్పట్నుంచో ఉన్నందున ఈసారైనా దీన్ని పరిశీలించాలి. జీఎస్టీలోకి సహజ వాయువును తెస్తే లాభదాయకంగా ఉంటుంది
> -ప్రశాంత్ మోదీ, జీఈఈసీఎల్ ఎండీ, సీఈవో

'రక్షకులనే రక్షిస్తున్నారు..'

భారత ఆర్మీ వైద్యులకు ఘన నివాళి



న్యూఢిల్లీ: వైద్యో నారాయణో హరి అంటారు. అంటే ప్రాణం పోసే వైద్యుడు దేవుడితో సమా నమని. సరిహద్దులో మన కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్న జవాన్ల ప్రాణా లను కాపాడేది కూడా ఈ దేవుళ్లే. వారే భారత ఆర్మీ వైద్యులు. జవాన్లు ఎక్కడున్నా వారి వెంటే ఉంటూ ఆపద సమయంలో వారికి ప్రాణం పోస్తారు. అలాంటి తెరవెనుక హీరోలకు సెల్యూట్ అంటోంది ప్రముఖ హెల్త్‌కేర్ కంపెనీ 1ఎంజీ. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ఆర్మీ వైద్యులకు శుభాకాంక్షలు చెబుతూ ఓ వీడియోను రూపొందించింది. సరిహద్దుల్లో జవాన్లతో కలిసి పనిచేస్తుంటారు ఈ వైద్యులు. అయితే వారి గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా వారిని గుర్తు చేసుకుంటూ 1ఎంజీ ఓ వీడియో రూపొందించింది. 'దేశాన్ని కాపాడుతున్న జవాన్లను రక్షించే వైద్యులకు నివాళి' అంటూ ఈ వీడియోను తయారు చేసింది. 'కొండలైనా, పర్వతాలైనా, ఎండైనా, చలైనా.. వారి పెదాల మీద చిరునవ్వు చెరగదు. గుండె నిండుగా ధైర్యం నింపుకుని కర్తవ్యాన్ని నిర్వర్తిస్తారు. శత్రువులకు ఎదురొడ్డి పోరాడుతారు. బుల్లెట్ గుండెల్లోకి దూసుకెళ్లినా.. శత్రువులు చేసిన గాయం శరీరాన్ని చీల్చుతున్నా.. నెత్తురు ఏరులై పారుతున్నా వెనుకడుగు వేయరు. ఆ జవాన్లు కొన్ని సార్లు ప్రాణాపాయాలకు గురవుతారు. వారి ప్రాణం పోసేందుకు మేం అహర్నిశలు శ్రమిస్తాం. కొన్నిసార్లు మా ప్రయత్నం ఫలించకపోవచ్చు. వారు ఈ లోకంలో లేకపోయినా ఆ వీరులు మా కళ్లముందే కనబడుతుంటారు. మేం భారత ఆర్మీ వైద్యులం.. ఎల్లప్పుడూ జవాన్ల వెంటే ఉంటాం' అనేది ఆ వీడియో సారాంశం. 'మన జవాన్ల కోసం నిరంతరం పనిచేసే వైద్యుల సేవలను గుర్తించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది' అని 1ఎంజీ ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. 3 నిమిషాలకు పైగా ఉన్న ఈ వీడియోను జనవరి 22న సోషల్‌మీడియాలో పోస్టు చేయగా.. ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇప్పటివరకు 9లక్షల మందికి పైగా ఈ వీడియోను చూశారు. ఆర్మీ డాక్టర్లకు సెల్యూట్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.

రూ.49కే అపరిమిత కాల్స్

1జీబీ డేటా సైతం : జియో మరో సంచలనం

ఢిల్లీ: డేటా తక్కువ వినియోగిస్తూ, కాల్స్‌పై అధికంగా ఆధారపడే వారికి రిలయన్స్ జియో భారీ ఆఫర్ ప్రకటించింది. తమ 4జీ ఫీచర్‌ఫోన్ జియోఫోన్ వినియోగదార్లు రూ.49తో రీఛార్జి చేసుకుంటే, 28 రోజుల పాటు ఏ నెట్‌వర్క్‌కు అయినా అపరిమిత కాల్స్, 1 జీబీ డేటా లభించే పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ రోజు (గణతంత్ర దినోత్సవం) నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుంది. ఇప్పటికే జియో ఫోన్ వినియోగిస్తున్న వారితో పాటు కొత్తగా రూ.1,500తో ఈ ఫోన్ కొనుగోలు చేసుకున్న వారికీ ఈ ఆఫర్ వర్తిస్తుంది.

ఇది ఒక్క నెలకే పరిమితం కాదని, మూడేళ్ల పాటు ఈ పథకం అమలవుతుందని సంస్థ ప్రతినిధి వెల్లడించారు. అదనపు డేటా కావాలనుకుంటే రూ.11, 21, 51, 101తో రీఛార్జి చేసుకోవాలని తెలిపింది. ఇతర ఫోన్ల వినియోగదార్లు రూ.98తో రీఛార్జి చేసుకుంటే, 28 రోజులకు అపరిమిత కాల్స్, 2 జీబీ డేటా లభించే పథకం కూడా నేటినుంచే అందుబాటులోకి వస్తోంది. రోజూ 1 జీబీ, 1.5 జీబీ డేటా లభించే పథకాలకు అదనంగా రోజూ 500 ఎంబీ డేటా ఇచ్చే పథకాలనూ సంస్థ ఇప్పటికే ప్రకటించిన సంగతి విదితమే.



2016 చట్టాన్ని అమలు చేయాల్సిందే

దివ్యాంగుల హక్కుల చట్టంపై రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : దివ్యాంగులకు సంబంధించిన 2016 చట్టాన్ని మూడు నెలల్లోగా అమలు చేసి తీరాల్సిందేనని సుప్రీంకోర్టు గురువారం కేంద్రం, అన్ని రాష్ట్రప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. దివ్యాంగుల హక్కుల కోసం తీసుకొచ్చిన చట్టానికి అనుగుణంగా నివేదికలు సమర్పించాలని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ స్పష్టంచేశారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రత్యేకచట్టం తీసుకొచ్చింది. 2016 చట్టాన్ని అమలు చేసేలా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ జస్టిస్ సునంద భండారే ఫౌండేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఫౌండేషన్ తరపున సీనియర్ న్యాయవాది మనాలీ సింఘాల్ వాదించారు. దివ్యాంగులకు సంబంధించి 1995 చట్టం ప్రకారమే ఉత్తరప్రదేశ్, కర్నాటక, హర్యానా, ఉత్తరాఖండ్, లక్షదీవ్‌లు అఫిడవిట్ దాఖలు చేశాయని, 2016 చట్టాన్ని పట్టించుకోవడం లేదని న్యాయవాది సింఘాల్ పేర్కొన్నారు. 1995 చట్టానికి అనేక సవరణలు తీసుకొస్తూ 2016లో కేంద్రం కొత్త చట్టం ఆమోదించింది. కొత్త నిబంధనలకు అనుగుణంగానే చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీం ఆదేశించింది. 1995 చట్టంతో పోలిస్తే 2016 చట్టంలో కొత్త నిబంధనలు, మార్గదర్శకాలు ఉన్నాయని సింఘాల్ వివరించారు. దివ్యాంగుల హక్కులపై కొత్త చట్టాన్నే అమలు చేయాలని గతేడాది కూడా రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

అంత్రా ఎక్స్‌పోకు ఆదరణ



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: హస్తకళలు, చేనేత వస్త్రాలు ఒకేవేదికపై కొలువు దీరాయి. ఆసియన్ ఎక్స్‌పో విశేషంగా అలరిస్తోంది. టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అంత్ర ఎక్స్‌పోకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నెల 28వ తేదీ వరకు ఇది కొనసాగుతుంది. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది. పోచంపల్లి, బెడ్‌షీట్స్, డ్రెస్ మెటీరియల్స్, షారీస్, కలంకారి, మంగళగిరి చీరలు, వరంగల్ టవల్స్, ఎంబ్రా యిడరీ చీరలు, గద్వాల్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, జైపూర్ బెడ్ షీట్స్, మధ్యప్రదేశ్ మహేశ్వరి కాటన్ చీరలు, మీరట్ ఖాదీ, బెంగాలి ఖాదీ, లక్నో చికన్ వర్క్స్, చిన్నారుల డ్రెస్ మెటీరియల్స్, చెబ్రోలు ఖాదీ వస్త్రాల అమ్మకాలుగా ఎక్కువగా సాగుతున్నాయి. కొండపల్లి బొమ్మలు, ఎటికొప్పాక బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, ఆయుర్వేద ఔషధాలు, హైదరాబాద్ బంజార ఉత్పత్తులు, లెదర్‌బాగ్స్, మైసూర్ రోజ్ ఫుడ్స్, కళాత్మక ఆభరణాలు, గృహోపకరమైన వస్తువులు లభిస్తున్నాయి. నిర్వాహకులు ఇంద్రపాల్, ఇమ్రాన్, సమీర్ మాట్లాడుతూ వివిధ రకాల వస్త్రాలపై రాయితీలు ఇస్తున్నామని, ఎక్స్‌పోకు అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు.

4కాదు,6వ వరుసలో రాహుల్‌కు సీటు..

కాంగ్రెస్ గరం గరం..



న్యూఢిల్లీ : కాంగ్రెస్‌కు మరో అవమానం జరిగింది. ఢిల్లీ రాజ్‌పథ్‌లో 69వ రిపబ్లిక్‌డేకి హాజరైన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి 6వ వరుసలో సీటు కేటాయించడంపై ఆపార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కేంద్ర మంత్రులకు సీనియర్ మంత్రుల వెనుక సీట్లు కెటాయించారని, స్వాతంత్ర్యం వచ్చాక ఎప్పుడూ ఇలాంటి సంఘటన జరగలేదని కాంగ్రెస్ వర్గీయుల చెబుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ విపక్ష నాయకుడు గులాంనబీ ఆజాద్ కూడా అదే వరుసలో కూర్చున్నారు. ఎల్‌కే అద్వానీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాలు ముందు వరుసలో కూర్చున్నారు. ముందు నాల్గో వరుసలో ఆపై ఆరోవరుసకు సీట్లు మార్చారని కాంగ్రెస్ నాయకుడు రణదీప్ సుర్జేవాలే ఫొటోను పోస్టు చేస్తూ కేంద్రం అనవసర రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. దీంతో అన్ని సంప్రదాయ వేడుకలను రద్దు చేసుకున్నామని, తమకు రిపబ్లిక్ డేనే అత్యంత ప్రాధాన్యతాంశం అని ట్వీట్ చేశారు. సోనియాగాంధీ 19 ఏళ్లు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొనసాగినంతకాలం ఆమె ప్రథమ వరుసలోనే కూర్చుండే వారు.

ఐడియాకు భారీగా పెరిగిన నష్టం

అక్టోబరు- డిసెంబరులో రూ.1284 కోట్లు

ఢిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో ఐడియా రూ.1,284.50 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. కిందటేడాది ఇదే సమయంలో రూ.383.90 కోట్ల నష్టాన్ని చవిచూసింది. కార్యకలాపాల ఆదాయం 25 శాతం తగ్గి రూ.8,662.7 కోట్ల నుంచి రూ.6,509.60 కోట్లకు పరిమితమైంది. 'అనుసంధానిత వినియోగ ఛార్జీల (ఐయూసీ) సెటిల్‌మెంట్ రేట్లలో 57 శాతం కోత విధించడం వల్ల మా రెవెన్యూ, ఎబిటాలపై రూ.820 కోట్లు, రూ.230 కోట్లు చొప్పున ప్రతికూల ప్రభావం పడింద'ని ఐడియా ఒక ప్రకటనలో తెలిపింది. ఐయూసీ ఛార్జీల తగ్గింపుతో పరిశ్రమపై తీవ్ర ఒత్తిడి నెలకొందని పేర్కొంది. అందువల్ల ఏడాదిక్రితం త్రైమాసిక ఫలితాలతో తాజా ఫలితాలను పోల్చిచూడొద్దని పేర్కొంది. కంపెనీ ఎబిటా కూడా 18.5 శాతం క్షీణించి రూ.1,223.30 కోట్లకు పరిమితమైంది. 2017 డిసెంబరు 31 నాటికి నికర రుణం రూ.55,781.80 కోట్లుగా నమోదైంది. స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేసేందుకు తీసుకున్న రుణం కూడా ఇందులో కలిపి ఉంది. అక్టోబరు- డిసెంబరులో వాయిస్ సేవల విభాగంలో వినియోగదారు సగటు వినియోగం 509 నిమిషాలకు పెరిగిందని ఐడియా తెలిపింది. డేటా విభాగంలో సగటు వినియోగం కూడా పెరిగి 703 ఎంబీ నుంచి 4,742 ఎంబీకి చేరిందని పేర్కొంది. తన ప్రధాన విపణుల్లో 2018 మార్చి నుంచి సొంత 'వాయిస్ ఓవర్ ఎల్‌టీఈ'ని (వీఓఎల్‌టీఈ) అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. ప్రస్తుత త్రైమాసికానికి రూ.1,750 కోట్లను వెచ్చించాలని తన మూలధన వ్యయ ప్రణాళికలో ఐడియా నిర్దేశించుకుంది.

రూ.6,750 కోట్ల సమీకరణ

వొడాఫోన్- ఐడియా విలీనం అనంతరం ఏర్పడే సంస్థ బ్యాలెన్స్ షీటును బలోపేతం చేసేందుకు రూ.6,750 కోట్ల మూలధనాన్ని సమీకరించే పనిలోఉన్నామని ఐడియా తెలిపింది. ఇందులో రూ.3,250 కోట్ల సమీకరణ నిమిత్తం ప్రమోటర్ గ్రూపు సంస్థలకు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో 32.66 కోట్ల షేర్ల జారీకి బోర్డు ఇప్పటికే అనుమతినిచ్చిందని తెలిపింది. మరో రూ.3,500 కోట్ల సమీకరణ కోసం వివిధ మార్గాలను అన్వేషించేందుకు కమిటీని బోర్డు ఏర్పాటు చేసిందని పేర్కొంది.

ఈ నిధుల సమీకరణతో నికర రుణం తగ్గుతుందని తెలిపింది. విలీన అనంతరం ఏర్పడే కొత్త సంస్థకు వొడాఫోన్ నుంచి సంక్రమించే నికర రుణం కూడా కొంత మేర తగ్గుతుందని పేర్కొంది. ఐడియా, వొడాఫోన్ ఇండియాల టవర్ల వ్యాపార విక్రయం, ఇండస్ టవర్స్‌లో ఐడియా వాటా విక్రయం తదితరాల వల్ల లభించే నిధులు విలీనానంతర సంస్థకు దీర్ఘకాల మూలధన వనరులుగా ఉపయోగపడతాయని వివరించింది. విలీన ప్రక్రియకు వివిధ నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు రావడం కూడా తుది దశకు చేరుకుందని వెల్లడించింది.

విజ్ఞానం

వాయు కాలుష్యంతోనే రుతుచక్ర సమస్యలు



వాతావరణ కాలుష్యంతో మహిళల్లో రుతుచక్రం అపసవ్యతలకు దారితీయ వచ్చునని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ముఖ్యంగా యుక్త వయసు స్త్రీలలో ఈ మార్పును గ్రహించవచ్చునని బోస్టన్‌యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అయిన భారతీయ అధ్యయనవేత్త శ్రుతి మహాలింగయ్య పేర్కొన్నారు. వాతావరణంలో పెరుగుతున్న వాయు కాలుష్యం ఇన్‌ఫెర్టిలిటీ, మెటబాలిక్ సిండ్రోమ్, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ పెరుగుతున్నట్లు వెల్లడైంది. కాలుష్యం కారణంగా గుండె సంబంధిత వ్యాధులు, పల్మొనరీ డిసీసెజ్ మరింతగా చోటు చేసుకుంటున్నట్లు వైద్యులు ఆందోళన వెలిబుచ్చారు. ముఖ్యంగా పునరుత్పత్తికి సంబంధించిన ఎండోక్రైన్ సిస్టమ్‌పై ప్రతికూల ప్రభావం చూపడంతో పుట్టబోయే శిశువులు పలు అనారోగ్యాలకు గురవుతున్నట్లు తెలుస్తోంది. హార్మోన్స్ అపసవ్యవల్ల తలెత్తే రుతుచక్రంలోని లోపాలు ప్రధానంగా వాతావరణ కాలుష్యానికి సంబంధించినదేనని దీనివలన మనిషిలో హార్మోనల్ యాక్టివిటీకూడా తగ్గుతున్నట్లు తెలుస్తోంది.

ఆహారంలో కొవ్వు తగ్గించుకోండి



కొలెస్ట్రాల్ అధికంగా ఉండే సాసేజ్‌లు, బటర్, నెయి, యోగర్ట్‌ల వినియోగంతో కోలోన్ కేన్సర్ (పెద్దప్రేగు) వచ్చే ప్రమాదం ఉంది. ఎలుకలపై చేపట్టిన ప్రయోగంలో కొవ్వు పదార్థాలు పెద్ద ప్రేగుల్లోని స్టెమ్ సెల్స్ పెరుగుదలను ప్రభావితం చేస్తాయని తెలుస్తోంది. జంతువుల్లోని కొలెస్ట్రాల్ శాతం పెరుగుదల పెద్దప్రేగుల్లోని స్టెమ్ సెల్స్ మరింత త్వరగా అంటే విభజనకు గురై 100రెట్లు కేన్సర్ కణితుల పెరుగుదలకు దోహదంచేస్తాయి. ఆహారంద్వారా తీసుకునే కొలెస్ట్రాల్‌కు కొలోన్ కేన్సర్‌కు మరింత విస్తృతంగా ఉన్నట్లు కాలిఫోర్నియాలోని స్కూల్ ఆఫ్ మెడిసిన శాస్త్రజ్ఞులు వెల్లడించారు.

ఆధునిక మానువుడి గమనం యూరేసియాలోనే....



మానవుని పూర్వీకులు మనం ఊహించనదానికంటే ముందుగానే యూరేసియాలో నివసించినట్లు ఆధారాలు దొరికాయి..ఆఫ్రికా వెలుపల ఇజ్రాయెల్‌లో అత్యంత పురాతనమైన మానవ దంతాలకు చెందిన శిలాజాలు లభించాయి. దవడభాగానికి సంబంధించి పళ్లతోపాటు తాజాగా ఇజ్రాయెల్‌లోని కేమెల్ పర్వతాల్లో మిస్లియా గుహల్లో లభించాయి. ఇవి సుమారు 177,000-194,000ఏళ్ల క్రితం నాటివని తెలుస్తోంది. దీన్ని బట్టి ఆధునిక మానవుడు మనం అంచనాలకు పూర్వమే 50,000ఏళ్ల క్రితం జీవించి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ శిలాజాలు సుమారు 200, 000 ఏళ్ల నాటివి. జనెటిక్స్, ఫాజిల్స్, ఆర్కియాలజీ సర్వే ప్రకారం ఆధు నిక మానవుడు ఆఫ్రికాలో ఉండేవాడని అనుకున్నప్పటికీ, యూరేసియా ప్రాంతంలో సుమారు 60,000 ఏళ్లక్రితమే నివాసం ఉన్నట్లు తెలుస్తోంది.

మహా ముదుర్లు

పెట్రోల్ దొంగలించడానికి సొరంగం తవ్వారు

పేలుడుతో వెలుగులోకి వచ్చిన చోరీయత్నం

ఢిల్లీ: ఈ మధ్య దొంగలు మహా ముదిరిపోతున్నారు. మూడో కంటికి తెలియకుండా చోరీలు చేసేందుకు పథకాలు రచిస్తున్నారు. దిల్లీలో కూడా కొందరు దొంగలు పెట్రోల్ దొంగలించడానికి ఏకంగా పైప్‌లైన్ వరకు సొరం గం తవ్వారు. అయితే సొరంగంలో పేలుడు సంభ వించ డంతో వారి ప్రయత్నం బెడిసికొట్టింది. ఢిల్లీలోని కక్రో లా ప్రాంతంలో బుధవారం రాత్రి సమయంలో ఓ పెద్ద పేలు డు శబ్దం వినిపించింది. ఆందోళనకు గురైన స్థాని కులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. రంగం లోకి దిగిన పోలీసులు శబ్దం ఎక్కడి నుంచి వచ్చిందా అని ఆరా తీశారు. తీరా ఓ ఇంటి నుంచే ఈ శబ్దం వినిపించి నట్లు తెలుసుకుని ఆ ఇంట్లో సోదాలు చేపట్టారు. తనిఖీల్లో పోలీ సులు కంగుతినే విషయం బయటపడింది. ఇంట్లో ఉన్న సోఫాను జరిపి పరిశీలించగా.. దాని కింద ఓ సొరంగం కన్పించింది. 150 అడుగుల పొడవు, 2.5అడుగుల వెడల్పు ఉన్న ఈ సొరంగంలోనే పేలుడు సంభవించి నట్లు తెలిసింది. పోలీసులు విచారిస్తుండగా.. జుబేర్ అనే వ్యక్తి అక్కడక్కడే తచ్చాడుతూ కన్పించాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకోగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జుబేర్, మరికొందరు కలిసి ఐదు నెలల క్రితం ఆ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన పైప్‌లైన్ నుంచి పెట్రోల్‌ను దొంగలించడం కోసం అప్పటి నుంచి సొరంగం తవ్వడం మొదలుపెట్టారు. ఈ పైప్‌లైన్ సోనెపట్ నుంచి బిజ్వాసన్ వరకు చమురును సరఫరా చేస్తుంది. పైప్‌లైన్ వరకు సొరంగం పూర్తయింది. అయితే తవ్వే క్రమంలో పైప్‌లైన్‌కు చిల్లు పడి అందులో నుంచి గ్యాస్ వెలువడింది.

బడ్జెట్‌లో వేతనజీవులకు ఊరట

న్యూఢిల్లీ: ఈ బడ్జెట్‌లో ఉద్యోగులకు ఆదాయం పన్ను పరిమితి పెరిగే అవకాశం ఉండవచ్చునని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీనికి సంబంధించిన విధి విధానాలకు ఇప్పటికే ఆర్థిక మంత్రిత్వశాఖ, ప్రధానమంత్రి కార్యాలయం తుదిరూపును ఇచ్చినట్లు తెలిసింది. వేతన జీవులకు పన్ను రాయితీ అవసరమన్న విషయాన్ని ఆర్థిక మంత్రి అర్థం చేసుకున్నారని ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి వ్యాఖ్యానించారు. ఈ మినహాయింపు అమల్లోకి వస్తే వేతనజీవులకు కొంతమొత్తం మిగులుతుంది. ఉదాహరణకు ఒక వ్యాపారి కార్యాలయ అద్దె, డ్రైవర్ జీతం వంటి ఖర్చులకు ప్రభుత్వం పన్ను మినహాయింపును ఇస్తుంది. కానీ, వేతన జీవికి ఇటువంటి మినహాయింపులు ఉండవు. దీంతో వ్యాపారి కంటే ఉద్యోగి ఎక్కువ పన్ను చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. హెచ్‌ఆర్‌ఏ, ఎల్‌టీఏ వంటివి కలిపి స్టాండర్డ్ డిడక్షన్ ఇచ్చే విషయానికి మాత్రం ఇంకా తుదిరూపు ఇవ్వలేదని సమాచారం. స్థూల వేతనంపై 10శాతం వరకు ఈ మినహాయింపు ఉండవచ్చని భావిస్తున్నారు. 2006 వరకు స్టాండర్డ్ డిడక్షన్ అమల్లో ఉండేది. రూ.5లక్షలు పైబడిన వేతన జీవులకు రూ.20వేలు మినహాయించేవారు. కానీ నాటి ఆర్థిక మంత్రి పి.చిదంబరం దీనిని తొలగించారు.

రివర్స్ ఇమేజ్ సెర్చ్..

వెబ్ విహారంలో... సోషల్ మీడియాలో...ఏవేవో ఫొటోలు చూస్తుంటాం...అనేక మార్లు అవి నిజమైనవేనా? అనే సందేహం వస్తుంది...మరైతే, మీకు వచ్చిన ఫొటో నకిలీదో.. కాదో... తెలుసుకునేందుకు ఏంటి మార్గం?పీసీలోనైనా... ఫోన్‌నైనా... 'రివర్స్ ఇమేజ్ సెర్చ్' చేస్తే సరి!

సినిమా హీరోలు... రాజకీయ నాయకులు... క్రీడాకారులు... ఇలా ఏ రంగానికి చెందిన సెలబ్రిటీ ఎవరైనా... ఆసక్తికరమైనా ఫొటో కూడిన కామెంట్ ఏదో ఇంటర్‌నెట్‌లో కనిపిస్తుంది. నవ్వుకుని భలే సరదాగా ఉందని డౌన్‌లోడ్ చేసి మీ వాల్‌పోస్ట్ చేస్తారు. అది క్షణాల్లో వైరల్ అవుతుంది. ఫొటోలో ఉన్న సెలబ్రిటీ దృష్టికి మీ పోస్ట్ వెళ్లింది. అసలు ఆ ఫొటోలో ఉంది తను కాదనీ... అదో నకిలీ ఫొటో అంటూ... షేర్ చేసిన మీపై సీరియస్ అయితే ఏం చేస్తారు? అయోమయంతో తెల్లబోవాల్సిందే. అందుకే ఏదైనా ఫొటో షేర్ చేసే ముందు నిజమైనదో... కాదో తెలుసుకోవడం మంచిది.



గూగుల్ బ్రౌజర్‌లో...

టెక్స్ట్ కాకుండా బొమ్మల్ని కూడా తరచూ గూగుల్‌లో వెతుకుతుంటాం. అందుకు గూగుల్ 'ఇమేజస్' విభాగం ఉంది. దాంట్లోకి వెళ్లి సెర్చ్‌బాక్స్‌లో పక్కన చూస్తే 'కెమెరా' గుర్తు కనిపిస్తుంది. క్లిక్ చేసి యూఆర్ఎల్ లేదా ఇమేజ్ అప్‌లోడ్‌తోనో ఏదైనా ఫొటోకి సంబంధించిన పూర్తి వివరాల్ని చూడొచ్చు. బ్రౌజర్‌లో ఇది పరిచయం ఉన్నదే. కానీ, వాడుతున్న స్మార్ట్ మొబైల్‌లో రివర్స్ ఇమేజ్ సెర్చ్ చేయాలంటే? గూగుల్ ఇమేజెస్‌లో కెమెరా గుర్తు కనిపించదు. అప్పుడేం చేయాలంటే బ్రౌజర్‌లో ఓపెన్ చేసిన ఫొటోపై నొక్కి ఉంచితే పాప్‌అప్ మెనూలో 'సెర్చ్ గూగుల్ ఫర్ దిస్ ఇమేజ్' ఆప్షన్ కనిపిస్తుంది. ట్యాప్ చేస్తే ఇమేజ్‌కి సంబంధించిన వివరాల్ని 'రివర్స్ సెర్చ్'లో చూడొచ్చు. ఆండ్రాయిడ్‌లోనే కాకుండా ఐఫోన్ వాడుతున్నా క్రోమ్ బ్రౌజర్ ఆప్‌లో ఇది పని చేస్తుంది.

వెబ్ సర్వీసులు

కష్టమైన పద్ధతుల్లో కాకుండా అత్యంత సులువుగా ఫొటోల గుట్టుని తెలుసుకునేందుకు ఉన్న ప్లాట్‌ఫాం 'సీటీఆర్ఎల్‌క్యూ.ఓఆర్‌జీ'. ఇదో వెబ్ సర్వీసు. గూగుల్ అందించే పలు రకాల సర్వీసుల్ని వెబ్‌సైట్‌ని యాక్సెస్ చేయవచ్చు. జాబితాగా కనిపించే 'గూగుల్ రివర్స్ ఇమేజ్ సర్చ్'ని కూడా సైట్ నుంచి సరాసరీ పొందే వీలుంది. రివర్స్ ఇమేజ్ సెర్చ్‌కి క్లిక్ చేస్తే సర్వీసు ఓపెన్ అవుతుంది. 'అప్‌లోడ్' పిక్చర్ ఆప్షన్‌తో ఫొటోని అప్‌లోడ్ చేసి వివరాల్ని వెతికి చూడొచ్చు. ఫోన్‌లో స్టోర్ అయిన గ్యాలరీ ఫొటోలను మాత్రమే కాకుండా పలు క్లౌడ్ సర్వీసుల నుంచి కూడా ఫొటోలను అప్‌లోడ్ చేసి వెతికే వీలుంది.

లి 'టిన్‌ఐ' (www.tineye.com) మరో వెబ్ సర్వీసు. యూఆర్ఎల్, ఫొటోఅప్‌లోడ్‌తో రివర్స్ సెర్చ్ చేసే వీలుంది.

ఇతర ప్రాపర్టీస్

ఎంపిక చేసిన ఫొటో ఎప్పుడు, ఏ సమయంలో తీశారు? షటర్ స్పీడ్, ఎక్స్‌పోజర్, వాడిన సిస్టం, ఫ్లాష్, ఐఎస్ఓ నెంబర్... లాంటి వివరాల్ని తెలుసుకోవాలంటే? 'ఎక్స్ఇఫ్‌డేటా' వెబ్ సర్వీసుని వాడుకోవచ్చు. యూఆర్ఎల్, ఫొటో అప్‌లోడ్‌తో ప్రాసెస్ చేసి ఫొటో ప్రాపర్టీస్ గుట్టు విప్పుతుంది. నకిలీల విశ్లేషణలో కొంత మేరకు ఫొటో ప్రాపర్టీస్‌ని లెక్కలోకి తీసుకోవచ్చు.
http://exiifdata.com



వెరాసిటీ

మెగాపిక్సళ్ల క్వాలిటీతో ఆకట్టుకునే ఏదైనా ఇమేజ్ వివరాల్ని క్షణాల్లో అందిస్తుంది. ఐఫోన్ యూజర్లకు ప్రత్యేకం. డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/5SFkzo

సెర్చ్ బై ఇమేజ్

రివర్స్ ఇమేజ్ సెర్చ్‌ని ఆప్‌లో అందిస్తోంది. ఆండ్రాయిడ్ యూజర్లకు ప్రత్యేకం. డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/UbX5wb

బింగ్ వాడితే...

మైక్రోసాఫ్ట్ బింగ్‌లో సెర్చింజన్‌లో డెస్క్‌టాప్, మొబైల్‌లోనూ ఫొటోల పుట్టుపూర్వోత్తరాల్ని వెతకడం సులువే. గూగుల్‌లో మాదిరిగానే డెస్క్‌టాప్ బ్రౌజర్‌లో ఇమేజెస్‌లోకి వెళ్తే కెమెరా ఐకాన్ కనిపిస్తుంది. వెతకాలనుకునే ఫొటో యూఆర్ఎల్‌ని ఎంటర్ చేసి రివర్స్ సెర్చ్ చేయవచ్చు. విభాగాలవారీగా అప్‌లోడ్ చేసిన ఫొటోను పోలిన మరిన్ని ఇమేజ్‌లు, అవి పోస్ట్ అయిన యూఆర్ఎల్ లింకులనూ చూడొచ్చు. ఇక ఫోన్‌లో బింగ్ సెర్చింజన్‌ని ఓపెన్ చేసి యూఆర్ఎల్‌తోనే కాకుండా ఫోన్‌లోని ఫొటోలనూ అప్‌లోడ్ చేసి చూడొచ్చు. బింగ్ ఇమేజెస్‌లో 'కెమెరా' గుర్తుని తాకి యూఆర్ఎల్‌తోనే కాకుండా ఫోన్ గ్యాలరీలోని ఫొటోలను అప్‌లోడ్ చేసే వీలుంది. ఆప్ రూపంలో బింగ్‌ని ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసి మరిన్ని అదనపు సౌకర్యాలతో రివర్స్ ఇమేజ్ సెర్చ్ చేయవచ్చు.




స్మార్ట్రాన్ కొత్త స్మార్ట్‌ఫోన్, బడ్జెట్‌లోనే..

స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో బుడిబుడి అడుగులేస్తున్న 'స్మార్ట్రాన్' కంపెనీ మరో కొత్త ఫోన్‌ను మనదేశంలో విడుదల చేసింది. టీ.ఫోన్.పీ పేరుతో బడ్జెట్‌లో ఈ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. దీని ధర 7,999 రూపాయలు. ఈ స్మార్ట్‌ఫోన్ ఎక్స్‌క్లూజివ్‌గా ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రమే జనవరి 17 మధ్యాహ్నం 12 గంటల నుంచి అందుబాటులోకి వచ్చింది. నలుపు రంగులో మెటల్ బాడీతో ఈ ఫోన్ రూపొందింది. కంపెనీ ట్రాన్‌ఎక్స్ ప్రోగ్రామ్‌ను ఇది అందిస్తుంది. దీంతో యూజర్లు స్మార్ట్రాన్ టీక్లౌడ్, టీకేర్, టీస్టోర్, ట్రాన్‌ఎక్స్ ఏఐ సామర్థ్యాలను యాక్సస్ చేసుకోవచ్చు.

స్మార్ట్రాన్ టీ.ఫోన్.పీ స్పెషిఫికేషన్లు..

- 5.2 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే
- 2.5డీ కర్వ్‌డ్ గ్లాస్
- క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 435 ఎస్ఓసీ
- 3జీబీ ర్యామ్, 32జీబీ ఇంటర్నల్ స్టోరేజ్
- 13 మెగాపిక్సెల్ రియర్ కెమెరా
- 5 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా
- 5000 ఎంఏహెచ్ బ్యాటరీ
- డ్యూయల్ సిమ్ సపోర్ట్, 4జీ వాయిస్‌ఓవర్ ఎల్టీఈ
- రియర్ ఫింగర్‌ప్రింట్ స్కానర్
- ఆండ్రాయిడ్ 7.1.1 నోగట్

విమానం ఎక్కడుంది?



ప్రపంచంలో ఏ విమానం ఎక్కడుందో, ఎంతసేపటిలో గమ్య స్థానానికి చేరుకుంటుందో, ప్రస్తుతం విమానాశ్రయంలో ఉన్నవేంటి, రాబోయేవేంటి? ఇలాంటి వివరాలు చెప్పడానికి ఓ యాప్ ఉంది. అదే Flightradar24 Flight Tracker. ఇందులో మీకు కావల్సిన విమానం నెంబరు ఇస్తే దాని ప్రస్తుత స్థితి కనిపిస్తుంది. అది గాల్లో ఎంత ఎత్తులో ఉంది, ఎంత వేగంగా ప్రయాణిస్తోంది, ఇప్పటివరకు ఎలా ప్రయాణించింది లాంటి వివరాలు ట్రాక్ ఆప్షన్‌లో తెలుసుకోవచ్చు. ఆ విమానం గత వారం రోజుల్లో ఎలా ప్రయాణించింది అనేదీ తెలుస్తుంది. దీంతోపాటు ఓ విమానాశ్రయంలో ప్రస్తుతం ఉన్న విమానాలు, ప్రయాణానికి సిద్ధమైన వాటి గురించి వివరంగా సమాచారం లభిస్తుంది.
- https:///goo.gl/k99f7G



చకా చకా ఎక్కేయండి

ఎప్పుడైనా రాక్ క్లైంబింగ్ చేశారా? పెద్ద పెద్ద కొండరాళ్లను పట్టి చేతులతో అధిరోహిస్తుంటారు. అమ్యూజ్‌మెంట్ పార్క్‌ల్లో ఆ తరహా కొండల్ని కృత్రిమంగా ఏర్పాటు చేస్తుంటారు కూడా. కొంచెం కఠినమే అయినా సాహసోపేతంగా ఉంటుంది. ఎందుకులే అంత రిస్క్ అనుకుంటే... మొబైల్‌లోనే ఆ ఆటను ఆడేయండి. Climb The Wall గేమ్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని చకాచకా కొండలెక్కేయండి. ఇందులో ఛాలెంజ్, ఎండ్‌లెస్, రష్ అని మూడు విభాగాలున్నాయి. వాటిలో మీకు నచ్చింది ఎంచుకొని సరదాగా ఆడేయండి. థ్రిల్ పొందండి. - https:///goo.gl/zJ81NW



చేతిలోన చెయ్యేసి చెప్పుబావా ప్రారంభం

అరుణ్ రాహుల్, అంజనా జంటగా సుమన్, భానుచందర్ ప్రధాన పాత్రలో కట్ల రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో కె జె రాజేష్ నిర్మిస్తున్న చిత్రం చేతిలోన చెయ్యేసి చెప్పుబావా శుక్రవారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభం అయింది. హీరో హీరోయిన్స్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సాయి వెంకట్ క్లాప్ కొట్టారు. నటులు సుమన్, భానుచందర్ దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయల సమావేశంలో సాయి వెంకట్ మాట్లాడుతూ .. మంచి టైటిల్ పెట్టారు. తప్పకుండ మంచి ప్రయత్నం చేస్తున్నారు. నిర్మాత కొత్తగా ఎంటర్ అవుతున్నాడు. మంచి కమిట్మెంట్‌తో సినిమా తీస్తే తప్పకుండా మంచి విజయం సాధిస్తారు అన్నారు. పార్థ సారథి మాట్లాడుతూ .. గాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న నేను మణిశర్మ దగ్గర చాలా సినిమాలకు పని చేశాను. ఈ కథ విన్నాను మంచి లవ్ స్టోరీ, ప్రేమ కథకు సంగీతం ప్రాముఖ్యత వహిస్తుంది. తప్పకుండా ఈ సినిమాకు మంచి సంగీతం అందిస్తాను అన్నారు. హీరో రాజేష్ మాట్లాడుతూ .. మలయాళం, తమిళ భాషల్లో నటించిన నేను మొదటిసారి తెలుగు సినిమాలోకి ఎంట్రీ ఇస్తున్నందుకు ఆనందంగా ఉంది. బాహుబలి లాంటి అద్భుత చిత్రాన్ని అందించిన టాలీవుడ్ లాంటి పెద్ద పరిశ్రమలో హీరోగా నిలబడాలని ఉంది. మంచి కథతో చేస్తున్న ప్రయత్నాన్ని సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను అన్నారు. హీరోయిన్ అంజనా మాట్లాడుతూ .. తెలుగులో హీరోయిన్‌గా పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమా నాకు హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెస్తుందన్న నమ్మకం ఉంది అన్నారు. నిర్మాత రాజేష్ మాట్లాడుతూ .. నిర్మాతగా నా మొదటి ప్రయత్నమిది, కథ కూడా నేనే అందిస్తున్నాను. తప్పకుండా నేను మా టీమ్ కలిసి మంచి చిత్రాన్ని అందిస్తాము అన్నారు. దర్శకుడు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ .. నిర్మాత రాజేష్ గారు మంచి కథ అందించారు .. దానికి తోడు టైటిల్ కూడా అద్భుతంగా ఉందని అందరూ అంటున్నారు. ప్రేమను దక్కించుకోలేని ఓ ప్రేమ జంట మరు జన్మలో తమ ప్రేమను ఎలా దక్కించుకున్నారు.. వారి పగను ఎలా తీర్చుకున్నారన్న అంశాలతో తెరకెక్కనుంది. ఫిబ్రవరి చివరలో షూటింగ్ మొదలు పెట్టి ఏప్రిల్ వరకు పూర్తి చేసి సమ్మర్‌లో విడుదల చేస్తాం అన్నారు.

మెప్పించిన అనుష్క



మహిళా ప్రధాన చిత్రాలంటే ప్రస్తుతం దర్శకనిర్మాతలకు, ప్రేక్షకులకు టక్కున గుర్తొచ్చే పేరు అనుష్క. అరుంధతి సినిమా నుంచి ఆమె కోసమే కథలు రాయడం, పాత్రల్ని సృష్టించడంలో దర్శకరచయితలు ప్రత్యేకదృష్టిని పెట్టడం మొదలైంది. అనుష్క కీలక పాత్రలో నటించిన పలు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద స్టార్ హీరోలకు ధీటుగా భారీ వసూళ్లను సాధిస్తుండటం, కథానాయికగా అనుష్క క్రేజ్ పెరగడంతో ఆమెను ప్రధాన భూమికగా చేసుకుంటూ సినిమాలు తెరకెక్కించడానికి చాలా మంది దర్శకనిర్మాతలు ఆసక్తిని కనబరుస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంచలన విజయాన్ని సాధించడమే కాకుండా ప్రపంచ సినీ ప్రియులంతా టాలీవుడ్ వైపు చూసేలా చేసిన చిత్రం బాహుబలి. ఈ సినిమా చేసిన హంగామా ఏంటో అందరికి తెలిసిందే. దేవసేనగా అనుష్క అబ్బురపరిచే నటనతో ఆకట్టుకోవడంతో ఆమె నటించే తదుపరి సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఆమె నటించిన తాజా చిత్రం భాగమతి. పిల్ల జమీందార్ చిత్రం తరువాత ఆ స్థాయిలో సక్సెస్‌ని సొంతం చేసుకోలేకపోతున్న దర్శకుడు అశోక్ ఈ చిత్రానికి దర్శకుడు. యు.వి.క్రియేషన్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం అంచనాలకు అనుగుణంగా వుందా? లేదా అనేది తెలియాలంటే కథలోకి వెళ్లాల్సిందే...

సివిల్స్‌లో టాపర్ అయిన చెంచల (అనుష్క) నిజాయితీగల ఐఏఎస్ ఆఫీసర్. ప్రజలకు తన వంతు సహాయం చేయాలని తపనపడుతూ వుంటుంది. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఈశ్వరప్రసాద్ (జయరామ్) వద్ద పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తూ వుంటుంది. ఓ రోజు ప్రాణధార ప్రాజెక్ట్ నిర్వాసితుల పక్షాన నిరసన తెలపడానికి వచ్చిన శక్తి (ఉన్ని ముకుందన్) మంచి తనం నచ్చి అతన్ని ప్రేమించడం మొదలుపెడుతుంది. అనుకోని సందర్భంలో తను ప్రేమించిన శక్తినే చెంచల హత్య చేసి జైలుకు వెళుతుంది. అక్కడి నుంచి చెంచలను రహస్య ఎంక్వైరీ పేరుతో సీఐ సంపత్ (మురళీశర్మ) సహాకారంతో సీబీఐ అధికారిని వైష్ణవి నటరాజన్(ఆశా శరత్) భాగమతి బంగ్లాకు తరలిస్తుంది. అక్కడ ఏం జరిగింది? చెంచల ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొంది? అమితంగా ప్రేమించిన తన ప్రియుడినే తను ఎందుకు చంపాల్సి వచ్చింది?. ప్రాణధార ప్రాజెక్ట్ వెనకున్న అసలు కథేంటి? మచ్చలేని వ్యక్తిగా చెలామణీ అవుతున్న ఈశ్వర ప్రసాద్‌కు సీబీఐకి వున్న లింకేంటి? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

ప్రచార చిత్రాలతో సగటు ప్రేక్షకుడికి ఇదొక హారర్ సినిమాలా అనిపిస్తుంది. కానీ ఇది ట్రైలర్‌లో చూపించినట్టుగా హారర్ సినిమా కాదు. భాగమతి కథ అంతకన్నా కాదు. చెంచల కథనే ప్రధానంగా నడిపించాడు. మంచి తనం ముసుగుతో కోటానుకోట్లు కొల్లగొట్టి ముఖ్యమంత్రి పీఠాన్ని అదిష్ఠించాలనుకునే ఓ కుటిల రాజకీయ నాయుడి నేర సామ్రాజ్యం చుట్టూ దర్శకుడు కథను అల్లుకుని దానికి ఛారిత్రక నేపథ్యం వున్న భాగమతి బంగ్లా నేపథ్యాన్ని జోడించి హారర్ సినిమా అనే భ్రమను ప్రేక్షకుడికి కలిగించే ప్రయత్నం చేశాడు. సినిమా మొత్తం రాజకీయ నేపథ్యంలో సాగే పొలిటికల్ థ్రిల్లర్‌లా అనిపిస్తుంది. భాగమతి బంగ్లాకు కథ షిఫ్ట్ అయిన తరువాత వచ్చే నాలుగైదు సన్నివేశాలు నిజంగా హారర్ సినిమా చూస్తున్నామా అనే భావనను కలిగిస్తాయి. ఈ విషయంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. ఎవడు పడితే వాడు రావడానికీ పోవడానికీ ఇదేమైనా పశువుల దొడ్డా భాగమతి అడ్డా. ఒక్కొక్కరి లెక్కలు తేలాలి అంటూ అనుష్క భీకరంగా చెప్పే డైలాగ్‌లు...వెన్నులో వణుకు పుట్టించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. తొలి భాగంలో ఏం జరుగుతోంది? కథాగమనం ఏ వైపుకు వెళుతున్నది అనే కన్‌ఫ్యూజన్ ఉత్పన్నమవుతుంది. అయితే భాగమతి బంగ్లా నుంచి కథను నడిపించడం మొదలుపెట్టిన దర్శకుడు ఎక్కువ భాగం ఆ బంగ్లాను చూపించడానికే సమయం తీసుకోవడం కొంత సాగదీతగా అనిపిస్తుంది. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో చెంచల కాస్త భాగమతిగా మారిపోయిందని చూపించడంతో కథ ఆసక్తికరమైన మలుపు తీసుకుంటుంది. ఒక దశలో ద్వితీయార్థం ముగింపులో వచ్చే సన్నివేశాల్లో చెంచలను విలన్‌గా చూపించే ప్రయత్నం చేయడం, ఆ తరువాత మళ్లీ వెంటనే ఓ ట్విస్టిచ్చి కథని సుఖాంతం చేయడంతో పతాక ఘట్టాలు సగటు ప్రేక్షకుడిని ఆకట్టుకుంటాయి.





చెంచలగా, భాగమతిగా అనుష్క అద్భుతంగా నటించింది. ఈ చిత్రానికి ఆమె నటనే ప్రధాన బలంగా నిలిచింది. నిజాయితీగల అధికారినిగా హుందాగా కనిపించిన అనుష్క భాగమతి పాత్రలోనూ అదే తరహాలో రక్తికట్టించి ఆకట్టుకుంది. భాగమతిగా భయపెట్టింది. రెండు పాత్రల్లోనూ వైవిద్యాన్ని చూపిస్తూ సినిమాను నడిపించిన తీరు అందరికి నచ్చుతుంది. నీటిపారుదల శాఖ మంత్రిగా జయరామ్, ప్రేమికుడిగా ఉన్నిముకుందన్, సీబీఐ అధికారిని వైష్ణవి నటరాజన్‌గా మలయాళ నటి ఆశాశరత్, సీఐ సంపత్‌గా మురళీశర్మ తమ తమ పాత్రల్ని సమర్థవంతంగా పోషించారు. కానిస్టేబుల్స్ పాత్రల్లో విద్యుల్లేఖారామన్, ప్రభాస్ శ్రీను, ధన్‌రాజ్ నవ్వించారు. అద్భుతమైన ఛాయాగ్రహణంలో మది, నేపథ్య సంగీతంతో తమన్ సినిమాకు మరింత బలాన్ని చేకూర్చారు. యు.వి.క్రియేషన్స్ నిర్మాణ విలువలు బాగున్నాయి. ఊహించని ట్విస్టులతో, ఆకట్టుకునే స్క్రీన్‌ప్లేతో దర్శకుడు అశోక్ చిత్రాన్ని నడిపించిన తీరు బాగుంది.

అనుష్క సినిమా అంటే కుటుంబ ప్రేక్షకుల్లో ఆసక్తి వుండటం... సినిమా ఆశించిన స్థాయిలో కొత్తదనంతో లేకపోయినా ఆద్యంతం ఆకట్టుకునే విధంగా వుండటం...ఈ వారం సోలో సినిమాగా భాగమతి రావడం, అనుష్కకు వున్న పాపులారిటీతో ఈ సినిమా కమర్షియల్‌గా విజయాన్ని సాధించే అవకాశాలున్నాయి. బాహుబలి చిత్రం తరువాత అనుష్కకు ఏర్పడిన క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల చేయడం నిర్మాతలకు ఆర్థికంగా ప్లస్ అయ్యింది. అయితే భాగమతి సంక్రాంతి రేసులో వున్నట్లయితే నిర్మాతలు ఇంతకు మించిన విజయాన్ని సొంతం చేసుకునేవారు. ఫైనల్‌గా భాగమతి చిత్రం అనుష్క కెరీర్‌లో కమర్షియల్ హిట్ చిత్రాల జాబితాలో చేరుతుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

జంబలకిడి పంబలో శ్రీనివాసరెడ్డి కుమార్తె



కమెడియన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్, హీరో ఫ్రెండ్ క్యారెక్టర్ల నుంచి ప్రస్తుతం హీరోగా ఎదిగిన శ్రీనివాసరెడ్డి...టాలీవుడ్ చరిత్రలో తనకంటూ మరో పేజీ కేటాయించుకున్నాడు. తాను హీరోగా నటిస్తున్న సినిమాలో తన నెలవయస్సున్న పాపను కూడా నటింపజేస్తున్నాడు. సినిమాలో ఓ పసిపాప క్యారెక్టర్ కోసం తన కుమార్తెనే శ్రీనివాసరెడ్డి కెమెరా ముందుకు తేవడం విశేషం. జె.బి. మురళీకృష్ణ దర్శకత్వంలో రవి, జో జో జోస్, ఎన్. శ్రీనివాసరెడ్డి నిర్మిస్తున్న జంబలకిడి పంబలో శ్రీనివాసరెడ్డి కుమార్తెకి కూడా ఓ పాత్ర దొరికేసింది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న సినిమాలో శ్రీనివాసరెడ్డికి జతగా సిద్ధి ఇదనాని నటిస్తోంది. ముఖ్యపాత్రలలో పోసాని కృష్ణమురళి, 'వెన్నెల' కిశోర్, సత్యం రాజేష్, ధన్‌రాజ్, షకలక శంకర్, హిమజ, రాజ్యలక్ష్మి, హరితేజ, కేదారి శంకర్, సంతోష్, మధుమణి, మిర్చి కిరణ్, సన తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

'బంగారి బాలరాజు' మూవీ గ్లిట్టర్ విడుదల



నంది క్రియేషన్స్ బ్యానర్‌పై కె.ఎం.డి. రఫీ, రెడ్డం రాఘవేంద్రరెడ్డి నిర్మాతలుగా, కోటేంద్ర దుద్యాల దర్శకుడిగా "బంగారి బాలరాజు" చిత్రంతో పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్ర గ్లిట్టర్ ను ప్రముఖ డైరెక్టర్ సురేందర్ రెడ్డి విడుదల చేసారు.

ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... బంగారి బాలరాజు టీజర్ చూసాను. చాలా బాగుంది. కొత్తగా వస్తున్న ఈ చిత్ర ప్రొడ్యూసర్స్ రఫీ గారికి, రాఘవేంద్రరెడ్డి గారికి డైరెక్టర్ కోటేంద్రకి, హీరో రాఘవ్‌కు మంచి సక్సెస్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అల్ ద బెస్ట్ చెప్పారు.

చిత్ర నిర్మాతలైన కె.ఎం.డి. రఫీ, రెడ్డం రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ... సురేందర్ రెడ్డి గారి లాంటి ప్రముఖ దర్శకులు చేతుల మీదుగా మా సినిమా టీజర్ రిలీజ్ అవడం మాకు ఆనందంగా ఉంది. ఆయన సైరా మూవీలో బిజీగా ఉన్నా మాకు టైమ్ కేటాయించి టీజర్‌ని విడుదల చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

డైరెక్టర్ కోటేంద్ర దుద్యాల మాట్లాడుతూ... మా బంగారి బాలరాజు మూవీ గ్లిట్టర్‌ని పెద్ద మనసుతో విడుదల చేసిన సురేందర్ రెడ్డి గారికి మా యూనిట్ తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మాలాంటి కొత్త దర్శకులకు సురేందర్ రెడ్డి ఆదర్శంగా ఉంటూ ఎంకరేజ్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్ర థియేటరికల్ ట్రైలర్‌ని ఫిబ్రవరి 14 న, సినిమాని మార్చిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాము అని తెలిపారు.

నటీనటులు రాఘవ్, కరాణ్య కత్రీన్, మీనాకుమారి, దూకుడు శ్రవణ్, ఎన్.వి. చౌదరి, సారిక రామచంద్రరావు, కిరాక్ ఆర్.పి, జబర్దస్త్ బాబి, బి.వి. చౌదరి, సుదర్శన్ దోర్నాల్, జయభారత్ రెడ్డి. సాంకేతిక వర్గం సంగీతం : చిన్నికృష్ణ - చిట్టిబాబు రెడ్డిపోగు, కెమెరా : జి.ఎల్. బాబు, ఆర్ట్ : కృష్ణమాయ, కో డైరెక్టర్ : హేమంత్ కుమార్, నిర్మాతలు : కె.ఎండి. రఫి, రెడ్డం రాఘవేంద్రరెడ్డి, కథ,మాటలు,స్క్రీన్ ప్లే, దర్శకత్వం : కోటేంద్ర దుద్యాల.

ఫిబ్రవరిలో శరద్ కొత్త పార్టీ




న్యూఢిల్లీ : జనతాదళ్(యునైటెడ్) తిరుగుబాటు నాయకుడు శరద్ యాదవ్ ఫిబ్రవరి నెల మధ్యలో కొత్త పార్టీ ఏర్పాటుకు అన్ని సన్నాహాలు చేస్తున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న ఆరోపణలతో రాజ్యసభ నుంచి ఆయనపై అనర్హత వేటు పడిన దాదాపు రెండు నెలల తర్వాత గురువారం అధికారికంగా ప్రకటించారు. జేడీ(యూ-శరద్) ప్రధాన కార్యదర్శి, శరద్ యాదవ్ సన్నిహితుడు అరుణ్ శ్రీవాత్సవ మాట్లాడుతూ 'మేము సూచించిన పేర్లపై ఎన్నికల సంఘం అనుమతి కోసం వేచి చూస్తున్నాం' అని తెలిపారు. 'సమాజ్‌వాదీ జనతాదళ్, అప్నా జనతాదళ్, లోక్ తాంత్రిక్ జనతాదళ్ తదితర మూడు నుంచి నాలుగు పేర్లను సమర్పించాం' అని శ్రీవాత్సవ పేర్కొన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ)తో విభేదించి బయటకు వచ్చిన తిరుగుబాటు నాయకులందరి భాగస్వామ్యంతో న్యూఢిల్లీలోని తల్కాటొర స్టేడియంలో కొత్త పార్టీని ఘనంగా ప్రారంభించేందుకు ప్రణాళిక చేస్తున్నారు.

ప్రధాని శ్రమ అవార్డులకు 50 మంది ఎంపిక

న్యూఢిల్లీ : అయిదు వందల మంది లేదా అంతకుమించి కార్మికులకు కలిగి ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు రంగ విభాగాలలో పని చేస్తున్న 50 మందికి 2016 సంవత్సరానికి ప్రధాన మంత్రి శ్రమ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ప్రభుత్వం గురువారం తెలిపింది. 'ఈ ఏడాది శ్రమ అవార్డుల మొత్తం సంఖ్య 32 అయినప్పటికీ, వాటిని అందుకునే కార్మికులు 50 మంది' అని అధికార ప్రకటన ఒకటి పేర్కొంది. వీరిలో ప్రభుత్వ రంగం నుంచి 34 మంది కార్మికులు కాగా, ప్రైవేటు రంగం నుంచి 16 మంది ఉన్నారు. శ్రమశ్రీ/శ్రమదేవి, శ్రమవీర్/శ్రమ వీరంగన, శ్రమ భూషణ్, శ్రమ రత్నగా మొత్తం నాలుగు విభాగాలుగా శ్రమ అవార్డులు ఉన్నాయి. ఆయా విభాగాలలో వారు అత్యున్నత పని తీరు, విశేష సేవలను గుర్తించి కార్మిక మంత్రిత్వ శాఖ ఈ అవార్డులకు ఎంపిక చేస్తుంది. కాగా ప్రతిష్ఠాత్మక 'శ్రమరత్న' అవార్డుకు ఈ ఏడాది నామినేషన్ ఏదీ రాలేదు. అయితే ప్రశంసాపత్రం, రూ.లక్ష నగదు పురస్కారంతో కూడిన 'శ్రమ భూషణ్ అవార్డుకు టాటా స్టీల్, సెయిల్, బీహెచ్‌ఈఎల్‌ల నుంచి 12 మందిని ఎంపిక చేశారు.

ఘనంగా గణతంత్రం

- అట్టహాసంగా సాగిన పెరేడ్
- సత్తాచాటిన త్రివిధ దళాలు
- ఆకట్టుకున్న శకటాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు







న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో 69వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పది ఆసియా దేశాల అధినేతలు విచ్చేశారు. పరేడ్ అట్టహాసంగా సాగింది. వేర్వేరు రాష్ట్రాలు, ప్రభుత్వ శాఖల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. త్రివిధ దళాలు సత్తా చాటాయి. ఆకట్టుకున్న సాంస్కృతిక వైవిధ్యం. గణతంత్ర వేడుకలను వీక్షించేందుకు వేలాదిమంది హాజరయ్యారు. శీతల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలంతా ఉత్సాహంగా రాజ్‌పథ్ వద్దకు చేరుకొని సందడి చేశారు. గట్టి భద్రత నడుమ 8కిమీల మేర రాజ్‌పథ్ నుంచి ఎర్రకోట వరకు గంటన్నర సేపు సాగిన కవాతును ప్రేక్షకులు ఆసక్తిగా వీక్షించారు. సైనికుల సాహసోపేత విన్యాశాలను ఆసక్తిగా తిలకించారు. ద్విచక్రవాహనాలతో డేర్‌డెవిల్స్‌ను, కళాకారులను అభినందించారు. ఆసియా దేశాలతో భారత్ సంబంధాలు శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో 10 దేశాల అధినేతలను ప్రధాని నరేంద్రమోడీ ఆహ్వానించారు. భారత్-ఏషియన్ స్మారక సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు విచ్చేసిన ఆశియా దేశాధినేతలు ప్రధాని మోడీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో పాటు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. ఢిల్లీ ఏరియా హెడ్‌క్వార్టర్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్, లెఫ్టినెంట్ జనరల్ అసిత్ మిస్త్రీ పరేడ్‌ను కమాండ్ చేశారు. రాష్ట్రపతి కోవింద్ గౌరవవందనాన్ని స్వీకరించారు. కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, ఆరోగ్యమంత్రి జేపీ నడ్డా, సమాచార శాఖ మంత్రి స్మృతి ఇరానీ, న్యాయమంత్రి రవిశంకర్ ప్రసాద్, పర్యావరణశాఖ మంత్రి హర్షవర్ధన్‌లతో సహా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, సీనియర్ నాయకులు గులాంనబీ ఆజాద్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా తదితర ప్రముఖులు హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యరూపకాలు, శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 23 శకటాలతో పాటు ప్రభుత్వ శాఖల శకటాలు పరేడ్‌లో పాల్గొన్నాయి. అన్నింటిలో ఆలిండియా రేడియో (ఎయిర్) శకటం ప్రధానంగా ఆకర్షించింది. భారత ఆర్మీ టీ-90 ట్యాంక్ (భీష్మ), బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ, ఆయుధాలను గుర్తించే రాడార్ (స్వాతి), బ్రిడ్జ్ లేయింగ్ ట్యాంక్ టి-72, ఆకాష్ ఆయుధ వ్యవస్థ అమితంగా ఆకర్షించాయి. భారత వాయుసేన తేజస్‌తో పాటు అదే శ్రేణికి చెందిన మరికొన్ని యుద్ధవిమానాలను ప్రదర్శించింది. అయితే



సి-130జే సూపర్ హెర్క్యులస్, సి-17 గ్లోబ్‌మాస్టర్, సుఖోయ్-30 ఎంకేఐలు, తేజస్ యుద్ధవిమానాలు చేసిన విన్యాసాలు షోస్టాపర్‌గా నిలిచాయి. సేనాదళ్‌కు చెందిన మహిళా డేర్‌డెవిల్స్ తమ అద్భుత విన్యాశాలతో చూపరులను అకట్టుకున్నారు.

ఏకమవుతున్న విపక్షాలు

సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా చర్చలు

ముంబై : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలన్నీ ఒక్కటవుతున్నాయి. అధికారికంగా ప్రకటించకపోయినా అవకాశం ఉన్న ప్రతిసారి పార్టీలన్నీ సమావేశమవుతున్నాయి. మాటామంతీ కలుపుతున్నాయి. ఈ పార్టీల లక్ష్యం కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే. అందుకు అనుసరించాల్సిన వ్యూహంపై పదేపదే సమావేశమవుతున్నాయి. తాజాగా శుక్రవారం ప్రతిపక్ష పార్టీల నాయకులు శరద్‌యాదవ్, శరద్ పవార్, డి.రాజా, హార్దిక్ పటేల్, ఒమర్ అబ్దుల్లా, దినేష్ త్రివేది, సుశీల్‌కుమార్ షిండే భేటీ అయ్యారు. 'రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం' పేరుతో ప్రతిపక్షాలు భారీ ర్యాలీకి పిలుపునిచ్చాయి. ఈ ర్యాలీకి ముందు నాయకులంతా దక్షిణ ముంబైలోని మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రాధాకృష్ణ విఖే పాటిల్ అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. ఎన్‌సీపీ నాయకులు ప్రఫుల్ పటేల్, డీపీ త్రిపాఠి, మాజీ ఎంపీ రామ్‌జెత్మలానీ హాజరయ్యారు. ప్రతిపక్షాల ర్యాలీకి తృణమూల్ కాంగ్రెస్ నుంచి రైల్వే మాజీమంత్రి త్రివేదీ వచ్చారు. 2019 లోక్‌సభ ఎన్నికలకుముందు బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టే ప్రయత్నంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతిపక్షాల ర్యాలీకి పోటీగా మహారాష్ట్ర బీజేపీ నేడు తిరంగ యాత్ర చేపట్టింది. 'సేవ్ కాన్‌స్టిట్యూషన్ మార్చ్' కన్వీనర్, ఇండిపెండెంటు ఎంపీ రాజు శెట్టి కూడా ప్రతిపక్షాల సమావేశానికి హాజరయ్యారు. ముంబై వర్సిటీ క్యాంపస్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద గల శివాజీ మహారాజ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు రాజు శెట్టి తెలిపారు.







అనుమానిత ఐసిస్ ఆత్మాహుతి బాంబర్ అరెస్టు

- కాశ్మీర్‌లో గణతంత్ర వేడుకల్లో విధ్వంసానికి కుట్ర..?
- పూనేకు చెందిన యువతిగా గుర్తింపు

శ్రీనగర్ : దక్షిణ కాశ్మీర్‌లో ఐసిస్ ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న పూనేకు చెందిన యువతిని జమ్మూ, కాశ్మీర్ పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ మునీర్ ఖాన్ మాట్లాడుతూ 'ఒక అనుమానితుని సమాచారం మాకు అందింది. అదృష్టవశాత్తూ, అన్ని రకాల తర్వాత గత అర్ధరాత్రి ఆ అనుమానితుని పట్టుకోగలిగాం' అని తెలిపారు. అయితే ఇతర వివరాలు వెల్లడించేందుకు ఆయన నిరాకరిస్తూ, 'ఆమె(అనుమానితురాలు)తో మేము మాట్లాడుతున్నాం. మా సోదర దర్యాప్తు సంస్థలతో కూడా మాట్లాడుతున్నాం. వాస్తవాలు ఏమిటనే విషయంపై అన్ని రకాలుగా దర్యాప్తు జరుపుతున్నాం. తగిన దర్యాప్తు తర్వాత ఏదైనా ఒక నిర్ధారణకు రావడం జరుగుతుంది' అని చెప్పారు. ఇదిలాఉండగా అధికార వర్గాలు గురువారం మాట్లాడుతూ విదేశాల్లోని ఐసిస్ మద్దతుదారులతో సంబంధాలు వెలుగుచూసిన తర్వాత ఆమె ఉగ్రవాదిగా ఉన్నట్లు గమనించినపుడు 2015లో పూనే ఉగ్రవాద నిరోధక బృందం(ఏటీఎస్) ఇదే మహిళను ప్రశ్నించడం జరిగిందని వివరించారు. సిరియాకు వెళ్లేందుకు ఆమె ప్రణాళిక చేస్తుందని ఏటీఎస్ పేర్కొంది. పూనే కళాశాలలో 11వ తరగతి చదువుతున్న ఈ యువతిని ఏటీఎస్ ద్వారా డీ-రాడికలైజేషన్ కార్యక్రమానికి పంపారు. కాశ్మీరీయేతర మహిళ లోయలో గణతంత్ర దిన వేడుకలకు విఘాతం కలిగించవచ్చన్న నిఘా సంస్థల సమాచారం నేపథ్యంలో అప్రమత్తత ప్రకటించారు. కాశ్మీర్‌లో రిపబ్లిక్ డే పరేడ్ లోపల లేదా సమీపంలో 18 ఏళ్ల కాశ్మీరీయేతర యువతి ఆత్మాహుతి బాంబు పేలుడుకు పాల్పడవచ్చని 'గట్టి సమాచారం' ఉందని అన్ని జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు, కాశ్మీర్‌లోని భద్రతా విభాగం ప్రధాన అధికారికి పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్(కాశ్మీర్) జారీ చేసిన సందేశం పేర్కొంది. 'జాతి వ్యతిరేక శక్తులను అడ్డుకునేందుకు అత్యంత జాగురూకతతో వేదికల వద్ద మహిళలను తనిఖీలు చేయాలి' అని వివరించారు. అనుమానితురాలు ఇప్పటికే లోయలోకి ప్రవేశించిందని, అయితే రిపబ్లిక్ డే వేడుకలకు అన్ని రకాలుగా భద్రతా చర్యలు చేపట్టినట్లు డీజీపీ ఎస్.పి.వైద్ తెలిపారు. ఉగ్రవాదులను నిరోధించేందుకు నగరంలోని కీలక ప్రాంతాల్లో భద్రతా దళాలను భారీగా మోహరించామన్నారు. అలాగే నగరంలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. ఇదిలాఉండగా, ప్రతి సంవత్సరం బక్షి స్టేడియంలో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకలను ఈ ఏడాది షేర్-ఎ-కాశ్మీర్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే ప్రయాణం

మా మధ్య వైరుధ్యాలు లేవు

ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ స్పష్టీకరణ



ముంబై : కాంగ్రెస్‌తో తమకు ఎలాంటి వైరుధ్యం లేదని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ స్పష్టంచేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తామని ఆయన ప్రకటించారు. నిన్నమొన్నటి దాకా కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టు వ్యవహరించిన పవార్...తాజాగా శుక్రవారం చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకున్నది. బీజేపీ వ్యతిరేక శక్తులు ఏకమవుతున్న తరుణంలో పవార్ ప్రకటన కీలకంగా మారింది. ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి పటిష్టమైన ప్రతిపక్షం కావాల్సిన అవసరం ఉందని, ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తే బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదని పవార్ అన్నారు. ముంబై మిర్రర్‌తో పవార్ మాట్లాడారు. ఎన్‌సీపీ, కాంగ్రెస్ మధ్య ఇప్పుడు వైరుధ్యాలేవీ లేవని ఆయన అన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ నాయకత్వంతో తమకు మంచి సంబంధాలే ఉన్నాయని పవార్ చెప్పారు. భావసారూప్యత గల పార్టీలతో కలిసి పనిచేయాలని తాము, కాంగ్రెస్ కోరుకుంటున్నదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ శక్తిసామర్థ్యాల గురించి తాను తరచూ చెబుతున్నానని, రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ పటిష్టమవుతుందని పవార్ వ్యాఖ్యానించారు. 'యూపీఏ హయాంలో రాహుల్‌కు నేను ఓ సలహా ఇచ్చాను. మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో చేరమన్నాను. దీనివల్ల ప్రభుత్వాన్ని నడపడానికి అవసరమైన అనుభవం సంపాదించవచ్చని సూచించాను. అది మీలోని విశ్వాసాన్ని పెంచడానికి దోహదపడుతుందని చెప్పాను. ఇది విమర్శ కాదు. కేవలం సూచన మాత్రమే. అయితే నాడు కాంగ్రెస్ నాయకత్వం మరో విధంగా అర్థం చేసుకున్నది' అని పవార్ వివరించారు. రాజ్యసభలోని ప్రతిపక్షాల ఆధిపత్యం...2019లో యునైటెడ్ ఫ్రంట్‌గా మారుతుందని పవార్ సంకేతాలిచ్చారు. సమాజ్‌వాదీపార్టీ, బహుజన సమాజ్‌పార్టీ వంటి పార్టీలు తమ వైరుధ్యాలను పక్కన పెట్టాలని, బీజేపీని ఓడించడానికి ఐక్యంగా ముందుకు రావాలని తాను భావిస్తున్నానని పవార్ అన్నారు. 2019లో ఒంటరిగా పోటీ చేస్తానని శివసేన ప్రకటించిందని, శివసేనకు అంకితభావం గల కార్యకర్తలు ఉన్నారని, బీజేపీతో సంకీర్ణాన్ని వారు కోరుకోవడం లేదని అన్నారు. శివసేనను అడుగడుగునా బీజేపీ అవమానిస్తోందని అన్నారు. శివసేన కార్యకర్తల్లో అలజడికి ఇదే కారణమని పవార్ చెప్పారు.

భగవత్ ధిక్కారం

కేరళ స్కూల్‌లో త్రివర్ణ పతాకావిష్కరణ

ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించిన వైనం

కేసు నమోదు చేయాలని సీపీఎం, కాంగ్రెస్ డిమాండు



పాలక్కడ్ : భారత 69వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కేరళలోని పాలక్కడ్ నగరంలో సంఘ్ కార్యకర్తలు నిర్వహించే ఒక పాఠశాలలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ శుక్రవారం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. విద్యాభారతి ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యాస విద్యా పీఠం ఉన్నత పాఠశాలలో భగవత్ జెండా ఎగురవేశారు. పాలక్కడ్ కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘిస్తూ గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజున కర్నాకిఅమ్మన్ ఉన్నత పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఎగురవేయడం వివాదాస్పదమైంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆయా శాఖల విభాగాల అధిపతులు మాత్రమే జాతీయ పతాకాన్ని ఎగురవేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ, విద్యా సంస్థలలో జాతీయ పతాక ఆవిష్కరణ మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొంది. భగవత్ పాఠశాలలో జెండాను ఆవిష్కరించడంలో తప్పేమీ లేదని, అది ప్రతి పౌరుడి హక్కు అని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించిన ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌పై కేసు నమోదు చేయాలని అధికార సీపీఎం, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు ప్రభుత్వాన్ని కోరాయి. కాగా ప్రభుత్వం పాఠశాల యాజమాన్యం నుంచి కూడా వివరణ కోరింది. పాలక్కడ్ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల మూడు రోజుల శిబిరానికి భగవత్ హాజరుకానున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు తెలిపాయి.

గణతంత్ర వేడుకలకు కేజ్రీవాల్, సిసోడియా

న్యూఢిల్లీ : రాజ్‌పథ్‌లో జరిగిన గణతంత్ర వేడుకలకు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతోపాటు, కేబినెట్ సభ్యులు హాజరయ్యారు. సిసోడియా, ఢిల్లీ మంత్రి సత్యేంద్ర జైన్‌లకు కేటాయించిన వీఐపీ గ్యాలరీ కాకుండా కేజ్రీవాల్‌కు వేరుగా ఆసీనులయ్యారు. ప్రజలకు ఆయన ట్విట్టర్ ద్వారా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా సిసోడియా పరేడ్‌లో ఢిల్లీ పాఠశాల విద్యార్థుల ప్రదర్శనను మెచ్చుకుంటూ ట్వీట్ చేశారు.

పంజాబ్, హర్యానాల్లో మంచు దుప్పటి

చండీగఢ్ : పంజాబ్,హర్యానాలోని అనేక ప్రాంతాల్లో చల్ల గాలులతో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. చండీగఢ్‌లో 7.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారి తెలిపారు. హర్యానా, అంబాలా, హిసార్, కర్నాల్‌లల్లో వరుసగా 8, 7.7, 8.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చెప్పారు.నార్నౌల్, రోహతక్, భివాని, సిర్సాల్లో వరుసగా 5, 7.3, 7.6, 7.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చెప్పారు.

ఆత్మహత్యకు పాల్పడ్డ క్యాబ్ డ్రైవర్ మృతి

న్యూఢిల్లీ : ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారన్న కారణంతో 21 ఏళ్ల క్యాబ్ డ్రైవర్ జనసంచారంతో రద్దీగా ఉన్న ప్రాంతంలో ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. చెన్నైలో బుధవారం జరిగిన ఈ ఘటనలో కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న డ్రైవర్ శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటనతో ప్రమేయం ఉన్న ఎస్ఐను సస్పెండ్ చేశారని, కేసు దర్యాప్తు సాగుతోందని తెలిపారు. కాగా పోలీసుల వేధింపుల వల్లే మణికందన్ మృతిచెందినట్టు ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు.

'పద్మావత్' ప్రదర్శనకు వెనకంజ

ఆలీఘడ్ : ఉత్తరప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో బెదిరింపులకు భయపడి 'పద్మావత్' చిత్రాన్ని థియేటర్ యజమానులు ప్రదర్శించలేదు. మొదటి నుంచి వివాదాస్పదమైన ఈ చిత్రం కట్టుదిట్టమైన భద్రత నడుమ దేశవ్యాప్తంగా గురువారం విడుదలైంది. 'పద్మావత్' చిత్రాన్ని ప్రదర్శిస్తున్న సినిమా హాళ్ల బయట భద్రతను కట్టుదిట్టం చేశామని, థియేటర్ యజమానులు మాత్రం తమను అదనపు భద్రతను కోరలేదని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు రాకేష్ పాండే తెలిపారు. అయితే తగినంత మంది భద్రతా సిబ్బందితో ఏర్పాట్లు చేసినప్పటికీ థియేటర్ యజమానులు ఆస్తి, ప్రాణనష్టం జరుగవచ్చన్న భయంతో చిత్రాన్ని ప్రదర్శించేందుకు వెనుకాడుతున్నారని తెలిపారు.

సైనిక అధికారి అరెస్టు

న్యూఢిల్లీ : నాగాలాండ్‌కు చెందిన సైనిక అధికారిని అరెస్టు చేసినట్టు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం తెలిపింది. ఎన్ఎస్‌సీఎన్-యూ, ఎన్ఎస్‌సీఎన్-కే కేడర్లకు పేలుడు పదార్థాలు, ప్రభుత్వ ఆయుధాలను సరఫరా చేశాడన్న ఆధారాలతో బ్రిగేడియర్ అహిటోచోపేను అరెస్టు చేసినట్టు ఏజెన్సీ తెలిపింది. దిమాపూర్‌లోని గ్రామానికి చెందిన ఆయన్ని అసోం రైఫిల్స్‌తోపాటు తమ ఏజెన్సీ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అరెస్టు చేసినట్టు ఎన్ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది.

అసోంలో ఖైదీలకు శిక్ష తగ్గింపు

న్యూఢిల్లీ : గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అసోం ప్రభుత్వం 2,685 మంది ఖైదీలకు జైలు శిక్ష రోజులని తగ్గించాలని అసోం ప్రభుత్వం నిర్ణయించినట్టు గువహతిలో శుక్రవారం అధికారిక ప్రకటన విడుదలైంది. రాష్ట్రంలో కోర్టుల తీర్పులతో శిక్షపడ్డ ఖైదీలకు శిక్షను అనుభవించే రోజులను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు ప్రకటన పేర్కొంది. అసోంలో వివిధ జైళ్లలో 3,089 మంది ఖైదీల్లో 2,685 మందికి ఈ అవకాశం అందుతుందని తెలిపింది.

పద్మ అవార్డు గ్రహీతలకు పళని అభినందనలు

న్యూఢిల్లీ : తమిళనాడు ముఖ్యమంత్రి కె.పళనిస్వామి శుక్రవారం పద్మ అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. తమిళం, హిందీ, కన్నడతో పాటు వివిధ భాషల్లోని చిత్రాలకు సంగీతాన్ని అందించిన ఇళయరాజాను సీఎం ప్రశంసించారు. ఇళయరాజా పద్మ విభూషణ్ అవార్డును పొందడం చాలా గర్వంగా ఉందని, ఆయన తన అభినందనలు తెలిపారు. పద్మ భూషణ్ అవార్డు గ్రహీత రామచంద్రన్ నాగస్వామి, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ఇళయరాజాలతోపాటు రాష్ట్రంలో పద్మా అవార్డులు పొందిన ఇతర గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

కాశ్మీర్‌లో ఇంటర్‌నెట్ నిలిపివేత

శ్రీనగర్ : రిపబ్లిక్‌డే ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాశ్మీర్‌లో ఇంటర్ నెట్ సేవలను నిలిపివేశామని అధికారులు వెల్లడించారు. మొబైల్‌ఫోన్లు , డేటాకార్డులన సర్వీసులు కూడా గురువారం నుంచి నిలిపివేశామని, అల్లర్లకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో భారీ బలగాలను మోహరించామన్నారు. శ్రీనగర్‌లోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని భద్రతాదళాలు పరిశీలించారు. ప్రతిఏడాది రిపబ్లిక్ డే ఉత్సవాలను జరిపే బక్షీ స్టేడియం కాకుండా క్రికెట్ స్టేడియంలో కార్యక్రమాలు నిర్వహించారు.

బెంగాలీ నటి సుప్రియాదేవి మృతి

కోల్‌కతా : ప్రసిద్ధ బెంగాలీ నటి, పద్మశ్రీ గ్రహీత సుప్రియాదేవి (85) గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతిచెందారని ఆమె కుమార్తె వెల్లడించారు. ఐదు దశాబ్దాలపాటు ఆమె సినిమాల్లో కొనసాగారు. 1952లో బసుపరివార్‌తో సినీరంగంలో ప్రవేశించిన ఆమె ఉత్తమ్‌కుమార్ జతా 1959 వరకు కొనసాగారు. ఆమె నటించిన సినిమాల్లో చౌరింగీ, బాగ్‌బందీఖేలా, మేఘేఢకతేరాలు క్లాసిక్స్‌గా నిలిచిపోతాయి.

ఇద్దరు సౌదీలతోసహా ముగ్గురి అరెస్టు

జైపూర్ : రిపబ్లిక్‌డే సందర్భంగా ఇద్దరు సౌదీదేశస్తులతోసహా ముగ్గుర్ని రాజస్థాన్‌లోని పోక్రాన్ నగరంలో అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. వీరివద్ద శాటిలైట్ ఫోన్లు ఉన్నాయని, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా కుట్రపన్నుతున్నారన్నారు. తలాల్ మొహ్మద్, అల్ సమ్రి మొహ్మద్‌లు సౌదీకి చెందిన వారుకాగా, తెలంగాణాకు చెందిన సయ్యద్ మొహసిన్‌లను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి శాటిలైట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని జైసల్మేర్ ఎస్పీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు.

30 నుంచి రాహుల్ మేఘాలయ పర్యటన

షిల్లాంగ్ : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జనవరి 30 నుంచి మేఘాలయాలో ఎన్నికల ప్రచారం జరపనున్నారు. ఫిబ్రవరి 27న ఎన్నికలు జరిపి మార్చి 3న ఫలితాలు వెల్లడిస్తారు. మార్చి6 కి ప్రస్తుత అసెంబ్లీ కాలపరిమితి ముగియనుంది. రాష్ట్ర రాజధాని, గరోహిల్స్ జైనేషియా హిల్స్‌లో ఆయన నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారని ఆరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, షిల్లాంగ్ ఎంపీ విన్సెంగ్ పాలా వెల్లడించారు.

మాదకద్రవ్యాల నివారణకు రోబస్ట్

పనాజీ : సామాన్యులకు అధికభారం కలిగించని స్వల్ప పన్నులు విధిస్తామని గోవా ముఖ్యమంత్రి మనోహర్ పరీకర్ శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రాన్ని వేధిస్తున్న డ్రగ్స్‌ను నిరోధించేందుకు రోబస్ట్ ప్రక్రియను చేపడుతున్నామని రిపబ్లిక్‌డే సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పారికర్ ఆర్థికశాఖ కూడా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 22న శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు.

వీహెచ్‌పీ ర్యాలీలో ఉద్రిక్తత

కస్గంజ్ : ఉత్తరప్రదేశ్‌లో మధుర-బరైలీ జాతీయ రహదారిపై శుక్రవారం విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వాలంటీర్లు మోటారు బైకు ర్యాలీ నిర్వహిస్తుండగా గుర్తుతెలియని దుండగులు వారిపై రాళ్లు రువ్వడంతో రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దుండగుల దాడిలో అనేకమంది గాయపడ్డారని, అనేక వాహనాలు దెబ్బతిన్నాయని పోలీసులు తెలిపారు.ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని చెప్పారు.



తెలుగు పరిరక్షణకు సుదీర్ఘ ఉద్యమం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ

విశాలాంధ్ర-తెనాలి : తెలుగు భాష పరిరక్షణ కోసం సుదీర్ఘ ఉద్యమం తక్షణ అవసరమని, అప్పుడే భవిష్యత్‌తరాలకు మాతృభాష మాధుర్యం అందుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో తెలుగు సాహితీమహోత్సవాలు శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రామకృష్ణ కవి కళాక్షేత్రంలోని బొల్లి ముంత శివరామకృష్ణ సాహితీ వేదికపై ప్రారం భసభకు ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి వెంకటరమణ జ్యోతి ప్రజ్వలనతో సభను ప్రారంభించారు. అనంతరం సభలో ఆయన ఆయన మాట్లాడుతూ మృదు మధురమైన తెలుగు భాష గొప్పతనం అనంతమని, నేటితరానికి తెలిసేలా సాహితీ చైతన్యం రావాలన్నారు. విజ్ఞానం కోసం పరభాష అవసర మైనా అదే క్రమంలో మాతృభాషను అభ్యసించాల్సిన బాధ్యత ఉందన్నారు. తెలుగు భాష, నాటక, సాహిత్య వికాసం కోసం ఈ ప్రాంతంలో ఎందరో మహాను భావులు వారి జీవితకాలం కృషి చేశారని, వారిని స్ఫూర్తితో భవిష్యత్‌తరాలు తెలుగు మరువని రీతిగా సాహిత్య ఉద్యమం సాగాలన్నారు. తెలుగు భాషలో న్యాయపాలన కొనసాగాలన్న ఆలోచనతో తాను చేసిన ప్రయత్నాలు తొలి నాళ్ళలో సంతృప్తి నిచ్చాయన్నారు. కాలక్రమంలో చోటు చేసుకున్న పరిణామాలతో వెనుకబడిపోయాయన్నారు. రాష్ట్ర శాసన సభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రాంతీయ భాషల వికాసానికి సూచించిన అంశాల అమలులో చిత్తశుద్ధి కొరవడ టంతో తెలుగు భాషపై తెలుగు వారిలోనే న్యూనతా భావం ఏర్పడిందన్నారు. దీనిని అధిగమించే దిశగా ప్రభుత్వాలు, ప్రజలు కృషి చేయాలన్నారు. కార్పొరేట్ విద్యావిధానం ద్వారానే తెలుగు భాష కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. తెలుగుకు కొత్త వెలుగు చూపేలా కృషి జరగాల న్నారు. విద్యుత్ నియంత్రణ మండలి అధ్యక్షులు గ్రంధి భవానీప్రసాద్ మాట్లా డుతూ తెలుగు సాహిత్యం, మన సంప్రదాయాలు అద్వితీయమై నవన్నారు. హింసను ప్రోత్సహించే అంశాలను మినహాయించి తెలుగు సంస్కృతి, వికా సం కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఆంధ్రప్ర దేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకు మారి మాట్లాడుతూ మాతృభాష వికాసం కోసం ప్రతి హృదయం స్పందించాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆమె వివరించారు. ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లా డుతూ తెనాలి తరహాలో ప్రయత్నాలు పూనుకుంటే తెలుగు భాష వికాసం అసాధ్యం కాదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, నాయకుల ప్రోత్సాహం భాషా ఉన్నతికి దోహదపడుతుందన్నారు. తెలుగు సంస్కృతిని చాటే వర్ణనలతో సాగిన జొన్నవిత్తుల ప్రసంగం సభికులను అలరిం చింది. వేదికపై మార్టిస్టు గాంధీ బొల్లిముంత వారి గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం అతిథులను దుశ్శాలువాలతో, పూలదండలతో, మొమెంటోలతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

9 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు



విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో : జిల్లాలోని దక్కిలి, సీతారామపురం, కలు వాయి పోలీస్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఏకకాలంలో దాడులు నిర్వహించిన పోలీసు ప్రత్యేక బృందాలు తొమ్మిది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 65 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్సు హాల్లో శుక్రవారం ఓఎస్డీ విఠలేశ్వర్ దాడుల వివరాలను మీడియాకు వెల్లడించారు. దక్కిలి పరిధిలో ముగ్గురు, సీతారామపురం పరిధిలో ముగ్గురు, కలువాయి పరిధిలో ముగ్గురు కలిపి మొత్తం తొమ్మిది మంది స్మగ్లర్లను అరెస్టు చేయడంతోపాటు 58 ఎర్రచందనం దుంగలు, నాలుగు మోటార్ సైకిళ్లు, 10 సెల్ ఫోన్లు సీజ్ చేశారు. ఈ దుంగల బరువు 650 కేజీలు ఉంటుంది. అరెస్టయిన వారిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన అంతర్రాష్ట్ర స్మగ్లర్లు ఏడుగురు ఉన్నారు. వీరు వెలిగొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను చెన్నైకు తరలించి అక్కడ నుంచి కంటైనర్ల ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. మూడు ప్రాంతాల్లోనూ దాడుల సమయంలో స్మగ్లర్లు కర్రలు, రాళ్లతో పోలీసులపై దాడులకు ప్రతిఘటించినట్లు సమాచారం. ఎర్రచందనం స్మగ్లర్ల ఆస్తులు కూడా సీజ్ చేయనున్నట్లు ఓఎస్‌డీ తెలిపారు. ఇప్పటికే ఎర్రచందనం స్మగ్లర్ల జాబితాలోని వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎర్రచందనం ప్రభావిత ప్రాంతాల్లో స్మగ్లర్లను అరెస్టు చేయడంతోపాటు స్మగ్లింగ్ నిరోధానికి అవగాహన సదస్సులు, కౌన్సెలింగ్ ఇస్తున్నారు.




బాలికల విభాగంలో మొదటిస్థానం దక్కించుకున్న కేరళ జట్టు

జాతీయ స్థాయి క్రీడల నిర్వహణతో తెనాలికి గుర్తింపు

విశాలాంధ్ర-తెనాలి : జాతీయ స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించడంలో చక్కని ప్రావీణ్యతను ప్రదర్శిస్తూ తెనాలి తన ఉనికిని చాటుకోవడం ఈ ప్రాంత క్రీడా అభిమానుల కృషికి నిదర్శనమని జాతీయ హ్యాండ్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎం.రామ సుబ్రమణి అన్నారు. గుంటూరుజిల్లా తెనాలి అమరావతి ప్లాట్స్‌లోని డీఎస్‌ఏ స్టేడియం ప్రాంగణంలో ఈ నెల 24వ తేదీ నుండి నిర్వహిస్తున్న 39వ సౌత్‌జోన్ జాతీయ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ మహిళా, పురుషుల విభాగం క్రీడలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభలో సుబ్రమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రావిపాటి వీరనారాయణ సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్రమణి విజేతలైన టీమ్‌లకు అభినందనలు తెలుపుతూ బహుమతులు అందజేశారు. కార్యక్రమ నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్న శాసన సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ఎంతో విశిష్టమైన రోజుగా ఈ రోజు మిగిలిపోతుందన్నారు. ఒక వైపు సౌత్ జోన్ క్రీడలు, జాతీయ స్థాయిలో బ్రిడ్జి టోర్నమెంట్స్, మరో వైపు తెలుగు సాహిత్య మహోత్సవాలు అరుదైన కార్యక్రమాలతో గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, కర్ణాటక ప్రాంతాల నుండి 12టీమ్‌లు పోటీల్లో పాల్గొనగా బాలికల విభాగంలో విన్నర్స్‌గా కేరళ టీమ్, రన్నర్స్‌గా తమిళనాడు టీమ్ విజేతలు కాగా, మూడు, నాలుగు స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ టీమ్‌లు నిలిచాయి. బాలుర విభాగంలో తెలంగాణ విన్నర్స్‌గాను, ఆంధ్ర రన్నర్‌గా నిలిచాయి. కర్ణాటక 3వ స్థానంలో, తమిళనాడు 4వ స్థానంలో నిలిచాయి. ముగింపు సభలో మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ కె.శకుంతల, జెడ్పీటీసీ అన్నాబత్తుని జయలక్ష్మి, ఎం.కె.నాగేంద్రం, వీరనాయుడు వీరయ్య, వార్డు కౌన్సిలర్ ఆశీర్వాదం పాల్గొన్నారు. కె.రమేష్, బి.వెంకటేశ్వరరావు, వేళాంగిణి రెడ్డి, నాగరాజు, రామలింగేశ్వరరావు, నాగేంద్రబాబు, రాంబాబులు పోటీలను పర్యవేక్షించారు.

గుంటూరులో జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: : మారెళ్ళ కైలాష్‌రెడ్డి మెమోరియల్ ద్వితీయ అఖిల భారత వాలీబాల్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మాజీమంత్రి, మాకినేని పెదరత్తయ్య ప్రారంభిం చారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మారెళ్ళ కైలాష్‌రెడ్డి చిత్రప టానికి మాకినేని పెదరత్తయ్య, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, కోవెలమూడి రవీంద్ర (నాని), నన్నపనేని రాజకుమారి, సుఖవాసి శ్రీనివాసరావులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విజయానికి చిహ్నమైన గాలి బెలూన్లను పైకి వదిలారు. ఆంధ్రప్రదేశ్ యూత్ కల్చరల్ అంబాసిడర్ అంబిక చేసిన నృత్యం చూపరులను అబ్బురపరచింది. ఇండియా ఫ్లాగ్ విశిష్టతను కరీం టీం ప్రేక్షకులను వావ్ అనిపించేలా ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాకినేని పెదరత్తయ్య, స్థానిక ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిలు ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, వైస్ ఛైర్మన్ వెంకట్, డైరెక్టర్ దయారత్నం, విభిన్న ప్రతిభావంతుల ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కనపర్తి శ్రీనివాసరావు, సుఖవాసి శ్రీనివాసరావు, పెదకూరపాడు జెడ్పీటీసీ ఎం.ఎ షరీఫ్, షేక్ షౌకత్, మ్యానీ, లాల్ వజీర్, ప్రచార కార్యదర్శి చిట్టిబాబు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఏసుదాసు, ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సర్వీసెస్ (ఢిల్లీ) × ఎస్ఆర్ఎం (చెన్నై)ల మధ్య మొదటి మ్యాచ్ : పురుషుల విభాగంలో మొదటి మ్యాచ్ అయిన సర్వీసెస్ (ఢిల్లీ), ఎస్ఆర్ ఎం(చెన్నై) జట్ల మధ్య పోటీలు జరిగాయి. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు హోరాహోరీగా పోరాడాయి. మొదటి సెట్‌లో సర్వీసెస్ (ఢిల్లీ), ఎస్ఆర్ఎం జట్టుపై (25-21) ఆధిపత్యం కొనసాగించింది. రెండో సెట్‌లో ఎస్ఆర్ఎం తొలి దశలో ఒకానొక సమయంలో ముందంజలో ఉంది. నువ్వా నేనా అనే రీతిలో మ్యాచ్ కొనసాగింది. ప్రేక్షకులలో నరాలు తెగేలా మ్యాచ్ రసవత్తరంగా కొనసాగింది. మొదటి విరామ సమయానికి ఎస్ఆర్ఎం 9-4 పాయింట్లతో ముందంజలో ఉంది. అయితే అనూహ్య రీతిలో సర్వీసెస్ (ఢిల్లీ) రెండో సెట్‌లో పుంజుకొని 22-22 పాయింట్లతో సమం చేసింది. చివరకు ఎంతో ఉత్కంఠతతో సర్వీసెస్ (ఢిల్లీ) సమం చేసింది. అయితే మూడో సెట్‌లోనూ రెండో సెట్‌లాగా మ్యాచ్ కొనసాగింది. చివరికి మూడో సెట్‌లో సర్వీసెస్ 25-23 పాయింట్లతో విజయం సాధించింది. మహిళల విభాగంలో కేఎస్ఈబీ (కేరళ), వెస్ట్ బెంగాల్ జట్ల మధ్య కొనసాగింది. **నేటి మ్యాచ్‌లు :** పురుషుల విభాగంలో ఐసీఎఫ్ (చెన్నై) × ఎస్ఆర్ఎం (చెన్నై) ల మధ్య, ఆంధ్రప్రదేశ్× కేఎస్ఈబీ(కేరళ) జట్ల మధ్య, ఐఓబీ (చెన్నై)× సీఆర్‌పీఎఫ్ (ఢిల్లీ) జట్ల మధ్య, మహిళల విభాగంలో కేరళ పోలీస్× వెస్ట్ బెంగాల్ జట్ల మధ్య నేడు జరుగుతాయి.

'జీడిమామిడి'కి ముప్పు

- ఈ ఏడాది జీడి రైతుకు కడగండ్లే !
- పూతను చుట్టేస్తున్న పేనుపురుగు
- దిగుబడులపై అయోమయం





విశాలాంధ్ర-పలాస/కాశీబుగ్గ : శ్రీకాకుళం జిల్లాలోని జీడిమామిడి పంట చిక్కుల్లో పడింది. పొగమంచు రైతుల పుట్టి ముంచుతుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఉద్దాన తీర ప్రాంత ప్రజల ప్రధాన జీవనాధారమైన జీడిమామిడి పంటను నమ్ముకొని వేలాది కుటుంబాలు బతుకుతున్నాయి. పలాస జీడిపప్పు పేరు వింటే వెంటనే ఉద్దానం గుర్తుకొస్తుంది. రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించు కున్న జీడిపప్పు ఉత్పత్తులకు ఉద్దానమే కేంద్రం. టెక్కలి డివిజన్‌లో తీర ప్రాంతం పొడవునా విస్తారంగా జీడి పంట సాగవుతోంది. 74 గ్రామాల పరిధిలో 1.05 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సుమారు 5 లక్షల క్వింటాల జీడి గింజలు ఉత్పత్తి అవుతుంది. ఈ ఏడాది జీడి పంట పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ మంచు ప్రభావంతో రైతులకు కడగండ్లు మిగిల్చే పరిస్థితులు కన్పిస్తున్నాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో జీడిపంట దిగుబడి భారీగా తగ్గుతుందనేది చెట్లను పరిశీలిస్తే తెలుస్తోంది. సకాలంలో వర్షాలు లేకపోవడంతో పూర్తి స్థాయి కాపు లేకుండా ప్రస్తుతం చెట్లు పూత దశలోనే ఉండిపోయాయి. అప్పుడే ఈ పూతకు పేను పురుగు పట్టి చిగుళ్ళను నాశనం చేస్తుండటంతో రైతులు పురుగు మందుల పిచికారీతో అష్టకష్టాలు పడుతున్నారు. పలాస నియోజకవర్గ పరిధిలోని సుమారు 23,237 ఎకరాల్లో జీడి పంట సాగుచేస్తున్నారు. పలాస మండలంలో 3,910 ఎకరాల్లో, వజ్రపుకొత్తూరు మండలంలో 11,345 ఎకరాలు, మందస మండలంలో 7,982 ఎకరాల్లో పంట పండిస్తున్నారు. ఈ పంట ఆధారంగా సుమారు 35 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. 20 వేల మంది జీడిపప్పు కర్మాగారాల్లో ఉపాధి పొందుతున్నారు.

జీడి మామిడి సాగులో దశలవారీ పూత, పిందె, కాయ, పండు వరకు ఉంటుంది. ఈ ఏడాది పూత దశలోనే ముప్పు ఏర్పడింది. సగానికి పైగా పూత రావాల్సి ఉన్నప్పటికీ చిగురు, మొగ్గ దశలోనే మంచు తెర కప్పుకొంటుంది. టీ దోమ చుట్టుముట్టడంతో పూత మాడిపోతుంది. పూత పిందె దశకు చేరకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జీడిమామిడి పూత సమయంలో సరైన వర్షం కురిస్తే జీడిపిక్కలు మంచిగా దక్కుతాయి. అప్పుడే జీడి చెట్లు అక్కడక్కడా ఎండిపోతున్నట్లు కన్పిస్తున్నాయి. గత ఏడాది జీడిపంటతో పోల్చితే ఈ ఏడాది పది శాతం కూడా చేతికి దక్కే పరిస్థితులు కన్పించడంలేదు. ఉద్దాన ప్రాంతంలో అధిక శాతం ఇసుక దిబ్బలు, మైదాన ప్రాంతంలో జీడి పంట సాగు చేస్తారు. పంట కాలం వస్తే ఇంటిల్లిపాదీ తోటల్లోనే ఉంటూ సస్యరక్షణ చర్యలు చేపడుతుంటారు. పూత దశలోనే ఇబ్బందులు ఎదురుకావడంతో పెట్టుబడులు పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు.

ఏటా రైతులకు నష్టాలే..

వాతావరణం అనుకూలిస్తే ఎకరా జీడి తోటలో 6 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. కొన్నేళ్లుగా ఒడిదుడుకులు ఎదురవడంతో 3 లేక 4 బస్తాల దిగుబడితో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఎకరాకు ఒక్కొక్కరు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతుంది. పెట్టుబడుల కోసం వ్యాపారుల వద్ద రైతులు వడ్డీలకు అప్పులు తీసుకుంటారు. దీంతో 80 కేజీల జీడి పిక్కల బస్తాలను కేవలం రూ.9 నుండి 10 వేల రూపాయలకు రైతులు విక్రయించాల్సిన పరిస్థితులు ఉంటాయి. అధిక ధరలు వచ్చేవరకు పిక్కలను నిల్వచేసుకునేందుకు గోదాములు లేకపోవడంతో మే, జూన్ నెలల్లోనే వ్యాపారులకు అమ్మేస్తుంటారు. గత ఏడాది జీడిపిక్కల ప్రారంభ ధర రూ.9 వేల నుంచి నేడు రూ.13 వేల వరకు స్థిరంగా ఉంది. దీంతో గతంలో జీడిపిక్కల అమ్మకాలు చేసిన రైతులు ఒక బస్తాకు నాలుగు వేల రూపాయల వరకు నష్టపోవాల్సి వచ్చింది.

జీడిపిక్కల మద్దతు ధర ప్రకటించాలి

ఉద్దానం రైతులు పండించే జీడి పంటకు మద్దతు ధర కల్పించాలంటూ జీడిపిక్కల సీజన్‌లో జీడి రైతాంగ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గత దశాబ్దాల కాలంగా ఈ ప్రాంతంలో రైతులు పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించకపోవడం విచారకరం. గిట్టుబాటు ధరలతోపాటు వ్యవసాయ కూలీ రేట్లు కూడా ఇక్కడ అమలుకావటంలేదు. రైతుల వద్ద జీడి గింజలు ఉన్నప్పుడు ధర లేకపోవడం, వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిన తర్వాత గణనీయంగా ధరలు పెరిగిపోవడం గత కొన్నేళ్ళుగా సాగు తున్న వ్యవహారం. ఇప్పటికైనా ప్రభుత్వం జీడి గింజలకు మద్దతు ధర ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.



రైలు దీక్షకు మద్దతు ఇవ్వండి

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో విశాఖ రైల్వే జోన్ కోసం 40 గంటలపాటు రైలు దీక్షకు మద్దతు కోసం రాష్ట్ర మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ విజ్ఞప్తికి విపక్ష పార్టీలు అండగా నిలిచాయి. విశాఖ పౌర గ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం వివిధ పార్టీల నేతలతో కలిసి కొణతాల విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు ఉత్తరాంధ్రా, రాయల సీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, ఉత్తరాం ధ్రను అటానమస్ ప్రకటించాలని, రైల్వేజోన్, ఎయిమ్స్, గిరిజన యూనివర్సిటీ ఇతర విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ రైలు దీక్ష తర్వాత ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా చేస్తామన్నారు. కొణతాలకు సీపీఐ నగర కార్యదర్శి ఎం పైడిరాజు, సీపీఎం నాయకులు నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్, బెహరా భాస్కరరావు, వైసీపీ నుంచి జితేంద్రరెడ్డి, బీజేపీ నుంచి కటిితి విశ్వనాధం, చలసారి బాబ్జి, లోక్‌సత్తా నుంచి బీశెట్టి బాబ్జిలు మద్దతు తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యపోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు



విశాలాంధ్ర- మదనపల్లె : రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. చిత్తూరుజిల్లా మదనపల్లెలో భారతీ య అంబేద్కర్‌సేన 5వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యాంగ రక్షణసభను పీటీయం శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ప్రజా గాయ కుడు గద్దర్ సమాజంలో కుల నిచ్చెనమెట్లు , సామా జికన్యాయం, అంటరానితనం, మనిషిని మనిషిగా చూడలేని సమాజం నుంచి, కుల వివక్షత నుంచి, దోపిడీ నుంచి, ఎలా ఐక్యంగా రాజ్యాధికారం సాధిం చాలో ఆట, పాటల రూపంలో చూపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ గవర్నర్ రాజ్యాంగ పరిరక్షణకు తూట్లు పొడుస్తూ తెలంగాణలో కేసీఆర్‌ను, ఏపీలో చంద్రబాబునాయుడును పొగడ్తల తో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తెలుగు రాష్ట్రాలలో దళితులపై, క్రిస్టియన్లపై ఎలాంటి దాడి జరుగుతున్నదో కేంద్ర ప్రభుత్వానికి తెలియజే యకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సామా జికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తమ వాటాను దక్కించు కోవడానికి ఐక్య పోరాటాలకు మదనపల్లె వేదికగా జరిగిన రాజ్యాంగ రక్షణసభ స్ఫూర్తి కానున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో 45మంది ముస్లిం, క్రైస్తవ ఉద్యోగులను బీజేపీ ఒత్తిడి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలగిస్తూ జీఓలను విడుదల చేశారని విమర్శిం చారు. రాష్ట్రంలో లక్షా 40వేల ఉద్యోగాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరులో ఫిబ్రవరి 26న లక్షమందితో రాజ్యాంగ రక్షణసభను నిర్వహించనున్నామన్నారు. వీసీకే పార్టీ జాతీయ అధ్యక్షుడు తిరుమాలవన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచి హిందూ రాజ్యంగా మార్చడానికి మత ఘర్షణ సృష్టిస్తోందని విమర్శించారు. ప్రపంచంలో ఏ దేశం లోనూ మతాలు, కులాలు లేవని భారతదేశంలో మాత్రమే కులాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. అలాంటి వారిని తరిమికొట్టి రాజ్యాంగాన్ని రక్షించుకుం టామన్నారు.

ఈ కార్యక్రమంలో పీటీయం శివప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్‌లో వీసీకే పార్టీతో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వేముల రోహిత్ తల్లి వేముల రాధా, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌భాషా, వైసీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి షమీమ్‌అస్లాం, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వినోద్‌కుమార్, మునిస్వామి, సూర్యప్రకాష్, సాగర్, ప్రొఫెసర్ శివప్రసాద్, గిరిజన నాయకులు మోహన్‌కందా, అంబేద్కర్ అధ్యయన కేంద్రం పరిశీలకుడు దయాకర్, కా॥ క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వైసీపీలో లుకలుకలు

అభ్యర్థుల ఎంపికపై ఆశావహుల్లో ఆందోళన

విశాలాంధ్ర - విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వైసీపీ తరఫున ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న నేతల్లో ఆందోళన పెరుగు తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలకు ఆయా స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందో లేదోనన్న అయోమ యం కనిపిస్తోంది. పార్టీలో అంతర్గతంగా కుమ్ములాటలు అలజడి సృష్టిస్తున్నాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఉత్తర నియోజకవర్గంలో ముగ్గురు సమన్వయకర్తలు ఉండటంతో నేతల మధ్య సమన్వయలోపంతో విభేదాలు తారాస్థాయికి చేరాయి. ముగ్గురిలో ఒక్కరినే సమన్వయకర్త చేయాలనే డిమాండ్ కార్యకర్తల నుంచి పెరుగుతోంది. దీంతో ఎవరి స్థాయిలో వారు పార్టీ అధినేత జగన్ వద్ద గోడు వినిపించు కోవడంతో ఈ పంచాయితీ విశాఖ జిల్లా బాధ్యులైన ఎంపీ విజయసాయిరెడ్డి వద్దకు చేరింది. ఆయన నచ్చజెప్పి పంపించినప్పటికీ ఇటీవల మళ్ళీ వివాదం తలెత్తడంతో పార్టీ అధినేత జగన్ దృష్టికి వెళ్లింది. ఈ సమస్య పరిష్కార బాధ్యత లను ఆయన వైసీపీ నగర అధ్యక్షులు మళ్ల విజయ్‌ప్రసాద్‌కు అప్పగించారు. ముగ్గురిని కూర్చోబెట్టి సమన్వయంతో జాగ్రత్తగా నడుచుకోవాలని బుజ్జగించారు. గతంలో ఈ నియోజకవర్గ సమన్వయకర్తగా తైనాల విజయ్‌కుమార్ పనిచేశారు. ఆయనకు విశాఖ పార్లమెంటు నియోజకవర్గం బాధ్యతలు అప్పగించారు. దీంతో మూడు నెలల క్రితం ఉత్తర నియోజకవర్గానికి సత్తి రామకృష్ణారెడ్డి, చంద్రమౌళి, ఉషాకిరణ్‌లను సమన్వయ కర్తలుగా నియమిం చారు. నియోజకవర్గంలోని 13 వార్డుల్లో పార్టీ వార్డు అధ్యక్షుల అభిప్రాయం సేకరించారు. కొందరు చంద్రమౌళిని వ్యతిరేకించగా, మరికొందరు ఉషాకిరణ్ పట్ల వ్యతిరేకత చూపిస్తున్నారు. జీవీఎంసీ ఎన్నికలు వస్తే కార్పొరేటర్ అభ్యర్థులను ఎవరు ఎంపిక చేస్తారని నేతలు ప్రశ్నిస్తున్నారు. వార్డు అధ్యక్షుల మధ్య సమన్వయ లోపంతో విభేదాలు తలెత్తడంతో ఇటీవల మీడియా ఎదుట ఇది కుటుంబ సమస్య లాంటిదని నేతలు తేల్చేశారు. ముగ్గురు నియోజకవర్గ సమన్వయకర్తలు ఉండటంతో ఇప్పటినుంచి సీటు అంశం ప్రధాన చర్చనీయాంశమైంది. కొత్తవారు తెరపైకి వచ్చే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం

విశాలాంధ్ర-ధర్మవరం టౌన్ : అనంతపురం జిల్లా ధర్మవరం నియోజక వర్గంలోని బత్తలపల్లి మండలం మాల్యా వంతం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో రైతు చంద్రశేఖర్ (30), మెకానిక్ మధు (29) మృతి చెందారు. బోరు మరమ్మతులో భాగంగా నీటిపైపులు పైకి తీసే సమయంలో విద్యుత్‌వైరు తాకడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కురుబ రాముడుకు చెందిన పొలంలో శుక్రవారం మరమ్మతు చేస్తున్నారు. బోరు మోటారును పైకితీస్తుండగా పక్కనున్న లెవెన్ కేవీ లైన్‌కు తగలడంతో ఇద్దరూ విద్యుదాఘాతానికి గురయ్యారు. చంద్రశేఖర్ అక్కడికక్కడే మరణించారు. మధు ఆస్పత్రికి తరలిస్తుండగా కన్ను మూశారు. రాముడును పక్కపొలంలోని రంగనాథ్ కర్రతో పక్కకు తీయగా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రూరల్ ఎస్సై హరూన్‌భాష ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద తీరును పరిశీలించారు. కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలూ బహుపరాక్..!!

మేకవన్నె పులులున్నాయ్...



విశాలాంధ్ర-చోడవరం : మహిళల అమాయకత్వం వారి మాన ప్రాణాలపైకి వస్తోంది. వివాహిత మహిళలు, యువతులను నమ్మకంగా చేరదీసినవారే చెరబడుతున్నారు. నమ్ముకుని ఆశ్రయిస్తే అయినవాళ్లే కాటేస్తున్నారు, అత్యాచారాలకు ఒడిగడుతున్నారు. రేపిస్టులంతా తెలిసినవారే కావడం విస్మయాన్ని కల్గిస్తుంది. తెలిసినవాళ్లని, కుటుంబ మిత్రులని, స్నేహంగా ఉన్నారని చనువిచ్చారో... ఆయా మహిళలు లైంగిక వేధింపులు, అత్యాచారాలకు గురికాక తప్పడం లేదు. కాబట్టి మారుతున్న నేటి సమాజంలో మహిళలు ఎంతో జాగ్రత్తగా ఉండాలని, మగాళ్ల క్రూరత్వానికి బలికావద్దని, అప్రమత్తంగా మెలగాలని ఎన్‌సీఆర్‌బీ సూచిస్తోంది. 2016లో మహిళలపై జరిగిన అత్యాచారాలపై జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. దేశం మొత్తమ్మీద 38,947 అత్యాచార కేసులు నమోదయ్యాయి. మహిళలపై అత్యాచారాల్లో 4882 కేసులతో మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. ఏపీలో నమోదైన 994 కేసుల్లో 994 కేసుల్లో తెలిసిన వారే అత్యాచారానికి పాల్పడ్డారు. ఆరు కేసుల్లో తాత లేదా తండ్రి లేదా సోదరుడు, కుమారుడు, 29 కేసుల్లో కుటుంబ సభ్యులు, 44 కేసుల్లో బంధువులు, 361 కేసుల్లో ఇరుగుపొరుగువారు ఉన్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌లో కేవలం అయిదుగురు మహిళలు తెలిసిన వారి చేతుల్లోనే అత్యాచారానికి గురై దేశంలో అతితక్కువ కేసులతో మంచి రాష్ట్రంగా నిలిచింది. ఆకర్షణతోనో, మంచివారనో, తెలిసినవారే కదా అని చేరదీస్తే మొదటికే మోసపోయి, అత్యాచారంతో బాటు ప్రాణాలు కూడా పోయే ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని ఎన్‌సీఆర్‌బీ హెచ్చరిస్తోంది. మారుతున్న నాగరికతలో సెల్ ఫోన్ల ప్రభావం మహిళలపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతోంది. ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌ల ప్రభావంతో తెలియనివారి పట్ల కూడా మహిళలు ఎక్కువ ప్రేమ చూపి, ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారంటూ ప్రజా సంఘాలు చెబుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు, ఆత్మీయ అనురాగాలు కరువవడంతోను, పాశ్చాత్య పోకడలతో, విష సంస్కృతుల ప్రభావంతో మహిళలపై దాడులు జరుగుతున్నాయనేది వాస్తవం. ఈ నేపథ్యంలో స్వీయ రక్షణకై మహిళలు తమ అంతర్మథనంలో, తామేం చేస్తున్నామని, ఎలా ఉన్నామనేది కూడా ఆలోచించాల్సి ఉందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాస్వామ్య రక్షణకు

యువత కృషి చేయాలి : పుల్లూరు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: 69వ గణతంత్ర వేడుకలు శుక్రవారం లోక్‌దళ్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. పార్టీ అధ్యక్షుడు పుల్లూరు వెంకటరాజేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ మహనీయుడని శ్లాఘించారు. కుల, మతాలకు, భాషలకు నిలయమైన భారతదేశం గొప్పదన్నారు. ఎందరో మహానుభావులు పోరాడి సాధించిన స్వాతంత్ర్య ఫలాలు అంద రికీ సమానంగ అందాలన్నారు. పార్లమెంట్ ప్రజాస్వామ్య రక్షణకు యువత కృషి చేయాలని కోరారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు అన్ని వర్గాలకు అందాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసంతి, సంకీర్త్, రేవంత్‌రెడ్డి, భూమయ్య పాల్గొన్నారు.

బూటకపు వాగ్దానాలతో కేసీఆర్ మోసం : కనుకుల

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వాగ్దానాలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా విఫలమ య్యారని మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు బూటకపు వాగ్దానాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ నాలుగేళ్ల పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదన్నారు. చైనా, కొరియా, జపాన్ దేశాల్లో పర్యటించిన మంత్రి కేటీఆర్ రాష్ట్రానికి ఒక్క కొత్త పరిశ్రమనూ తీసుకురాలేదని ఆరోపించారు. కేటీఆర్ పర్యటన వల్ల ఎన్ని పరిశ్రమలు వచ్చాయి...ఎంతమందికి ఉపాధి కల్పించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండు చేశారు. పరిశ్రమలు వస్తున్నాయని గొప్పలు చెప్పడమే తప్ప ఆచరణలో కనిపించడం లేదన్నారు. ఒక పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదని అన్నారు. అక్రమ సంపాదనను విదేశీల్లో దాచుకునేందుకే కేటీఆర్ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగులను ఈ ప్రభుత్వం మోసం చేసిందని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు.

అటకెక్కిన స్వచ్ఛత

- సీఎం ఇంటి పక్క పొలాలకే దిక్కులేదు
- పూల తోటలో మలమూత్ర విసర్జనలు
- అడుగుపెట్టే అవకాశం లేక తోటలు పీకేస్తున్న రైతులు
- మల,మూత్రశాలలు లేక సిబ్బంది పాట్లు
- నష్టం చవిచూస్తున్న ఉండవల్లి రైతులు



పీకేసిన గులాబీ తోట..

విశాలాంధ్ర-అమరావతి : ముఖ్యమంత్రి నివాసం వద్ద స్వచ్ఛభారత్ అటకెక్కింది. బహిరంగ మలమూత్ర విసర్జ న స్వేచ్ఛారాజ్యంగా మారింది. సీఎం బందోబస్తు నిమిత్తం వచ్చే పోలీసులు ,అధికారుల సహాయకులు మౌలిక వసతులు లేక భద్రతా సిబ్బంది నానా అగచాట్లు పడుతు న్నారు. పంట పొలాల మధ్యలో కాలకృత్యాలు తీర్చుకుం టుండటంతో రైతులకు కొత్త కష్టాలు తెస్తున్నాయి.పూల తోటల నడుమ, అరటి తోటల మధ్యన ఇష్టానుసారం మూత్ర విసర్జన్లు చేయటంతో పంటలను వదిలివేయాల్సిన పరిస్థితిని తీసుకొస్తుంది.వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు పండించిన రైతులు పంటలు పూర్తి కాకుం డానే నరికి వేసుకోవాల్సిన ఇబ్బందికర పరిస్థితులు ఎదు ర్కొంటున్నారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం దగ్గర ఏ కార్యక్రమం నిర్వహించినా, వేకువజాము నుంచే భద్రతా బలగాలు బందోబస్తులో నిమగ్నమవుతు న్నాయి. ఈ క్రమంలో వారికి ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవటం ఇబ్బందికరంగా మారింది. దీనితో పోలీసులు ఇతర సిబ్బంది గత్యంతరం లేని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి ఇంటికి దిగువ భాగంలో ఉన్న పంట పొలాల్లో కాలకృ త్యాలు తీర్చుకుంటున్నారు. ఈ నెల 18 ,19 తేదీల్లో తొలిసారిగా రాజధానిలో సీఎం ఇంటి పక్కన కలెక్టర్ల సమావేశం నిర్వహించారు. సమావేశం అయితే నిర్వ హించారే గాని వచ్చిన సిబ్బందికి సదుపాయాలు కల్పించ లేకపోయారు. అధికారుల వెంట వచ్చిన సహాయకులు ,డ్రైవర్లు, ఇతర సిబ్బందికి కనీసం కూర్చునే ఏర్పాట్లు కూడా చేయకపోవడంతో వారి పాట్లు అన్ని ఇన్ని కావు. భోజన వసతి అయితే ఏర్పాటు చేస్తున్నారు గాని ఇతర వసతుల విషయంలో నిర్లక్ష్యం కనబరుస్తున్నారు.అయితే ఇక్కడే అసలు ఇక్కట్లు ఆరంభం అవుతున్నాయి.రైతుల పంట పొలాలే ఆధారంగా మారుతున్నాయి. సీఎం ఇంటి దగ్గర రైతులు ప్రధానంగా పూల తోటలే సాగు చేసు కుంటూ, వాటిపైన ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన భూసమీకరణలో సైతం ఈ రైతులు ఏ ఒక్కరు తమ పంట పొలాలు ఇవ్వలేదు. కోర్టుని ఆశ్రయించి పోరాటం చేస్తున్నారు.అయితే పంట పొలాల నడుమ ఒక్కటీ, అరా భూములు ల్యాండ్ పూలింగ్‌కి ఇస్తే వాటిలో పార్కింగ్ తదితర అవసరాల నిమిత్తం యాష్ పౌడర్ చల్లి పంట భూముల్ని పంటల్ని పాడు చేస్తున్నారు. ఇటీవల సీఎం ఇంటి దగ్గర వరుస క్రమంలో సమావేశాలు జరగడంతో సమీపంలోని పంట పొలాలన్నీ దారుణంగా తయారయ్యాయి.అక్కడ పని చేసేందుకు వ్యవసాయ కూలీలు ముందుకు రావడం లేదు. దీంతో రైతులు మరో మూడు నెలల గడువు ఉండగానే పూల తోటలను నేలమట్టం చేస్తున్నారు .కొందరు తమభూములలో పంట పండించిన రైతులు కాగా, మరికొందరు కౌలు రైతులు ఉన్నారు. పెట్టిన పెట్టు బడి రాకపోగా అప్పులు చవి చూడాల్సి వస్తుందని బాధిత రైతులు వాపోతున్నారు.వారి ఇక్కట్లు వారి మాటల్లోనే...

గులాబీ తోట వాడిపోయింది.. కాలకృత్యాలకి నెలవైంది..



50 వేల రూపాయలతో పెట్టుబడి పెట్టి గులాబీ తోట వేశాను.మంచి పూలతోట కోసం సుదూర ప్రాంతాల నుంచి మొక్కలు తెచ్చి పండించా.ఒక్కొక గులాబీ మొక్క 12 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశాను. మొత్తంగా పెట్టుబడి ,కౌలు కలిపి 50 వేల రూపాయల వరకు ఖర్చవుతుంది. ముఖ్యమంత్రి సమావే శాలకి బందోబస్తు కోసం వచ్చిన వారు మాలమూత్రాల విసర్జన చేయటం ఎక్కువైపోయింది. ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితిలో మార్పు రాలేదు.అదీకాక కంకర బూడిద పూల తోటపై పడి గులాబీ పువ్వులన్ని పాడై పోయాయి. వ్యవసాయ కూలీలు ఆయన మహిళలు మలమూత్ర విసర్జనలు చేసిన తోట లో పని చేసేందుకు రావడం లేదు. చేసే దేమీ లేక పూల తోటని పీకేశా. అంతా నష్టమే. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు స్పందించి మా పట్ల జాలి చూపాలి. సిబ్బందికి మరుగు దొడ్లు నిర్మించాలి. ఇలా ఎందరో రైతులు పూల తోటల ను, అరటి తోటలను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-వాసా సాంబశివరావు రైతు (ఉండవల్లి ముఖ్యమంత్రి నివాసం దగ్గర)

మరుగు దొడ్లుగా మా పొలాలు మారాయి..



నేను కౌలు పొలం చేసుకునే రైతుని, అప్పులు చేసి వ్యవ సాయం చేసుకు ంటున్నా. నా పొలం పక్కనే భూమిని భూసే కరణకు ఇచ్చారు. అందులో కంకర బూడిద పోసి తాత్కాలిక రహదారి నిర్మించడంతో బూడిద అంతా పూల తోటపై పడి పంట పొలం పూర్తిగా వాడిపోయింది.ఇక తోటను తవ్వి వేయటం తప్ప మరో మార్గం లేదు.రావులపాలెం సమీపంలోని కడుపు లంక నుంచి రంగు రంగుల చామంతి మొక్కలను తీసుకొచ్చి రేయింబవళ్లు కష్ట పడి సాగు చేస్తున్నా.కౌలు 20 వేల రూపాయలు,పెట్టుబడి 30 వేల రూపాయలు,మొత్తం 50 వేల రూపాయల పైమాటే.పెట్టిన పెట్టుబడి రాకపోగా నష్టం చవి చూస్తున్నాం.ఏప్రిల్ మాసం వరకు పూలు పూసి లాభం ఇస్తాయి.చివరి మూడు నెలలే కీలకం, అటువంటి సమయంలో తోటని పండించే చేతులతో పీకి పారేయాల్సిన పరిస్థితి రావటం దుఃఖాన్ని తెప్పిస్తుంది. మరుగు దొడ్లుగా మా పూల తోటలు మారటం శోచనీయం. మలమూత్ర విసర్జనలతో భద్రత సిబ్బంది పంట పొలాలు తీవ్రంగా నాశనం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పెద్ద మనసుతో అర్థం చేసుకొని రైతుల ఇబ్బందులు తొలగించాలి.

గోపాలం శంకర్..రైతు (ముఖ్యమంత్రి నివాసానికి దిగువ భాగాన పూల తోట)

నేటి నుంచి అనంతలో

జనసేనాని కరవు యాత్ర

మూడు రోజులపాటు ఐదు నియోజకవర్గాల్లో పర్యటన



విశాలాంధ్ర ప్రతినిధి- అనంత పురం: జనసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అనంతపురం జిల్లాలో చేపట్ట నున్న కరవు యాత్ర శనివారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మూడు రోజుల పాటు ఆయన పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. దీంతో పాటు యాత్ర ప్రారంభం కానున్న మొదటిరోజు జనసేన జిల్లా కార్యాలయానికి సంబంధించి భూమి పూజ నిర్వహించి అనంతరం యాత్ర ప్రారంభించనున్నట్లు సమాచారం. మొదటిరోజు శనివారం ఉదయం 11.20 నుంచి 11.30 గంటల మధ్య భూమి పూజ నిర్వహించనున్నారు. అనంతరం అక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 2.30 నుంచి 5.30 వరకూ రైతు సదస్సు నిర్వహించే ప్రాంతానికి చేరుకుంటారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ స్థానికంగా ఉన్న నాయకులు, పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఇక ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు అనంతపురం నుంచి బయలుదేరి 11 గంటలకు కదిరికి చేరుకుంటారు. 11 నుంచి 12 గంటల వరకూ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ఆలయంలోనే గడుపుతారు. 12 గంటల నుంచి ఒంటి గంట వరకు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కరవు అంశాలపై ప్రసంగిస్తారు. అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుని హనుమాన్ జంక్షన్ వద్ద గుమికూడిన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం పుట్టపర్తిలో ఉన్న మందిరాన్ని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని, వాటర్ ప్రాజెక్టును సందర్శిస్తారు. రాత్రికి పుట్టపర్తిలోనే బస చేస్తారు. సోమవారం ఉదయం 8 గంట లకు పుట్టపర్తి నుంచి నేరుగా ధర్మవరం చేరుకుంటారు. అక్కడ ఉదయం 10 గంటలకు నేరుగా మీటింగ్ హాలుకు చేరుకుని చేనేత సమస్యలపై ప్రసంగిస్తారు. అనంతరం 11.30 గంటలకు నేరుగా హిందూపురం బయలుదేరి వెళతారు. మధ్యాహ్నం రెండు గంటలకు హిందూపురంలో ఏర్పాటు చేసిన మీటింగ్ ప్రదేశానికి చేరుకుంటారు. రెండు గంటల నుంచి మూడు గంటల వరకు జన సైనికుల కార్యకర్తలతో సమావేశమవుతారు. అనంతరం అక్కడ నుంచి 3.30 గంటలకు చిక్‌బళ్లాపూర్‌కు వెళతారు. అక్కడ నుంచి బెంగళూరుకు చేరుకుని అక్కడ నుంచి హైదరాబాదు వెళతారు.



సామాజిక న్యాయంలో

రాజ్యాంగం పాత్ర మహోన్నతం

రిపబ్లిక్ డే వేడుకల్లో జగన్

విశాలాంధ్ర- నెల్లూరుబ్యూరో : భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని చట్టబద్ధ పాలనను నిలబెట్టడంతోపాటు పౌరహక్కులను పరిరక్షిండంలో సామాజిక న్యాయాన్ని అందించడంలో రాజ్యాంగం మహోన్నత పాత్ర పోషించిందని, ఒక రక్షణ కవచంగా నిలిచిందని వైఎస్ జగన్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రజా సంకల్ప యాత్రలో ఉన్న వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఓజిలి మండలం నగుటూరులో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగు టూరులో జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం జగన్ పాదయాత్రకు విశ్రాంతి ఇచ్చారు. అనంతరం జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగ రచనకు కృషి చేసిన మహనీయులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు విశ్వవ్యాప్తంగా ఉన్న భారతీయులకు వైఎస్ జగన్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, జెడ్.పి చైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు అభినందనలు: పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన బ్యాడ్మింటన్ ప్లేయర్ కె.శ్రీకాంత్‌కు జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మరెన్నో అత్యున్నత అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

రాజ్యాంగ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరాలి

వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

విశాలలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ్యాంగ ఫలాలు అట్టడుగు వర్గాలకు చేరిన ప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని వైసీపీ కృష్ణాజిల్లా రీజనల్ కో-ఆర్డి నేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.విజయవాడలోని వైసీపీ రాష్ట్ర కార్యాల యంలో శుక్రవారం 69వ గణతంత్ర్య దినోత్స వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. ఈ నెల 29వ తేదీతో వైసీపీ అధినేత జగన్ చేపట్టిన పాదయాత్ర 29 కిలోమీటర్లు పూర్తవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అధి కార ప్రతినిధులు కొలుసు పార్థసారథి, సామినేని ఉదయభాను, ఎమ్మెల్యేలు కొక్కిలి గడ్డ రక్షణనిధి, మేకా ప్రతాప్ అప్పారావు, వైసీపీ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్‌పై అఖిలపక్షం

కేసీఆర్‌కు చాడ లేఖ



విశాలాంధ్రబ్యూరో-హైదరాబాద్: మల్లన్న సాగర్ రిజర్వాయర్ పరిధి లో వేములఘాట్ గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించి ఆందోళనకు తెరదించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. వేములఘాట్ ప్రజలు 600 రోజు లుగా తమ న్యాయసమ్మతమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాక రమన్నారు. కాళే శ్వరం ప్రాజెక్టులో భాగంగా మల్లన్న సాగర్ రిజర్వాయర్‌ను 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించతలబెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం తప్పు పట్టిందని, పార్టీలు, ప్రజాసంఘాలు వ్యతిరేకిస్తు న్నాయన్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయరు సామర్థ్యం పెంపుపై నష్టపరిహారం తదితర అంశాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అందులో ఇంజనీరింగ్ నిపుణులు, అందరి సలహాలు, సూచనలు తీసుకొని నష్టనివారణకు తగు చర్యలు తీసుకోవాలని చాడ తన లేఖలో పేర్కొన్నారు. రిజర్వాయరు సామ ర్థ్యాన్ని 5 టీఎంసీలకు కుదించగలిగితే ముంపు తగ్గుతుందని, ప్రజలకు ఇబ్బందులుండవని చాడ వెంటరరెడ్డి అభిప్రాయపడ్డారు.

మోడీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్యంపై గౌరవం లేని వైనం
- గవర్నర్, ఇద్దరు చంద్రుల రాజ్యాంగ ఉల్లంఘన
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



విశాలాంధ్ర-మదనపల్లె : దేశంలోని అన్ని వ్యవస్థలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిర్వీర్యం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం మదనపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమాజంలో అసంతృప్తి పెరిగిపోయింద న్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఆ కోర్టు జడ్జిలే విలేకరుల సమావేశంలో ఆరోపణలు గుప్పించారని అన్నారు. దేశంలోని అతిపెద్ద 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం లక్షా 78 వేల రూపాయల కుంభకోణం జరిగిందని స్వయంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మోడీ ఆరోపించారని తెలిపారు. అలాంటి కేసును తమిళనాడులో రాజకీయాలను బీజేపీకి అనుకూలంగా మార్చుకోవడానికి కేసుల్లో జైలుకు వెళ్ళిన కనిమొళి, రాజాలను నిర్దోషులుగా విడుదల చేయించిన ఘనత మోడీకే దక్కిందన్నారు. రాజకీయ ప్రత్యర్థి, బీహార్ మాజీ సీఎం లాలూప్రసాద్‌ను రాజకీయంగా అనుకూలంగా లేరని జైలుకు పంపారన్నారు. వామపక్ష, హేతువాద భావజాలం కలిగిన వ్యక్తులు, మేధావులు, కవులు, రచయితలు, జర్నలిస్టులు, కళాకారులపై బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగదళ్, విశ్వహిందూ పరిషత్, అనుబంధ సంఘాలు దాడులకు పాల్పడి 28 మందిని దారుణంగా హత్య చేశారని పేర్కొన్నారు. దళితులు, మైనార్టీలపైన గోవధ పేరుతో దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కేరళ ముఖ్యమంత్రిని హత్య చేస్తే కోటి రూపాయలు నజరానా ఇస్తామని ప్రకటించడం అంటే మోడీకి ప్రజాస్వామ్యంపైన, న్యాయవ్యవస్థపైన విశ్వాసం లేదని రామకృష్ణ అన్నారు. చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డిలను ఇద్దరినీ కేసులతో భయపెట్టించి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోడీ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్, తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని అన్నారు. శు క్రవారం గవర్నర్ విందుకు ఆహ్వానం పంపినా దాన్ని తిరస్కరిస్తూ గవర్నర్‌కు లేఖ పంపినట్లు ఆయన వివరిం చారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పట్టపగలే దోచుకుంటున్నారని ఆరోపించారు. దీనికి గవర్నర్ వంత పాడుతూ అటు చంద్రశేఖర్‌రావును, ఇటు చంద్రబాబు నాయుడును పొగడ్తలతో ముంచెత్తుతు న్నారని విమర్శించారు. పార్టీ ఫిరాయింపు నకు పాల్పడిన 28 మంది ఎమ్మెల్యేలలో నలుగురికి మంత్రి పదవులు ఇచ్చిన వారితో గవర్నర్ ప్రమాణస్వీకారం చేయించి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అభాసు పాలు చేస్తున్నారని అన్నారు. వీటన్నింటిపైన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై కలిసొచ్చే లౌకిక ప్రజాతంత్ర వామపక్ష పార్టీలతో పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. పవన్ కళ్యాణ్ కూడా కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రజలలోకి రావడాన్ని ఆహ్వానించారు. రాష్ట్రంలోని 25 మంది పార్లమెంట్ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులు ఒకేసారి లేచి గట్టిగా డిమాండు చేస్తే ప్రత్యేక హోదా విభజన హామీలు జరుగుతాయన్నారు. పవన్ కళ్యాణ్ అగ్రిగోల్డ్, చేనేత సమస్యలు, ప్రత్యేక హోదాలపై వామపక్షాలతో కలిసి పోరాడుతున్నారని తెలిపారు. ఈ కార్య క్రమంలో సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి రామానాయుడు, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి క్రిష్ణప్ప, తంబళ్ళపల్లి నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, విద్యార్థి సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షుడు డి.వి.రమణ పాల్గొన్నారు.

గవర్నర్ అంటే ఇంత చులకనా !

రాజకీయ నేతల టార్గెట్‌గా నరసింహన్



విశాలాంధ్ర-అమరావతి : గవర్నర్ రాజ్యాంగ పదవి. రాష్ట్రంలో ఆ పదవిలో ఉన్నవారు ప్రథమ పౌరుడు. గవర్నర్ రాష్ట్ర పాలనను పర్యవేక్షిస్తుంటారు. విశ్వవిద్యాల యాలకు ఛాన్సలర్‌గా వ్యవహరిస్తుంటారు. రాజకీయలకు అతీతంగా ఉంటారు. అంత అత్యున్నత పదవి ప్రస్తుతం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో చులకనగా మారింది. ఉమ్మడి తెలుగురాష్ట్రాల గవర్నర్‌గా ఉన్న ఈఎస్ఎల్.నరసింహన్‌ను రెండు రాష్ట్రాలలోని ప్రధాన రాజకీయ పార్టీల నేతలు తీవ్రపదజాలంతో విమర్శిస్తున్నారు. ఈ తరహా విమర్శలు గతంలో ఉన్న గవర్నర్‌లు ఎదుర్కోలేదు. ఎన్టీఆర్ తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఆయనను ఆ పదవి నుండి బర్తరఫ్ చేసిన అప్పటి గవర్నర్ రామ్‌లాల్ పదవి కోల్పో వాల్సి వచ్చింది. అయితే శాసనసభలో ఎన్టీఆర్‌కు బలం ఉన్నా కూడా ఆయనను పదవి నుండి తొలగించి బలంలేని నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిని చేసినందుకు అభాసుపాలయ్యారు. ఆ తర్వాత గవర్నర్‌గా వ్యవహ రించిన కుముద్‌బెన్ జోషి రాజ్‌భవన్‌లో వివాహాలు జరిపించినందుకు ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గవర్నర్ల వ్యవస్థపై విరుచుకపడ్డారు. సహజంగా రాష్ట్ర గవర్నర్లతో పాలనపరమైన అంశాలతో రాజకీయ పరమైన అంశాలలో ముఖ్యమంత్రులకు, గవర్నర్లకు బేధాభి ప్రాయాలు తలెత్తుతాయి. దివంగత తమిళనాడు ముఖ్య మంత్రి జయలలితకు సంబంధించిన అవినీతిపై న్యాయ వాది సుబ్రహ్మణ్యస్వామి అప్పటి గవర్నర్ మర్రి చెన్నారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును గవర్నర్ అనుమతించ టంతో ఆ తర్వాత జయలలిత కోర్టులో శిక్షపడి రెండుసార్లు జైలుకుపోయి పదవి కోల్పోవాల్సి వచ్చింది. చెన్నారెడ్డి నిర్ణయం పూర్తిగా రాజకీయ వ్యతిరేకతతో చేసినదేనని అప్పటి జాతీయ నాయకులు వ్యాఖ్యానించారు. అయితే పై సంఘటనలకు ఆ గవర్నర్లు చేసిన చర్యలకు, ఆరోపణలకు ప్రస్తుత గవర్నర్ నరసింహన్ ఎదుర్కొంటున్న విమర్శలకు పొంతనే లేదు. నరసింహన్‌ను విమర్శిస్తున్నవారు రాజకీయ నేతలే. రెండు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కేసీఆర్‌లు గవర్నర్‌తో ఇప్పటివరకు విబేధించలేదు. గవర్నర్ ఇద్దరు ముఖ్యమంత్రులతో సన్నిహిత సంబంధాలు సాగిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 25/8 గంటలు శ్రమిస్తున్నారని బుధవారం ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పనితీరును ప్రశంసించారు. గవర్నర్ హోదాలో ముఖ్యమంత్రిని ప్రశంసించవచ్చు, ముఖ్యమంత్రి నిర్ణయాలు తప్పనిపిస్తే ఆక్షేపించనూ వచ్చు. అది గవర్నర్ పదవిరీత్యా వచ్చిన అధికారం. అయితే గవర్నర్ ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశంసించటాన్ని రాజకీయ పార్టీల నేతలు తప్పుబట్టారు. గవర్నర్ నరసింహన్ తెలుగుదేశం ప్రచార కమిటీకి అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారని వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. ఏపీలో రాజ్యాంగం అపహాస్యం పాలవుతున్నా గవర్నర్ పట్టించుకోవటం లేదని విమర్శలకు దిగారు. తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులను పొగిడే పనిలోనే గవర్నర్ ఉన్నారని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి కూడా గవర్నర్‌ను విమర్శించారు. శు క్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగే ఎట్‌హోమ్ కార్యక్రమాన్ని తెలంగాణ కాంగ్రెస్ నాయకులు బహిష్కరించారు. కొద్ది రోజుల క్రితం నాలా బిల్లుకు ఆమోదం తెలపలేదని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు గవర్నర్‌ను నిందించారు. ఆయన తెలంగాణ పక్షపాతి అని ఆరోపించారు. అవసరమైతే రాష్ట్రపతి, ప్రధానమంత్రులు ఫిర్యాదు చేస్తానని బహిరంగంగానే చెప్పారు. నాలా బిల్లు వ్యవహారంలో కొన్ని సూచనలను చేస్తూ వాటికి ప్రభుత్వాన్ని గవర్నర్ వివరణ కోరితే దానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి చెందిన విష్ణుకుమార్‌రాజు గవర్నర్‌ను అంతగా విమర్శించటంలో ఆంతర్యం ఎవరికీ అంతుబట్టలేదు. ఆ వ్యవహారంలో గవర్నర్ కోరిన విధంగా ప్రభుత్వం వివరణ ఇవ్వటం, నాలా బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపటం జరిగింది. అదే సమయంలో ఆంధ్ర రాష్ట్రానికి నూతన గవర్నర్‌ను నియమించాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ కె.హరిబాబు కేంద్ర హోంశాఖా మంత్రిని స్వయంగా కలిసి లేఖ అందించి మీడియాకు వదిలారు. ఈ వ్యవహారం అటు ఢిల్లీ, ఇటు తెలుగు రాష్ట్ర రాజకీయవర్గాల్లో సంచలనం కలిగించింది. తొలిసారి గవర్నర్‌గా తెలంగాణ రాష్ట్రంలో టీడీపీ నుండి టీఆర్ఎస్‌లో చేరిన శ్రీనివాసయాదవ్‌ను మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించినందుకు రాజకీయపార్టీల నేతలు ఆయను తప్పుబట్టారు. తొలిసారి గవర్నర్‌పై తెలంగాణ టిడిపి నేతలు విమర్శలకు దిగారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనను టార్గెట్ చేశారు. ఏపీలో చంద్రబాబు గత ఏప్రిల్‌లో మంత్రివర్గ విస్తరణ చేసిన సమయంలో వైసీపీ నుండి టీడీపీలోకి పార్టీ ఫిరాయించిన నలుగురుతో మంత్రులుగా గవర్నర్ నరసింహన్ ప్రమాణస్వీకారం చేయించి మరోసారి విమర్శలపాలయ్యారు. ఆ సమయంలో పార్టీ ఫిరాయింపుల అంశం స్పీకర్‌కు సంబంధించిన అంశంగా అధికారులు వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమితులైన నరసింహన్ ఐపీఎస్ అధికారిగా వివాద రహితుడుగా పేరుపొంది ఈ పదవిలోకి వచ్చారు. యుపీఏ హయాంలో గవర్నర్‌గా నియమితుడైన నరసింహన్ రాష్ట్ర విభజన ప్రక్రియను చట్ట ప్రకారం సజావుగా ముగించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మోదీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలకు ఆయననే గవర్నర్‌గా కొనసాగించింది. గత ఏప్రిల్‌తో పదవీకాలం ముగిసినా ఆయనను తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు గవర్నర్‌గా కొనసాగాలని కేంద్రం ఆదేశించింది. దీన్ని బట్టి నరసింహన్‌పై కేంద్రానికి విశ్వాసం ఉన్నట్లు స్పష్టమవుతోంది. అయితే గవర్నర్ ఏది మాట్లాడినా రాజకీయ నేతలు బహిరంగ విమర్శలకు ఎందుకు దిగుతున్నారనేది ఎవరికీ అర్థం కాకుండా తయారైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి చెందిన నేతలు కూడా నరసింహన్‌ను టార్గెట్ చేశారు. వీరి విమర్శలను గవర్నర్, అటు కేంద్రం పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించటం లేదు. అయితే ఈ నాయకుల విమర్శలతో గవర్నర్ పదవి చులకనైపోయిందని ప్రజల్లో, విజ్ఞుల్లో వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.



ఫామ్‌బోర్డు ఏర్పాటుకు సహకరించండి

సురవరం, చాడకు గౌడ సంఘం వినతి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : గ్రామీణ ఖాదీ బోర్డు, కోకోనట్ బోర్డు తరహాలో కల్లు, తాటి ఉత్పత్తుల కోసం ఫామ్‌బోర్డు ఏర్పాటుకు సహకరించాలని తెలంగాణ గౌడ సంఘం సీపీఐకి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డికి తెలంగాణ గౌడ సంఘం వినతిపత్రం సమర్పించింది. ఫామ్‌బోర్డు ఏర్పాటు ద్వారా పరిశోధక కేంద్రాన్ని ఏర్పాటు చేసి హైబ్రీడ్ తాటి, ఈత చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించి గీత వృత్తిని కాపాడాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. వనం పెంచుకోవడం కోసం గీత సహకార సంఘాలకు ప్రభుత్వ లేదా ప్రైవేటు భూమిని కేటాయించాలని, చెట్టుపై నుండి పడి మరణించిన గీత కార్మికునికి నష్టపరిహారం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, కుటుంబ పోషణకు రూ.10 వేల చొప్పున పెన్షన్ చెల్లించాలని వినతిపత్రంలో విన్నవించారు. కల్లుదుకాణాల లైసెన్సు కాలపరిమితిని ఐదు సంవత్సరాల నుండి 10 సంవత్సరాలకు రెన్యువల్ చేయాలని, గీత వృత్తిదారులకు గౌడ వసతిభవనం, ఎడ్యుకేషనల్ అకాడమి కోసం జంటనగరాల్లో, రంగారెడ్డి జిల్లాలో 10 ఎకరాల భూమి, రూ.20 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గీత పారిశ్రామిక ఆర్థిక సంక్షేమ సంస్థకు పాలకమండలిని నియమించి, వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని, చెట్లు ఎక్కడానికి గీత కార్మికులకు ఆధునిక పరికరాలు అందజేయాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించాలని కోరారు. ఆయన ఏడున్నర నెలల పాటు గోల్కొండ కోటను పాలించిన తొలి బడుగు, బలహీన వర్గాల చక్రవర్తి అని, ఆయన చరిత్రను పాఠ్యాంశంగా చేర్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సురవరం, చాడకు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన ప్రతినిధి బృందంలో తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు గౌడ్, కార్యదర్శి గూడ అయిలయ్య తదితరులు ఉన్నారు.

యు-19...

ప్రపంచ కప్ సెమీస్‌లో భారత్

30న పాకిస్థాన్‌తో 'ఢీ'



క్వీన్స్‌టౌన్: అండర్-19 ప్రపంచకప్‌లో భారత కుర్రాళ్ల జైత్రయాత్ర కొనసాగుతోంది. హ్యాట్రిక్ విజయాలతో అజేయంగా నాకౌట్‌కు దూసుకొచ్చిన యువ భారత్ సెమీస్‌లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ పోరులో బంగ్లాదేశ్‌పై 131 పరుగుల తేడాతో విజయం సాధించింది.

క్వీన్స్‌టౌన్‌లో జరిగిన ఈ నాకౌట్ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన పృథ్వీసేన బంగ్లాను చిత్తు చేసి, ఈ నెల 30న జరిగే సెమీస్‌లో దాయాది పాకిస్థాన్‌తో తలపడనుంది. శుక్రవారం బంగ్లాతో జరిగిన మ్యాచ్‌లో.. ముందుగా టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకొని, 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌట్ అయింది. శుభమ్ గిల్(86), అభిషేక్ శర్మ(50) అర్ధ సెంచరీలతో ఆకట్టుకోగా, కెప్టెన్ పృథ్వీషా(40) మరోసారి రాణించాడు. బంగ్లా బౌలర్లలో ఒనిక్ 3, నయీమ్ హసన్, సైఫ్ హసన్ తలో రెండు వికెట్లు తీశారు.

అనంతరం కష్ట సాధ్యంకాని లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాకు భారత బౌలర్లు షాకిచ్చారు. వరసగా వికెట్లు కూలుస్తూ బంగ్లా బ్యాట్స్‌మన్‌ను గడగడలాడించారు. భారత బౌలర్ల దెబ్బకు బంగ్లా 42.1 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో నాగర్‌కోటి 3, మవీ, అభిషేక్ శర్మ తలో రెండు వికెట్లు పడగొట్టారు. బంగ్లా బ్యాట్స్‌మన్లలో ఓపెనర్ పీకన్ ఘోష్(43) మినహా మిగతావారు ఘోరంగా విఫలమైయారు.

కోహ్లి...మళ్లీ రికార్డు సృష్టించాడు...

జోహన్నెస్‌బర్గ్: ఇప్పటికే ఎన్నో రికార్డులను తన పేరిట లిఖించుకున్న టీమిండియా కెప్టెన్ మరో మైలురాయిని అందుకున్నాడు. భారత తరపున అత్యధిక టెస్టు పరుగులు సాధించిన కెప్టెన్‌గా కోహ్లి రికార్డు నెలకొల్పి, ఎంఎస్ ధోని పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేశాడు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న చివరిదైన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో కోహ్లి ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో కోహ్లి 40 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఉండగా భారత కెప్టెన్‌గా అత్యధిక పరుగుల రికార్డును చేరుకున్నాడు. టెస్టు కెప్టెన్‌గా కోహ్లి 57 ఇన్నింగ్స్‌లో 3,455 పరుగులు సాధించగా, ధోని 96 ఇన్నింగ్స్‌ల్లో 3,454 పరుగులు సాధించాడు. ఆ తర్వాత స్థానాల్లో సునీల్ గవాస్కర్(3,449 పరుగులు-74 ఇన్నింగ్స్‌లు), మొహ్మద్ అజహరుద్దీన్(2,856 పరుగులు-68 ఇన్నింగ్స్‌లు), సౌరవ్ గంగూలీ(2,561 పరుగులు-75 ఇన్నింగ్స్‌లు) లు ఉన్నారు.

● ఆస్ట్రేలియా ఓపెన్ మహిళా ఫైనల్స్

సిమోనా హలెప్, వొజ్నియాకి టైటిల్ పోరు నేడే

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ క్రీడాకారిణి, రొమేనియా టెన్నిస్ ప్లేయర్ సిమోనా హలెప్ మహిళా టైటిల్ కోసం జరగనున్న పోరులో డెన్మార్క్ క్రీడాకారిణి వొజ్నియాకితో అమితుమి తేల్చుకోనుంది. టైటిల్ కోసం ఇరువురి మధ్య హోరాహోరిగా పోరు సాగనుంది. శారీరక బలం కన్నా మానసిక బలంతో ప్రత్యర్థిని ఎదుర్కొనే సిమోనా హలెప్ టైటిల్ ఫేవరెట్‌గా ఉంది. టైటిల్ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్న ఫైనల్ పోరులో తన సత్తా ఎలా చాటుతుందో చూడాలి.

దక్షిణాఫ్రికా లక్ష్యం 241..

మూడో టెస్టు మూడో ఇంకో మలుపు తిరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో 187 పరుగులకే ఆలౌట్ అయిన టీం ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో కాస్త తేరుకొని 247 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికాకు 241 లక్ష్యాన్ని నిర్దేశించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి సఫారీలు ఒక వికెట్ నష్టపోయి 17 పరుగులు చేశారు.



జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండియా 241 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. తన రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 247 పరుగులకు ఆలౌట్ కావడంతో పోరాడే లక్ష్యాన్ని సఫారీల ముందుంచింది. శుక్రవారం 49/1 ఓవర్ నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమిండియా.. మరో 198 పరుగులు చేసి మిగతా తొమ్మిది వికెట్లను కోల్పోయింది. ఈ రోజు ఆటలో కేఎల్ రాహుల్(16), చతేశ్వర పుజారా(1) స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరి నిరాశపరిచారు.

ఆ క్రమంలో ఓవర్‌నైట్ ఆటగాడు మురళీ విజయ్‌కు జత కలిసిన కెప్టెన్ విరాట్ కోహ్లి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ నాల్గో వికెట్‌కు 43 పరుగులు జోడించిన తర్వాత విజయ్(25బీ127 బంతుల్లో 1 ఫోర్) అవుటయ్యాడు. అటు తరువాత కోహ్లి-రహానేల జోడి ఇన్నింగ్స్ మరమ్మత్తులు చేపట్టింది. కాగా, రబడా బౌలింగ్‌లో కోహ్లి(41) బౌల్డ్ కావడంతో 134 పరుగుల వద్ద భారత్ జట్టు ఐదో వికెట్‌ను నష్టపోయింది. హార్దిక్ పాండ్యా(4) కూడా వెంటనే నిష్క్రమించడంతో భారత జట్టు రెండొందల పరుగులు చేయడం కష్టంగా అనిపించింది.

ఈ తరుణంలో రహానే -భువనేశ్వర్ కుమార్‌ల జోడి 55 పరుగుల్ని జత చేయడంతో భారత్ తేరుకుంది. అయితే రహానే(48) హాఫ్ సెంచరీకి దగ్గరగా ఏడో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో భువీకి జత కలిసిన మొహ్మద్ షమీ దూకుడుగా ఆడాడు. 28 బంతుల్లో రెండు సిక్సర్లు, 1 ఫోర్‌తో 27 పరుగులు సాధించి విలువైన భాగస్వామ్యాన్ని జత చేశాడు. ఇక తొమ్మిదో వికెట్‌గా భువీ(33 పరుగులు 76 బంతుల్లో 2 ఫోర్లు) అవుట్ కాగా, చివరి వికెట్‌గా బూమ్రా(4) పెవిలియన్ చేరడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. ఇషాంత్ శర్మ(7 నాటౌట్) అజేయంగా క్రీజ్‌లో మిగిలాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబడా, మోర్నీ మోర్కెల్, ఫిలాండర్ తలో మూడు వికెట్లు సాధించగా, ఎన్‌గిడికి ఒక వికెట్ దక్కింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికాకు షమీ తొలి వికెట్ తీసీ షాకిచ్చాడు. ఓపెనర్ ఎయిడెన్ మార్క్రం(4)ను పెవిలియన్ పంపాడు. ఆమీష్ ఆమ్లా 11 పరుగులు, డీన్ ఎల్గార్ 2 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. చివర్లో వర్షం ఆటకు అంతరాయం కల్గించింది.

భారత్ స్కోరు : 187 & 247
దక్షిణాఫ్రికా : 194 & 17/1 లక్ష్యం...241

సింధుపై సైనా నెహ్వాల్ గెలుపు



జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన భారత క్రీడాకారిణి సైనా నెహ్వాల్ మన దేశానికే చెందిన మూడో ర్యాంక్ ప్లేయర్ పీవీ సింధుపై ఘన విజయం సాధించింది. సింధుపై తన ఆధిపత్యాన్ని రెండవ సారి నిరూపించింది. మహిళల సింగిల్స్‌లో భాగంగా క్వార్టర్ ఫైనల్ పోరులో సైనా 21-13, 21-19 తేడాతో గెలిచి సెమీస్‌లోకి ప్రవేశించింది. తొలి గేమ్‌ను సునాయాసంగా గెలిచిన సైనా రెండో గేమ్‌లో శ్రమించాల్సి వచ్చింది. చివరకు తన అనుభవాన్ని ఉపయోగించిన సైనా రెండో గేమ్‌ను గెలవడంతో పాటు సెమీస్ బెర్తును కూడా ఖరారు చేసుకుంది. 37 నిమిషాల్లో ముగిసిన పోరులో సైనా ఏకపక్ష విజయం సాధించడం విశేషం. మరొకవైపు తొలి గేమ్‌ను కోల్పోయిన సింధు రెండో గేమ్‌లో తుది వరకూ పోరాడింది. అయితే, చివర్లో అనవసర తప్పిదాలు చేయడంతో సింధు ఓటమి పాలైంది. ఇప్పటివరకూ సైనా-సింధులు అంతర్జాతీయ వేదికపై మూడుసార్లు తలపడగా రెండు సార్లు సైనానే గెలుపొందింది. 2014లో సింధుపై సైనా తొలిసారి గెలవగా, 2017 ఇండియా ఓపెన్‌లో సైనాను సింధు ఓడించింది. తాజాగా జరిగిన పోరులో మరొకసారి సైనా గెలిచి సింధుపై తన ఆధిక్యాన్ని 2-1కు పెంచుకుంది.

ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్

రెండో గ్రాండ్ స్లామ్ టైటిల్ చేరువలో బోపన్న



మెల్‌బోర్న్ : భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న తన హంగేరియన్ సహచరిణి టిమియో బబోస్‌తో ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ ఫైనల్ చేరాడు. శుక్రవారం మార్సెలో డెమోలినర్(బ్రెజిల్), మారియా జోస్ మార్టినెజ్ సాంచెస్(స్పెయిన్) జంటను సెమి ఫైనల్లో 7-5, 5-7, 10-6 సెట్లతో ఓడించి బోపన్న, బబోస్ ఫైనల్లో ప్రవేశించారు. బోపన్న, గాబ్రియేల్ దబ్రోస్కీ(కెనడా)తో తన మొదటి గ్రాండ్ స్లామ్ 2017 ఫ్రెంచ్ ఓపెన్‌ను గెల్చుకున్నాడు. అయితే, దబ్రోస్కీ ప్రస్తుతం బోపన్న జోడి ప్రత్యర్థి. దబ్రోస్కీ, మేట్ పవిక్(క్రొయోషియా)తో ఇంతకు ముందే ఫైనల్లో ప్రవేశించారు.

ఫైనల్లో ఫెదరర్ వర్సెస్ సిలిక్

మెల్‌బోర్న్: ఊహించనట్లుగానే ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీలో స్విస్ దిగ్గజ ఆటగాడు, డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్‌లో భాగంగా శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్ పోరులో దక్షిణ కొరియాకు చెందిన అన్‌సీడెడ్ హైన్ చుంగ్ మ్యాచ్ మధ్యలో రిటైర్డ్ అయ్యాడు. తొలి సెట్‌ను ఫెదరర్ 6-1తో గెలవడమే కాకుండా రెండో సెట్‌లో 5-2తో ఆధిక్యంతో దూసుకెళ్తున్న సమయంలో హైన్ చుంగ్ అర్ధాంతరంగా మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. దాంతో ఫెదరర్ మ్యాచ్ పూర్తిగా ఆడకుండానే ఫైనల్‌కు చేరాడు. ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీ ఫైనల్‌కు ప్రవేశించిన మొదటి క్రొయేషియా ఆటగాడు మారిన్ సిలిక్. ఆదివారం జరిగే తుది పోరులో సిలిక్‌తో ఫెదరర్ టైటిల్ కోసం పోరాడనున్నాడు.

ఐపీఎల్ ఆక్షన్-2018 షురూ..

• రవీంద్రన్ అశ్విన్, బెన్ స్టోక్స్‌లవైపే చూపు
• 578 ఆటగాళ్లు
• ఐపీఎల్-2018కు నేడు ఆక్షన్..





బెంగళూరు: ఐపీఎల్-2018 వేలం పాట నేడు బెంగళూరులో ఆరంభంకానుంది. . ప్రపంచ ప్రఖ్యాత స్టార్ క్రికెటర్లు శని, ఆదివారం బెంగళూరులో జరిగే ఆక్షన్‌ల్లో తమ ధర ఎంతో తేల్చుకోనున్నారు. రవీంద్రన్ అశ్విన్, యువరాజ్ సింగ్, గౌతం గంభీర్, బెన్ స్టోక్స్‌లు అత్యంత భారీ బిడ్డింగ్ పలకనున్నారు. దాదాపు 578 ఆటగాళ్ల ఆక్షన్ రెండు రోజులు కొనసాగనుంది. భారత్ సంబంధిం చినంత వరకు 361 మంది క్రికెటర్లు...అందులో 16 టాప్ ప్లేయర్లు.. గతేడాది ఆరౌండర్ బెన్ స్టోక్స్ అన్ని రికార్డులు బద్దలు కొడుతూ..రూ.14.5 కోట్ల ధర పలికాడు. ఇక భారత్ ఆటగాళ్ల విషయంలో బ్యాటింగ్, బౌలింగ్ చేసే సత్తా ఉన్న కేదార్ జాదవ్‌కు మళ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున పిలుపు రావచ్చు. మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ యాదవ్, యజ్వేందర్ చాహల్‌కు మంచి డిమాండు ఉంది. అందరి చూపు కేఎల్ రాహుల్, మనీష్ పాండే, దినేష్ కార్తిక్ వైపుంది. స్పిన్నర్ల అవసరం టీ20కు ఎప్పుడూ ఉండనే ఉంది. ఈ నేపథ్యంలో ఆఫ్ఘాన్ సంచన ఆటగాడు రషీద్ ఖాన్ అర్మాన్‌కు 'భారీ పిలుపు' రావచ్చు. ఎంఎస్ ధోని, బ్రావోకు ఎప్పటిలానే డిమాండు కొనసాగుతుంది. రాజస్థాన్ రాయల్స్, కింగ్స్ పంజాబ్ ఎలవెన్, ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌లు ఆక్షన్ పరుగులో ముందుండేందుకు పోటీ పడుతున్నారు. వేచి చూడాలి...ఎవరెంత ధర పలుకుతారో...

ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుందాం

సీపీఐ కేంద్ర కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలో నారాయణ పిలుపు




విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ : రిపబ్లిక్ డే ఉత్సవాలు శుక్రవారం న్యూఢిల్లీ లోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో ఘనంగా జరిగాయి. పార్టీ కార్యదర్శి నారాయణ మువ్వన్నెల పతాకాన్ని ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లబ్ సేన్ గుప్తా, బినయ్ విశ్వంతో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ బీజేపీ పాలనలో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలుగు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ముందుకు రావాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసే కమ్యూనిస్ట్ పార్టీల గొంతు నొక్కే ప్రయత్నం పాల కులు చేస్తున్నారని గుర్తు చేశారు. బలహీన వర్గాలు, దళితులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని, కాషాయ మూకలే ఈ విధంగా చేస్తున్నాయని మండిపడ్డారు.

ఏపీ, తెలంగాణ భవన్‌లో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్‌లో 69 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహించాయి. గణతంత్ర దినోత్సవంలో భాగంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్ అనంతరం మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తు న్నాయని తెలిపారు. నూతన సంస్కరణలు, సరికొత్త ఆలోచనలతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందు వరుసలో ఉందని ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్ గుర్తు చేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులు ఇప్పటికే కేంద్ర మంత్రిత్వ శాఖలు, సంస్థల మన్ననలను పొందిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న మరిన్ని సంస్కరణలతో ప్రపంచ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక గుర్తింపును సాధించుకుంటుందని ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

గణతంత్ర దినోత్సవంలో భాగంగా పిల్లలకు, సిబ్బందికి, పోలీసులకు తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్ స్వీట్లు పంపిణీ చేశారు. ఢిల్లీ తెలంగాణ భవన్‌లో జరిగిన 69 వ గణతంత్ర వేడుకల్లో తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్‌తో పాటు, తెలంగాణ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, సహాయ కమిషనర్ రామ్మోహన్, తెలంగాణ భవన్ సిబ్బంది, స్కూల్ విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.



విదేశాల్లో ఘనంగా రిపబ్లిక్ డే



బీజింగ్/సింగపూర్ : విదేశాలలోని భారతీయులు శుక్రవారం 69వ గణతంత్ర దినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విదేశాల్లోని భారతీయులలో దేశభక్తి వెల్లువెత్తింది. ఈ సందర్భంగా త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చైనాలో భారత రాయబారి గౌతం బంబ్వాలే బీజింగ్‌లోని రాయబార కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతినుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన ప్రసంగం పాఠాన్ని చదివి వినిపించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 300 మందికిపైగా భారతీయులు, భారతీయ దౌత్యవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జకర్తాలోని భారత రాయబార కార్యాలయంలో కూడా గణతంత్ర వేడుకలు నిర్వహించారు. రాయబార కార్యాలయ ఆవరణలో ప్రకాశ్ గుప్తా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పెద్ద సంఖ్యలో భారతీయులు, ప్రవాసభారతీయ సభ్యులు ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలి, మీదాన్‌లోని ఇండియన్ కాన్సులేట్లలో కూడా పతాకావిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. సింగపూర్‌లో 600 మందికి పైగా భారతీయులు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. తాత్కాలిక హై కమిషనర్ నినాద్ ఎస్ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్రపతి ప్రసంగాన్ని దేశ్‌పాండే చదివి వినిపించారు. వివిధ పాఠశాలల్లోని భారతీయ విద్యార్థులు దేశభక్తి గేయాలను ఆలపించారు. అక్కడి భారతీయులందరికి హైకమిషన్ విందు ఇచ్చింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.